
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ  fb.com/vaartha

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-2-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 17 పేజీలు: 10+4 వెల: 6.50


**రాంచి స్టేషన్‌లో తొక్కిసలాట: స్పృహతప్పిన మహిళలు** 5లో

**ప్రార్థనా మందిరాల చట్టంపై అదనపు పిటిషన్లకు 'నో'**

# జిబిఎస్ కేసులపై హై అలర్ట్

## ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తం కావాలి..

## నియంత్రణ మందులు అందుబాటులో ఉంచాలి

## లక్ష మందిలో ఒక్కరికి సోకే అరుదైన వ్యాధి

## గుంటూరు, విశాఖలో 5 కేసులు చొప్పున నమోదు



సోమవారం జిబిఎస్ కేసులపై సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఫిబ్రవరి17,ప్రభాతవార్తప్రతినిధి:** జిబిఎస్ వ్యాధిపట్ల ప్రజలెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. జిబిఎస్ కేసులను గుర్తించే విషయంలో అలసత్వం ఉండకూడదన్నారు.ఎక్కడిక్కడ వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తం కావాలి, ప్రతి ఆస్పత్రిలో నియంత్రణ, నివారణ మందులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ వ్యాధిపై ప్రజల్లో అపోహలు తొలగించాలని వైద్యాధికారులను సూచించారు. ఆసుపత్రుల్లో అత్యవసర మెడిసిన్స్, ఇంజక్షన్లు అందుబాటులో ఉంచాలన్నారు. సోమవారం ఉదయం జిబిఎస్ కేసులపై సిఎం చంద్రబాబు తన వ్యక్తిగత కార్యాలయంలో ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు.ఏపీలో గులియన్-బారీ సిండ్రోమ్ కేసులు పెరుగుతున్నాయి. ప్రస్తుతం 17 జిబిఎస్ కేసులు నమోదయ్యాయి. ఇంకా కొన్ని చోట్ల కేసులు పెరుగుతున్నాయి.

ఆరు జిల్లాల్లో జిబిఎస్ కేసులు నమోదయినట్లు అధికారులు గుర్తించారు. విజయనగరం, విజయవాడ, అనంతపురంలో ఒక్కో కేసు చొప్పున కాకినాడలో 4, గుంటూరు మరియు విశాఖలో 5 చొప్పున జిబిఎస్ కేసులు నమోదు అయ్యాయి. ఈ నరాల సంబంధిత వ్యాధి కేసులు రాష్ట్రంలో ఒక్కసారిగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. లక్ష మందిలో ఒక్కరికి మాత్రమేసోకే అత్యంత అరుదైన వ్యాధిగా జిబిఎస్ సిండ్రోమ్ గుర్తించబడింది. రోగనిరోధక శక్తిని జిబిఎస్ సిండ్రోమ్ నశింపజేస్తుంది. అతిగా ఇన్ఫెక్షన్లు, వాక్సిన్‌లు, సర్జరీలు ట్రామా, జన్యుపరంగానూ జిబిఎస్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. కండరాల బలహీనత, తిమ్మిరి, నడవలేకపోవటం, మింగలేకపోవటం, శ్వాస ఆడకపోవటం లాంటివి ఈ జిబిఎస్ వ్యాధి లక్షణాలు, ఇంట్రా వీనస్ ఇమ్యూన్లో గ్లోబిన్ ఇంజెక్షన్ చేయించుకోవాలని వైద్యారోగ్యశాఖ సూచిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 8వేల వ్యాక్సిన్లను >>2



# 2060కి భారత్ జనాభా 170 కోట్లు!

**చైనాను దాటి ముందుకు..**

**ఐక్యరాజ్య సమితి అంచనా**

**50 నుంచి 60 శాతం పెరగనున్న ప్రపంచ జనాభా**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** శరవేగంగా అభివృద్ధిచెందుతున్న భారత్ ప్రపంచదేశాలన్నింటికంటే అత్యధిక జనాభా కలిగిన దేశంగా మారుతోంది. 2060 నాటికి 170 కోట్లమంది జనాభా ఉన్న దేశంగా భారత్ నిలుస్తుందని ఆ తర్వాత 12 శాతం తగ్గుతుందని కూడా ఐక్యరాజ్యసమితి అంచనావేసింది. దీనితో 2060 నాటికి భారత్‌ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశంగా నిలుస్తున్నట్లు ప్రకటించింది. 2024 ప్రపంచ జనాభా >>2



# కొత్త సిఇసిగా జ్ఞానేష్ కుమార్

## మరొక కమిషనర్‌గా వివేక్‌జోషి

**గెజిట్ నోటిఫికేషన్ జారీచేసిన రాష్ట్రపతి**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** కేంద్ర ఎన్నికలసంఘం ప్రధాన కమిషనర్‌గా ప్రస్తుత కమిషనర్‌జ్ఞానేష్ కుమార్ ఎంపియ్యారు. ప్రధాని నరేంద్రమోడీ, న్యాయశాఖమంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్, ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ సభ్యులుగా ఉన్న కమిటీ ప్రస్తుతం కమిషనర్‌గా ఉన్న జ్ఞానేశ్‌కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకానికి ఆమోద ముద్ర వేసింది. జ్ఞానేశ్‌కుమార్ ఇప్పటివరకూ పనిచేసిన కమిషనర్ స్థానంలో వివేక్‌జోషిని నియమించారు. మరోసభ్యుడు ఉత్తరాఖండ్ కేడర్‌కుచెందిన సుఖ్‌బీర్‌సింగ్ సంధు కొనసాగుతున్నారు.ఎంపిక కమిటీకి ఉన్న ప్యానెల్‌లో సభ్యునిగా ఉన్న ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ముందు అభ్యంతరం వ్యక్తంచేసారు. ఎన్నికల సంఘం నియామకాలపై సుప్రీంకోర్టులో >>2

# అన్ని రాష్ట్ర రాజధానుల్లో తిరుమలేశుని ఆలయం

## అంతర్జాతీయ దేవాలయాల సదస్సులో సిఎం చంద్రబాబు

## హాజరైన మహారాష్ట్ర సిఎం ఫడ్నవిస్, గోవా సిఎం ప్రమోద్ సావంత్ తదితరులు

## దేశంలో ఆలయాల ఆర్థిక విలువ రూ. 6 లక్షల కోట్లు



సోమవారం తిరుపతిలో జరిగిన అంతర్జాతీయ ఆలయాల సదస్సులో సిఎం చంద్రబాబుకు జ్ఞాపికను

**తిరుపతిరూరల్, ఫిబ్రవరి17 ప్రభాతవార్త:** భారతీయులు నివాసం ఉండే ప్రతి దేశంలోను బాలాజీ ఆలయాన్ని నిర్మించి, భారతీయులను ఆధ్యాత్మికత వైపు నడిపించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. దేశంలోని ప్రతి రాష్ట్ర రాజధానిలో శ్రీవారి ఆలయాన్ని ఏర్పాటు చేయాలన్నారు. తిరుపతి వేదికగా మూడురోజుల అంతర్జాతీయ దేవాలయాల సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర పడ్నవీస్, గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సులో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ఆధునిక పాలనతో విశ్వాసాన్ని మిళితంచేస్తూ, స్వీయ నిరంతర, సాంకేతికతతో నడిచే ఆలయ పర్యావరణ వ్యవస్థ గురించి వివరించారు. ఆలయ వారసత్వం, సాంకేతిక ఏకీకరణ, ఆలయ పర్యావరణ వ్యవస్థలో ఆర్థికాభివృద్ధికి సంబంధించిన ప్రాముఖ్యతను తెలిపారు. ఆలయ ఆర్థిక వ్యవస్థ, గ్లోబల్ హెరిటేజ్‌ను బలోపేతం చేయడంతో పాటు భారతదేశంలోని ఆలయ సంబంధిత కార్యకలాపాల ఆర్థిక విలువ రూ.6లక్షల కోట్ల రుపాయాలనితెలియజేసారు. దేవాలయాలలో పచ్చ >>2




సోమవారం కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్‌తో భేటీ అయిన చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

# గ్లోబల్ టెక్స్‌టైల్ హాబ్‌గా ఎపి

## రూ. 2వేల కోట్లతో 5 సంస్థల పెట్టుబడులు

## 15 వేల మందికి ఉపాధి అవకాశాలు

## రాష్ట్రంలో 35 హస్తకళలకు కేంద్రం గుర్తింపు

## త్వరలో పెట్టుబడిదారుల సదస్సు: మంత్రి సవిత

**విజయవాడ, ఫిబ్రవరి 17,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ టెక్స్‌టైల్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు పెట్టుబడులను ఆకర్షించేందుకు, మౌలిక సదుపాయాలను ఆధునీకరించేందుకు, కళాకారులు పారిశ్రామికవేత్తలకు ఊతం అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. సోమవారం కొత్త ఢిల్లీ వేదికగా భారత్ టెక్స్ 2025 ముగింపు కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా ఆయా రాష్ట్రాల పెట్టుబడుదారులతో ఆమె మాట్లాడుతూ సిఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం టెక్స్‌టైల్ రంగ అభివృద్ధి కట్టుబడి ఉందన్నారు. టెక్స్‌టైల్ పాలసీ 2024- 2029 ద్వారా పెట్టుబడులను పెంచడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం, వస్త్ర పరిశ్రమను బలోపేతం చేయడం ఉద్దేశంగా ఉందన్నారు. ఉత్పత్తిసామర్థ్యాన్ని పెంపొందించే పథకాలు, ఆర్థిక సహాయం, గ్లోబల్ >>2

# 20న ఢిల్లీ సిఎం ప్రమాణం

## రేపు జరగనున్న బిజెపి ఎల్పీ సమావేశం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** ఢిల్లీ కాబోయే ముఖ్యమంత్రి ఎవరన్నది 20వ తేదీ తేలిపోతుందని బిజెపినేతలు జోరుగా చర్చించుకుంటున్నారు. వాస్తవానికి సోమవారం ఢిల్లీలో ఎన్నికైన బిజెపి ఎమ్మెల్యేలతో శాసనసభా పక్ష సమావేశం జరగాల్సి ఉంది. అయితే ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట, మృతులు, గాయాపాలయిన బాధితుల సంఘటన జరగడంతో సమావేశాన్ని 19వ తేదీకి వాయిదా వేసింది. ఇదేరోజు సిఎం ఎంపికతోపాటు కేబినెట్ కూర్పుపైనా ప్రకటనలుచేస్తారని చెపుతున్నారు. ఈలోపు మంగళవారం మరోసారి సిఎం అభ్యర్థి అంశంపైహైకమాండ్ కసరత్తులుచేస్తుంది. 19వ తేదీ జాతీయ అధ్యక్షుడు జెపినడ్డా అధ్యక్షతన బిజెఎల్పీ సమావేశం జరుగుతుంది. ఆ భేటీలోనే సిఎం అభ్యర్థి పేరుప్రకటిస్తారని చెపుతున్నారు. కొత్తగా ఎన్నికైన బిజెపి ఎమ్మెల్యేలు సరాసరి లెఫ్టినెంట్ గవర్నర్ దగ్గకు వెళతారు. బిజెపి ఎల్పీనేత, కేబినెట్‌పేర్లు ఉన్న వివరాలు అందచేసి ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని అభ్యర్థిస్తారు. సిఎం అభ్యర్థి ఎంపికపై బిజెపి జాగ్రత్తగా వ్యవహరిస్తోంది.

అంతర్గతంగా పార్టీ చర్చలుజరిపింది. ఈలోపు ప్రధానిమోడీ విదేశీ పర్యటనకువెళ్లడంతో ఎంపిక ఆలస్యం కావడం, ఢిల్లీ రైల్వేస్టేషన్ విషాదంతో మరోసారి వాయిదాపడింది.19వ తేదీ సిఎల్పీ సమావేశానికి ఎమ్మెల్యేలతోపాటు పార్టీ జాతీయ కార్యదర్శులు కూడా హాజరవుతారు. బిజెపి పాలిత ప్రాంతాల్లో తరహాలోనే ఢిల్లీకి ఇద్దరు ఉప ముఖ్య మంత్రుల ప్రతిపాదనను అధిష్టానం సీరియస్‌గా పరిశీలిస్తోంది. 20వ తేదీ >>2

# వల్లభనేని కేసు: సత్యవర్ధన్ వాంగ్మూలం నమోదు చేసిన మేజిస్ట్రేట్

**విజయవాడ,ఫిబ్రవరి17,ప్రభాతవార్తప్రతినిధి:** గన్నవరం టిడిపి ఆఫీస్‌పై దాడి కేసులో మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచేందుకు సత్యవర్ధన్‌ను విజయవాడ కోర్టుకు పటమట పోలీసులు తీసుకువచ్చారు. మేజిస్ట్రేట్ ఎదుట సత్యవర్ధన్ 164 స్టేట్‌మెంట్‌ను పోలీసులు వీడియో రికార్డు చేయనున్నారు. గన్నవరం టిడిపి ఆఫీస్‌పై దాడి కేసులో పోలీసులకు సత్యవర్ధన్ ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఫిర్యాదు వాపస్ తీసుకోవాలంటూ సత్యవర్ధన్‌కు వల్లభనేని వంశీ నుంచి బెదిరింపుల రావడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో సత్యవర్ధన్ వాంగ్మూలాన్ని మేజిస్ట్రేట్ ఎదుట పోలీసులు మరోసారి రికార్డు చేయనున్నారు.

ఈ కేసు వెనక్కి తీసుకోవాలంటూ సత్యవర్ధన్‌తో పాటు అతడి ఇంట్లోని వారిని వంశీ బెదిరింపులకు పాల్పడ్డారని ఆకోపణ అందుకు సంబంధించిన ఈ మొత్తం వ్యవహారంలో వల్లభనేని >>2

# రాజధాని అమరావతిలో మరో రూ.3578కోట్లతో టెండర్లు 2లో

## 10లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో బంగ్లాలు అభివృద్ధి

# కదులుతున్న కల్తీ నెయ్యి డొంక

## 'మాజీ'లకు సిబిఐ నోటీసులు

## నేటితో నిందితుల కస్టడీ పూర్తి

## బెయిలు పిటిషన్ దాఖలుకు యత్నాలు



**తిరుమల,ఫిబ్రవరి 17ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూల తయారీకి స్వచ్ఛమైన ఆవునెయ్యి సరఫరా చేయాల్సిన టెండర్లు దక్కించుకున్న డైరీలు, కాంట్రాక్టర్‌లు కమీషన్లకు కక్కుర్తిపడి కల్తీనెయ్యి పంపిన కేసులో ఇప్పుడు కీలక మలుపుతిరుగుతోంది. ఇప్పటికే కల్తీనెయ్యి సరఫరాకు సంబంధించి పక్కా ఆధారాలు,రికార్డులు సేకరించిన సిబిఐ సిట్ బృందంలోని సిబిఐ జాయింట్ డైరెక్టర్ వీరేశ్‌ప్రభు, డిఐజి మురలీరాంభా నేతృత్వంలోని తిరుపతి అడిషనల్ ఎస్పీ వెంకట్రావు, డిఎస్పీలు, సిఐలు నలుగురు నిందితులను కస్టడీకి తీసుకుని విచారణ చేస్తున్నారు. నాల్గవరోజు సోమవారం ఉదయం నుండి సాయంత్రం వరకు న్యాయవాదుల సమక్షంలో పాత్రధారులైన ఏఆర్ డైరీ యాజమాన్యం ఎండి రాజశేఖరన్‌తోబాటు సరఫరా దారులు ఉత్తరప్రదేశ్‌కు, ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, షోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక) సిఇఒ అపూర్వ వినయ్‌కాంత్ చావ్డాలను పలు ప్రశ్నలతో సమాధానాలు రాబట్టారు. గత మూడురోజుల విచారణలోనే టిటిడికి నెయ్యి సరఫరా చేయడానికి టెండర్లులోపాల్గొనడం, నిబంధనలకు విరుద్ధంగా నెయ్యిని సరఫరాచేయడం, ఆఖరు రెండేళ్లలో నాణ్యతలేని కల్తీనెయ్యి సరఫరా చేశారని తేల్చారు. ఇందుకు గత పాలకమండలిలో ఇద్దరు పెద్దల పేర్లు నిందితులు వెల్లడించడంతో ఆ ఇద్దరిపై సిబిఐ సిట్ ఫోకస్ పెట్టింది. అసలు ఉత్తరాఖండ్‌లో ఉన్న డైరీ నుండి నెయ్యిసరఫరా చేయడానికి మూడేళ్లక్రిందట ఎలా అనుమతులిచ్చారు? దీనివెనుక ఎవరున్నారనేది తేల్చిన సిట్ అధికారులు తమిళనాడు ఏఆర్ డైరీపైనే ప్రత్యేక దృష్టి సారించి కీలకులను విచారణకు పిలవనున్నారు.

**ఆ ఇద్దరిలో తమిళనాడు మాజీనే కీలకమట!:**

టిటిడిలో సర్వంతానై చక్రం తిప్పిన ఓ కీలక వ్యక్తి నెయ్యిసరఫరాలో కూడా తనదైన పాత్ర పోషించారనేది ఇప్పుడు సిట్ చేతిలో ఉన్న ఆధారాలు. అంతేగాక తమిళనాడుకు చెందిన ఓ ప్రముఖ వ్యాపారవేత్త, మాజీ టిటిడి బోర్డు సభ్యుడి వ్యవహారంపై సిట్ అధికారులు పూర్తిస్థాయిలో సమాచారం రాబట్టారు. ఆయన ఆధ్వర్యంలోనే ఈ తతంగం మొత్తం నడిచిందని తెలుస్తోంది. నాల్గవరోజు కస్టడీలో ఉన్న ఆనలుగురు చెబుతున్న సమాధానాలకు సిట్ అధికారులు విస్తుబోయే విషయాలు బయటకు రావడంతో ఇప్పుడు ఇద్దరు >>2

# న్యాక్ లంచం కేసులో 10 మందికి బెయిలు నిరాకరణ

## సిబిఐ కోర్టు తీర్పు

**విజయవాడ క్రైం,ఫిబ్రవరి 17,ప్రభాతవార్త:** కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్-ఎన్‌ఎఎసికి లంచం ఇచ్చినట్లుగా ఆరోపిస్తూ సిబిఐ అధికారులు నమోదు చేసిన కేసులో 10 మంది నిందితులకు బెయిలును నిరాకరిస్తూ విజయవాడ సిబిఐ కోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.పిటీషన్‌లోని వివరాల ప్రకారం గుంటూరుకు చెందిన కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్‌కు చెందిన కెఎల్‌ఇఎఫ్ వైస్ ఛాన్సలర్ జిపి సారథి వర్మ, యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ కోనేరు రాజా హరీన్,కెఎల్‌యు హైదరాబాద్ క్యాంపస్ డైరెక్టర్ ఎ.రామకృష్ణ,న్యాక్ మాజీ డిప్యూటీ అడ్వైజర్ ఎల్.మంజునాథరావు, ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ (ఐక్యూఎసి-నాక్) డైరెక్టర్ ఎం.హనుమంతప్ప,కమిటీ సభ్యులు సమరేంద్రనాథ్ సాహా,ఛైర్మన్ సమరేంద్రనాథ్ సహాతో పాటు పలువురిని నిందితులిగా సిబిఐ చేర్చింది. ఈ కేసులో ఇప్పటి వరకు అరెస్ట్ అయిన వారిలో రాజేష్ సింగ్ పవార్,మానస్‌కుమార్ మిశ్రా, గాయత్రి దేవారాజా, బులు మహారాణా కూడ ఉన్నారు.తమకు బెయిలును మంజూరు చేయాల్సిందిగా కోరుతూ సిబిఐ కోర్టులో పై నిందితులు పిటీషన్‌ను దాఖలు చేశారు. సిబిఐ నమోదు చేసిన కేసు వివరాల ప్రకారం గుంటూరు జిల్లా లోని వడ్డేశ్వరంలో ఉన్న డీమ్డ్ టు బి యూనివర్సిటీ అయిన కెఎల్‌ఇఎఫ్, ఎన్‌ఎఎసి ద్వారా ఎ++ గ్రేడ్‌లో గుర్తింపు పొందింది. 2024 నుండి 2029 కాలానికి ఎన్‌ఎఎసి ద్వారా తిరిగి గుర్తింపు పొందేందుకు విశ్వవిద్యాలయ ఆఫీసు బేరర్లు నగదు,ఎలక్ట్రానిక్ పరికరాలు,బంగారు ఆభరణాలను ఆఫర్ చేసినట్లు దాంతో >>2



సోమవారం ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంవద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న మంత్రిలోకేష్ దంపతులు, కుమారుడు

# 'మహాకుంభ్'లో మంత్రి లోకేష్

**విజయవాడ ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రయాగరాజ్ మహా కుంభమేళాలో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ దంపతులు పుణ్యస్నానాలు చేశారు. త్రివేణి సంగమం షాహి స్నానఘట్టంలో సాంప్రదాయబద్ధంగా స్నానాన్ని ఆచరించి గంగాదేవికి పూజలు చేసి, హారతులు ఇచ్చారు. పితృదేవతలను స్మరించుకుంటూ బ్రాహ్మణులకు వస్త్రదానం చేశారు. పూర్వీకులకు మోక్ష మార్గాన్ని ప్రసాదించాలంటూ గంగాదేవిని ప్రార్థించారు. కుంభమేళా ప్రాంగణంలో ప్రతిధ్వనించే కీర్తనలు, నదీ సంగమం వద్ద పవిత్ర పూజల మధ్య ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో లోకేష్ దంపతులు మమేకమయ్యారు. మహా కుంభమేళా ఆధ్యాత్మిక కార్యక్రమం మాత్రమే కాదు.. ఇది భారతదేశ సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వం. నమ్మకం, ఆచారాలు, ఆధ్యాత్మిక జ్ఞానంతో ముడిపడి ఉన్న శక్తిమంతమైన వేడుక. మానవత్వం, ఆధ్యాత్మికత మధ్య సంబంధాన్ని, లోతుగా నాటుకుపోయిన భారతజాతి విలువలను ప్రతిబింబిస్తుంది. పవిత్ర నదుల్లో ఆచరించే స్నానం, దానం, హృదయ పూర్వకమైన భక్తి మోక్ష మార్గాన్ని చూపిస్తాయని కోట్లాదిమంది నమ్మకం. కుంభమేళాలో స్నానాలు, పూజాధికాల అనంతరం లోకేష్ దంపతులు కాశీ విశ్వేశ్వరుని ఆలయాన్ని సందర్శించేందుకు వారణాసి బయలుదేరి వెళ్లారు.

**కుంభమేళాలో మంత్రినారా లోకేశ్ దంపతులు...కుమారుడితో సెల్ఫీ...**

మంత్రి నారా లోకేశ్ ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో పర్యటనలో భాగంగా మహా కుంభమేళాలో తన సతీమణితో కలిసి పుణ్యస్నానం ఆచరించారు. నిజమైన ఆశీర్వచనం లభించిందంటూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ఈ సందర్భంగా తన తనయుడు నారా దేవాన్ష్‌తో కలసి కుంభమేళాలో దిగిన సెల్ఫీని షేర్ చేసుకున్నారు. మరోవైపు, ప్రయాగ్‌రాజ్ కొనసాగుతున్న కుంభమేళాకు సామాన్యభక్తులతో పాటు ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఆదివారం ఒక్కరోజే సాయంత్రం 6 గంటల వరకు 1.36 కోట్ల మంది భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు వచ్చినట్లు యూపి ప్రభుత్వం వెల్లడించింది. దీంతో నిన్నటివరకు మొత్తంగా 52.83 కోట్ల మంది కుంభమేళాలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు తెలిపింది.

# జిబిఎస్ కేసులపై హై అలర్ట్

>> అందుబాటులో ఉంచినట్టు వైద్యారోగ్యశాఖ అధికారులు సమావేశంలో సిఎం చంద్రబాబుకు తెలిపారు. జిబిఎస్ రోగులకు సరిపడా ఇమ్యూనోగ్లోబిన్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. చికిత్స తీసుకోకుండానే చాలావరకు వ్యాధి తగ్గిపోతుందని చెప్పారు ఎన్టీఆర్ వైద్య సేవకింద ఉచిత చికిత్సను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. జిబిఎస్ బాధితెలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యారోగ్యశాఖ ప్రకటించింది. ఈ ఇంజెక్షన్లను తీసుకోకుండానే 80 శాతం మంది రికవరీ అయ్యారని వెల్లడించింది. కార్డియాలజీ, న్యూరాలజీ జనరల్ మెడిసిన్ విభాగాల్లో అత్యవసర మందులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిబిఎస్ వ్యాధి గురించి వివిధ జిల్లాల్లో వార్తలు వస్తున్న నేపథ్యంలో దానికి అత్యవసరమైన ఇమ్యూనోగ్లోబ్యులిన్ ఇంజక్షన్లు అందుబాటులో ఉంచాలన్నారు. జిబిఎస్ రోగులకు ఎన్టీఆర్ వైద్యసేవల ద్వారా చికిత్స అందించాలన్నారు. చికిత్స తీసుకోకుండానే చాలావరకు ఈ వ్యాధి తగ్గుతుందన్నారు. జిబిఎస్ వ్యాధి కాళ్లలో ప్రారంభమై పైవరకు వ్యాపిస్తుందన్నారు. పరిశుభ్రత విషయంలో ప్రజలు జాగత్తగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. తిమ్మిర్లు, నడవలేని స్థితిలో ఉంటే ప్రభుత్వ ఆస్పత్రికి రావాలన్నారు. షుగర్ రోగులకు అవసరమైన ఇన్సులిన్ ఇంజక్షన్, హీమోఫిలియా రోగులకు అవసరమైన ఫ్యాక్టర్ ఇంజక్షన్ కూడా అన్ని ఆసుపత్రుల్లో అందుబాటులో పెట్టుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. గుండె జబ్బులతో ఇబ్బంది పడుతున్న వారికి అవసరమైన టేనెక్ట్ ప్లే ఇంజక్షన్లు విస్తృతంగా స్టాక్ ఉంచుకోవాలన్నారు. మామూలు మార్కెట్లో వీటి ధరలు అందరికీ అందుబాటులో ఉండవని ప్రాణాలు నిలబెట్టే ఈ ఇంజెక్షన్లను నిరుపేదలకు అందుబాటులో ఉంచడానికి అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉంచాలన్నారు. జిబిఎస్ కేసులు ఇతర జిల్లాల్లో నమోదవు తున్నందున దానికి సంబంధించి అవగాహన కూడా కల్పించాలని ఆయన సూచించారువేళ్లు, మడమలు, మణికట్టు వంటి చోట్ల చిన్నగా నొప్పులు వస్తాయి. నిరంతరం తగ్గకుండా.. చిన్నపాటి నొప్పి వేధిస్తుంటుంది. మొదట్లో కాళ్లు, చేతులు నెమ్మదిగా బలహీనం అవుతాయి. కాళ్లు, చేతుల్లో తిమ్మిర్లు, మంటగా అనిపించడం ప్రాథమిక లక్షణాల్లో కనిపిస్తాయని వైద్యులు అంటున్నారు. తర్వాతి దశలో సరిగ్గా నడవలేకపోవడం, తూలడం జరుగుతుంటుంది. ఈ దశలో ఎట్టిపరిస్థితుల్లో వైద్యుల్ని సంప్రదించాలని సూచిస్తున్నారు. ఈ దశ దాటితే.. నోరు వంకర పోవడం, మాట్లాడడం, నమలడం, మింగడంలో ఇబ్బందులు తలెత్తవచ్చు. శరీరంలో వైరస్ వ్యాప్తి మరింత ఉధృతంగా ఉంటే.. కంటి చూపు మందగిస్తుందని చెబుతున్నారు. కళ్లు కదిలించలేకపోవడం, పూర్తిగా మూయ లేకపోవడం దశకు చేరుకోవచ్చంటున్నారు. ఆ తర్వాతి దశలో శ్వాస తీసుకోవడంలోనూ ఇబ్బందులు ఎదురవుతాయని అంటున్నారు. వారికి వెంటిలేటర్‌పై చికిత్స అందించాలని సూచిస్తున్నారు. జిబిఎస్ కేసులను గుర్తించడంలో అన్ని అంశాలను ప్రామాణికంగా తీసుకోవాలని చంద్రబాబు ఆరోగ్యశాఖాధికారులను ఆదేశించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ సి.ఎస్. ఎం.టి.కృష్ణబాబు మాట్లాడుతూ పూనే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దాదాపు 181 మందిలో ఈ జిబిఎస్ వ్యాధి లక్షణాలను గుర్తించడంతో ప్రభుత్వం అప్రమత్తమైందన్నారు. ఈ వ్యాధి వ్యాప్తికిగల కారణాలను ఐసిఎమ్ఆర్ బృందం పరిశీస్తోందని, జీవ కాలుష్యం ఈ వ్యాధి ప్రభలడానికి ప్రధాన కారణం కావచ్చనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ జిబిఎస్ వ్యాధి కాళ్లలో ప్రారంభమై పైవరకు వ్యాపిస్తోందని, తిమ్మిర్లు, నడవలేని స్థితి సంభవిస్తుందన్నారు. ఇటు వంటి లక్షణాలు బయపడిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి తగిన వైద్యసేవలు పొందితే ఎటు వంటి ప్రమాదం ఉండదన్నారు. చికిత్స తీసుకోకుండానే చాలావరకు వ్యాధి తగ్గిపోతోందని, జిబిఎస్ రోగులకు సరిపడా ఇమ్యునోగ్లోబిలిన్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయని, రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం మరింత కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకూ 1,200 ఇమ్యునోగ్లోబిలిన్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయని, మరో 6,000 ఇంజెక్షన్లను సమకూర్చుకునేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిఫల్ డా.ఎన్.వి.సుందరాచారి మాట్లాడుతూ 1834 లోనే ఈ వ్యాధిని గుర్తించడం జరిగిందని, ఇది చాలా పురాతనమైన వ్యాధే అని, పలు రకాల ఇన్ఫెక్షన్లవల్ల ఈ వ్యాధి ప్రభలే అవకాశం ఉందన్నారు. సాధారణ జలుబుగా ఈ వ్యాధి ప్రారంభమై అజాగ్రత్తగా ఉంటే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందన్నారు.



సోమవారం ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంవద్ద పోటెత్తిన భక్తులు

# కొత్త సిఇసిగా జ్ఞానేష్ కుమార్

>> విచారణ జరుగుతుండగా హడావిడిగా కమిషనర్‌పేరుప్రకటించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించి అభ్యంతరం వ్యక్తంచేయడంతో నియామకాల వాయిదాపడుతుందనిభావించారు. అయితే రాత్రిపొద్దుపోయాక జ్ఞానేశ్‌కుమార్ నియామకాన్ని కేంద్రం ప్రకటించింది. ప్రస్తుతం కమిషనర్‌గా ఉన్న జ్ఞానేష్‌కుమార్ హోంమంత్రి అమిత్‌షాతో సన్నిహిత సంబంధాలున్న అధికారిగాపేరుంది. ప్రస్తుత ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ పదవినుంచి దిగిపోవడంతో ఆయన స్థానాన్ని భర్తీచేయాల్సి ఉంది. జ్ఞానేష్‌కుమార్ సిఇసి అయితే ఆయన స్థానంలోమరొక కమిషనర్‌ను కూడా కేంద్రం భర్తీచేయాలి. ఆస్థానంలోనే ఇపుడు వివేక్‌జోషినియామకంచేసింది. వచ్చే ఏడాదిజరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికలతోపాటు ఆ తర్వాత ఎన్నికలకు వస్తున్న బెంగాల్, అస్సాం, తమిళనాడు ఎన్నికలు కూడా జ్ఞానేష్‌కుమార్ నేతృత్వంలోనే జరుగుతాయి. 1988 బ్యాచ్ ఐఎఎస్ కేరళ కేడర్ అధికారి అయిన జ్ఞానేష్‌కుమార్ ప్రస్తుతం ఉన్నఇద్దరుకమిషనర్లలో ఆయనే సీనియర్‌గా ఉన్నారు. సోమవారం ఉదయమే రాజీవ్‌కుమార్ పదవినుంచి దిగిపోయారు. ఆయనకు వీడ్కోలు సభకూడా ఘనంగా నిర్వహించారు. సంఘంలో మరో కమిషనర్ ఉత్తరాఖండ్‌కేడర్‌కు చెందిన సుఖ్‌బీర్‌సింగ్ సంధు కొనసాగుతున్నారు. లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ ఈ ఎంపిక కమిటీలో సభ్యుడు. హడావిడిగా సిఇసిని ప్రకటించాల్సిన అవసరం లేదని అభ్యంతరం చెప్పారు. సుప్రీంకోర్టులో ఈ వారంలోనే సిఇసి ఎంపికకు సంబంధించిన పిటిషన్లు విచారణచేస్తోందని ఈ తరుణంలో హడావిడి దేనికని ప్రశ్నించారు. మరోపక్క విమర్శకులు కూడా ఎన్నికలప్రక్రియ మొత్తం తన అధీనంలోకి తీసుకుంటున్నదని ఆరోపించారు. 61 ఏళ్ల జ్ఞానేష్‌కుమార్ కేంద్రహోంశాఖలోకూడా పనిచేసారు. 370వ అధికరణం రద్దులోను, జమ్ముకాశ్మీర్‌రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలితప్రాంతాలుగా విభజనచేసే చట్టాలరూపకల్పనలో కీలకంగా పననిచేసారు. కాశ్మీర్ డివిజన్‌కు హోంశాఖలో జాయింట్ సెక్రటరీగాపనిచేసారు. ఆ తర్వాత హోంశాఖలోనే అదనపు కార్యదర్శిగా పదోన్నతిపొందారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామమందిరానికి సంబంధించినఅన్ని పత్రాలను రూపొందించడంలో కీలకంగా పనిచేసారు. హోంమంత్రి అమిత్‌షాకు అత్యంత సన్నిహితుడని, గత ఏడాది జనవరిలోనే సహకార శాఖ కార్యదర్శిగా పదవీవిరమణచేసారు.

# కదులుతున్న కల్తీ నెయ్యి డొంక

>> కీలక పెద్దలను పట్టుకునేందుకు నోటీసులు జారీ చేశారు. మంగళవారం,బుధవారాల్లో విచారణకు హాజరుకావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. లడ్డూల తయారీకి నెయ్యిసరఫరా చేసేందుకు టెండర్లు పిలవడం, టెండర్లలో పాల్గొన్న కాంట్రాక్టర్లు, డైరీలకు కాదని తమిళనాడు, ఉత్తరాఖండ్‌లోని డైరీలకు అనుమతినివ్వడం కూడా ఆ ఇద్దరి విచారణతోనే మొత్తం కీలకంగా మారనుంది. ఆ ఇద్దరితో బాటు టిటిడిలో మాజీ ఉన్నతాధికారి సూత్రధారులుగా సిట్ దాదాపు తేల్చేసింది. అదేగాక పూర్తిస్థాయిలో గత ఐదేళ్లలో జరిగిన నెయ్యిసరఫరా లావాదేవీలు, బ్యాంకు ఖాతాల వివరాలు, ఫోన్ సంభాషణల కాల్‌డేటాను సిబిఐ సిట్ అధికారులు సేకరించారు. కీలకంగా ఓ మాజీసభ్యుడు వ్యవహరించారనేది ఇప్పుడు సిట్ తేల్చింది. కల్తీనెయ్యికేసులో సిట్ కస్టడీలో ఉన్న నలుగురు నిందితులు మంగళవారం సాయంత్రం కోర్టులో హాజరుపరచనున్నారు. దీనికంటే ముందుగానే నిందితులకు సంబంధించిన న్యాయవాదులు బెయిల్ పిటిషన్‌లు సోమవారం దాఖలు చేయడం, విచారణ దశలో ఉంది. ఈ కేసులో ఇప్పటికీ విచారణ కీలకదశకు చేరుకోవడంతో కొత్తగా ఎవరిని సిట్ అరెస్టుచేయనుందనేది అటు గత పాలకమండలి పెద్దలకు, టిటిడి అధికారులకు వణుకుపుట్టిస్తోంది. పైగా కేంద్రపరిధిలో సిబిఐ ఉండటం, సుప్రీంకోర్టు ధర్మాసనం న్యాయమూర్తులు ఈ కల్తీనెయ్యికేసుపై దృష్టి సారించడంతో విచారణ ఎక్కడా రాజకీయజోక్యం కలగజేసుకునే వీలులేకుండా సాగుతోందనేది తెలుస్తోంది. నేటి సాయంత్రానికి నలుగురు నిందితుల కస్టడీ ముగుస్తుండటంతో కోర్టులో హాజరుపరచితే వారికి న్యాయస్థానం బెయిల్ మంజూరుచేస్తుందా?లేక మళ్లీ రిమాండ్‌ను పొడిగిస్తుందా అనేది సిట్ అధికారులు ఆలోచనలో పడ్డారు. ఏదిఏమైనా నెలాఖరులోపు సూత్రధారులతోబాటు టిటిడిలో మార్కెటింగ్, కొనుగళ్ళు, పోటు విభాగం, విజిలెన్స్‌లో కొందరు పాత్రధారులైన నిందితులు కావచ్చనేది హాట్‌టాఫిక్‌గా మారింది.

# వాంగ్మూలం నమోదు చేసిన మేజిస్ట్రేట్

>> వంశీతోపాటు అతడి అనుచరులు.. సత్యవర్ధన్‌తో ఎలా వ్యవహరించారనే అంశాలను అతడి నుంచి పోలీసులు పక్కాగా రాబట్టారు. ఆ క్రమంలో వారు భయపెట్టడం, ప్రలోభపెట్టడం వంటి అంశాలను సైతం సత్యవర్ధన్‌తో పోలీసులు ప్రస్తావించారుదీంతో సత్యవర్ధన్ ఇచ్చే స్టేట్‌మెంట్ అత్యంత కీలకంగా మారనుంది. అయితే ఈ కేసులో నేరం చేయడం కంటే.. సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించడం మరింత పెద్ద నేరం కానుంది. ఈ నేపథ్యంలో వంశీకి ఉచ్చు గట్టిగా బిగుస్తూనట్లు తెలుస్తోంది. అదీకాక ఇప్పటికే వంశీపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేస్తారు.

# 10 మందికి బెయిలు నిరాకరణ

>> నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(ఎన్ఎఎసి) తనిఖీ కమిటీ ఐదు సంవత్సరాల పాటు ఎ++ గ్రేడ్ పొందటానికి పూర్తి మార్కులివ్వడానికి కెఎల్ఇఎఫ్‌తో కుమ్మక్కైందని సిబిఐ అధికారులు ఆరోపిస్తూ కేసు నమోదు చేశారు. దీనిపై నిందితుల తరపు న్యాయవాదులతో పాటు సిబిఐ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెన్నా కళ్యాణ్ చక్రవర్తి తమ తమ వాదనలను వినిపించారు. వీరికి బెయిలును మంజూరు చేస్తే పలుకుబడి కల్గిన వీరు సాక్షులను ప్రలోభపెట్టే అవకాశం ఉందని,కేసు విచారణ దశలోనే ఉన్నందున బెయిలును మంజూరు చేయవద్దని తన వాదనలలో వినిపించారు.తీవ్ర వాదోపవాదాల అనంతరం సిబిఐ పిపి వెన్నా కళ్యాణచక్రవర్తి వాదనలతో ఏకీభవించిన సిబిఐ ప్రత్యేక కోర్టు పది మంది నిందితుల తరపున దాఖలైన బెయిలు పిటీషన్‌ను డిస్మిస్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

# అబద్ధాలతో అభివృద్ధిని కనుమరుగు చేయలేరు

## తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ సిఎం కెసిఆర్ విసుర్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి17:** తెలంగాణ పురోగతి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం సమయంలో నీళ్లు, నిధులు, నియామకాలపై తీసుకున్న స్పష్టమైన ప్రణాళికలతోనే అద్భుత ఫలితాలను సాధించామని బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్నారు. ఆర్‌బిఐ వంటి సంస్థలు కూడా తెలంగాణ అభివృద్ధిని ప్రశంసిస్తూ ప్రస్తావిస్తున్నాయని ఆయన చెప్పారు. తెలంగాణ కొత్త రాష్ట్రంగా ఉన్నప్పటికీ అతి తక్కువ సమయంలోనే అన్ని రంగాల్లో ప్రగతి సాధించినట్లు, ఆర్‌బిఐ నివేదికలో స్పష్టంగా పేర్కొనబడిందని కేసీఆర్ వెల్లడించారు.

ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో సోమవారం జరిగిన కేసీఆర్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా, జూలూరు గౌరీశంకర్ సంపాదకత్వంలో వెలువడిన 'వందేళ్ళ ముందుచూపు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా, కేసీఆర్ మాట్లాడుతూ, తెలంగాణను తిరిగి సస్యశ్యామలం చేసి, ఎగువ భూములకు సాగునీరు అందించామన్నారు. పూడిపోయిన చెరువులను తవ్వి భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించామన్నారు.ప్రతి గ్రామానికి తాగునీరు అందించటం, ప్రజలకు హామీలు ఇచ్చినంత మాత్రాన కాకుండా, అంతకుమించి సేవలను అందించే ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ మాత్రమే అని కేసీఆర్ అన్నారు. చీకట్లో మగ్గిన తెలంగాణకు 24 గంటల విద్యుత్ సరఫరా సాధ్యం చేసి, దేశానికి ఆదర్శంగా నిలిచినట్లు చెప్పారు. రైతుబంధు పథకం దేశానికే ఆదర్శమని, తెలంగాణను ధాన్యాగారంగా మార్చినట్లు అన్నారు.

# తిరుమలేశుని ఆలయం

>> దనం, పరిశుభ్రత ప్రాధాన్యతతో పాటు ఆలయాలకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు సిఎం చంద్రబాబునాయుడు తెలిపారు. 7నెలలు కాలంలో దేవాలయాలకు రూ.134కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఆలయాల నిర్వాహణలో టెక్నాలజీని వినియోగించుకోవాలన్నారు. దేశ అభివృద్ధిలో టెంపుల్ టూరిజం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. యువత ఆధ్మాత్మికత వైపు అడుగులు వేయాలని సూచించారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ సారధ్యంలో దృఢమైన పాలనతో పాటు ఆలయాల పరిరక్షణ జరుగుతుందని తెలిపారు. ప్రపంచ దేశాలు భారతదేశ ఆధ్యాతికత కొనియాడేలా దేశ ప్రజల్లో ఆధ్యాతిక భావం పెరగాలన్నారు. హిందువులు సిక్కులు, బౌద్దులు, జైనులను సామూహికంగా సాంస్కృతిక, ఆర్థిక ఉద్యమంలో ఏకం చేసే లక్ష్యంతో ఐటిసిఎక్స్ చొరవను అమోదించారు. అందరికి సుసంపన్నమైన భవిష్యత్‌ను నిర్మించేందుకు దేవాలయ వారసత్వాన్ని, ఆధ్యాత్మికతను, సాంకేతిక బలాన్ని వినియోగించుకోవాలన్నారు. బహుళ దేశాల్లోని 1581 దేవాలయాలు, 685 వర్చువల్‌గా హాజరు కాగా, 111 వక్తలు, 15 వర్క్‌షాపులు, 60స్టాల్స్ ఏర్పాటు చేసారు. గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్ మాట్లాడుతూ ధర్మాన్ని కాపాడితే ఆ ధర్మమే మనల్ని కాపాడుతుందన్నారు. గోవులను పూజించాలని, గోవులను రక్షించాలని సూచించారు. చత్రపతి శివాజీ మహారాజ్ మన హిందూ ధర్మం సంస్కృతిని కాపాడటంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. సనాత ధర్మాన్ని పరిరక్షణకు భారత ప్రధాని మోడీ ముందంజలో ఉన్నారన్నారు. హిందువులు ఒక్కటిగా ఉంటేనే భద్రత ఉంటుందన్నారు. సమాజంలో ధర్మం క్షీణించినప్పుడు భగవంతుడు ఆవిర్భవిస్తాడని తెలిపారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ బృందానికి అభినందనలు తెలుపుతూ శ్రీవారి పాదాలు చెంతను ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. దక్షిణ భారతదేశంలో అద్భుతమైన పురాతన ఆలయాలుఉన్నాయని, అప్పటి శిల్పకల, ఆధ్యాత్మికత ఎంతో గొప్పదని తెలిపారు. ప్రాచీన కాలంలో నుంచి ఇప్పటి వరకు కొనసాగుతున్న భారతీయ జీవన విధానమే సనాతన ధర్మం అన్నారు. దేవాలయాలు అభివృద్ధికి సరికొత్త మార్గం చూపించే ప్రయత్నమే అంతర్జాతీయ దేవాలయాల సదస్సు ముఖ్య ఉద్దేశం అన్నారు.

**భారత ప్రధాని సందేశాన్ని వినిపించిన ప్రసాద్ లాద్**

భారతదేశ ప్రధాని నరేంద్రమోడీ దివ్య సందేశాన్ని అంతర్జాతీయ ఆలయాల సదస్సు ఛైర్మెన్ ప్రసాద్ లాధ్ చదివారు. తిరుపతిలో టెంపుల్ కనెక్ట్ నిర్వహించే ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ ఎక్స్‌ఫో (ఐటిసిఎక్స్) 2025 గురించి తెలుసుకోవడం చాలా సంతోషానిస్తుందన్నారు. సమ్మిట్ అండ్ ఎక్స్‌ఫోను నిర్వహించేందుకు ఆలయనగరం సరైన నేపథ్యాన్ని అందిస్తుంది. ఐటిసిఎక్స్-2025లో జరిగిన శక్తివంతమైన చర్చలు ఆలయ పర్యావరణ వ్యవస్థకు సంబంధించిన విస్తృతశ్రేణి సమస్యలపై కొత్త మార్గాలను దారి తీయవచ్చు. కన్వెన్సన్ అండ్ ఎక్స్‌పో విజయవంతానికి శుభాకాంక్షలు తెలిపారు.

# టెక్స్‌టైల్ హాబ్‌గా ఎపి

>> మార్కెట్ ప్రాప్యత కల్పించేలా ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు. హస్తకళలు, చేతివృత్తుల రంగాన్ని బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృఢమైన నిబద్ధత కలిగి ఉందన్నారు. మంగళగిరి, వెంకటగిరి, కలంకారి, ధర్మవరం వంటి సంప్రదాయ వస్త్రాలను ప్రోత్సహించడంతో పాటు ఆధునిక సాంకేతికతను కలిపి వాటిని అంతర్జాతీయ స్థాయిలో మరింత ప్రసిద్ధం చేయాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్రంలో పరిశ్రమలను నెలకొల్పేందుకు అనుకూలమైన విధానాలు, నైపుణ్యమైన శ్రామికశక్తి, అత్యుత్తమ మౌలిక సదుపాయాలు ఉన్నాయని పేర్కొంటూ దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆహ్వానించారు. చేనేత పరిశ్రమలను సమర్థవంతంగా నిర్వహణకు ప్రభుత్వ తోడ్పాటు అందించడంతో పాటు నాణ్యమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులు అందుబాటులో ఉన్నాయన్నారు. పలు సంస్థల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చలు జరిపారు. ఆయా కంపెనీల ప్రతినిధులతో జరిగిన చర్చలు ఫలప్రదం కావడంతో, అడ్వాన్స్ టెక్స్ టైల్స్ అసోసియేషన్, ఐటీఎంఎఫ్, మాస్కో ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ సహా మరో రెండు సంస్థల ప్రతినిధులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి సుముఖం వ్యక్తం చేశారు. రూ.2 వేల కోట్ల మేర పెట్టుబడులు పెట్టడానికి ఈ సంస్థలు ప్రతినిధులు ముందుకొచ్చారు. త్వరలోనే ఈ పెట్టుబడులుపై ఎపి ప్రభుత్వంతో ఎంఓయూలు చేసుకోడానికి రాష్ట్రానికి రానున్నట్లు ఆ సంస్థల ప్రతినిధులు మంత్రి సవితకు తెలిపారు.

ఎపిలో రూ.400 కోట్ల మేర అప్ సైక్లింగ్‌కు అవకాశాలున్నాయన్నారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్‌తోను తాము సంప్రదింపులు జరిపామన్నారు.ఆయన రాష్ట్రానికి పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించినట్లు వివరించారు. కర్నాటకకు చెందిన ప్రతినిధులు ఎమ్మిగనూరు టెక్స్ టైల్స్ పార్క్ లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపినట్లు మంత్రి సవిత వెల్లడించారు. రష్యాలో టెక్స్ టైల్స్ వేర్ హౌస్ ఏర్పాటుకు ఏపీకి చెందిన గుంటూరు టెక్స్ టైల్స్ పార్క్ అంగీకారం తెలిపిందని మంత్రి సవిత వెల్లడించారు. నాలుగు రోజుల పాటు జరిగిన భారత్ టెక్స్ 2025 ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ విజయవంతమైందన్నారు. 126 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్న ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నారన్నారు. భారత్ టెక్స్ వల్ల చేనేత రంగంలో పెట్టుబడులకు, చేనేత వస్త్రాల మార్కెటింగ్ కొత్త అవకాశాలు లభించాయన్నారు. దేశంలో వ్యవసాయం తరవాత అత్యధికంగా ఆధారపడిన రంగం చేనేత రంగమేనన్నారు. ఏపీలో చేనేత రంగంపై లక్షలాది కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. ముఖ్యంగా మహిళలు అత్యధిక శాతం చేనేత ఉత్పత్తుల్లో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే సిఎం చంద్రబాబు చేనేత పరిశ్రమ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో మరోసారి సిఎం చంద్రబాబు అధికారంలోకి రావడంతో, చేనేత పరిశ్రమకు మంచిరోజులు ప్రారంభమయ్యాయన్నారు. చంద్రబాబే ఎపికి బ్రాండ్ అంబా సిడర్ అని, ఆయన పాలనాదక్షతపై నమ్మకంతో ఎందరో పెట్టుబదుదారులు ఏపీలో లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టారన్నారు. చేనేతతో సహా మరెన్నో రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఏపీకి పారిశ్రామిక వేత్తలు క్యూ కడుతున్నారన్నారు.వన్ డిస్ట్రిక్‌వన్ ప్రొడక్ట్ కింద రాష్ట్రంలో 35 హ్యాండ్స్ క్రాఫ్ట్సుకు కేంద్ర ప్రభుత్వ గుర్తింపు లభించిందని మంత్రి సవిత వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ హస్త కళలకు ప్రోత్సాహం అందించడంతో పాటు ఉత్పత్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తాయన్నారు. చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి ప్రసంగిస్తూ, చిన్న, మధ్య తరహా వస్త్ర పరిశ్రమలను బలోపేతం చేయడానికి ప్రభుత్వ విధాన పరమైన మద్దతు, ఆర్థిక ప్రోత్సాహకాలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహించనున్నట్లు ప్రకటిస్తూ, పెట్టుబడులు, ఎగుమతుల ప్రోత్సాహం, వస్త్ర, హస్తకళల రంగంలో స్థిరమైన అభివృద్ధిపై సమగ్ర చర్చలు జరపనున్నట్లు తెలిపారు.నాలుగు రోజుల పాటు జరిగిన భారత్ టెక్స్ 2025 విజయవంతంగా ముగిసింది. ఆంధ్రప్రదేశ్‌ను టెక్స్‌టైల్ పరిశ్రమ, కొత్త ఆవిష్కరణల కోసం ప్రధాన కేంద్రంగా నిలపడానికి ప్రభుత్వం అంకితభావం తో పని చేసింది. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ అదనపు కమీషనర్ శ్రీకాంత్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్ జనాభా170 కోట్లు!

>> తీరుతెన్నులు నివేదికను గత ఏడాదిజులైలో విడుదలచేసింది. ప్రపంచ జనాభా 50 నుంచి 60 శాతం పెరుగుతుందని, సుమారు 10.3వందలకోట్లజనాభాకు చేరుతుందని, 2080 నాటికి 8.2 బిలియన్లమందికి చేరతారని వివరించింది. మరింత గరిష్టస్థాయికి చేరితే ప్రపంచ జనాభా క్రమేపీ తగ్గడం ఆరంభం అవుతుందని, ఈశతాబ్దం ముగిసేనాటికి 10.2 బిలియన్ల జనాభా ఉంటుందని వెల్లడించింది. ఇప్పటికేభారత్ చైనాను జనాభాపరంగా అధిగమించింది. గతేదాది లెక్కలప్రకారమే జనాభాలో చైనాను దాటేసింది. 2100వ సంవత్సరంనాటికి భారత్‌ప్రపంచంలోనే అగ్రశ్రేణిదేశంగా నిలుస్తుందని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. 2060 తొలినాళ్లలో గరిష్టస్థాయికి వెళ్లినతర్వాత క్రమేపీ తగ్గుతుందని కూడా అంచనావేసింది. చివరకు 1.7 బిలియన్ జనాభాకు పరిమితం అవుతుందని ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక వ్యవహారాల జనాభావిభాగం తెలిపింది. 2024లోభారత జనాభా 145కోట్లుగా ఉంది. 2054నాటికి 169 కోట్లకు చేరుతుంది. ఆ తర్వాత భారత్ జనాభా 2100 సంవత్సరం చివరికి 150 కోట్లకు నమోదవుతుందని అప్పటికి కూడా ప్రపంచంలోనే అత్యధికజనాభా ఉన్న దేశంగా నిలుస్తుందని సమితి అంచనావేసింది. సమితి ప్రతినిధి యుఎన్‌డెసా అధికారి క్లేర్ మెనోజ్జి మాట్లాడుతూ భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద దేశంగా ఉందని ఈశతాబ్దం కాలంలోనే 1.69 బిలియన్‌లకు చేరుతుందన్నారు. 2060 నాటికి భారత జనాభా 170 కోట్లకు పెరుగుతుందని ఆమె అంచనావేసారు. అదేసమయంలో ప్రస్తుతం చైనా జనాభా 141 కోట్లవరకూ ఉంది. 2054 నాటికి 121 కోట్లకు చేరుతుందని, తర్వాత 2100 సంవత్సరం నాటికి మరింతగా తగ్గుతుందని వెల్లడించింది. ఇక చైనాలో జననాల రేటు కూడా తగ్గుతున్నట్లు గుర్తించింది. ప్రస్తుత జనాభాలో సగటున 2.1 మందికి చైనా మహిళలు జన్మనిస్తున్నారని, సంతానోత్పత్తిరేటు రెండుశాతానికి పెరగాల్సి ఉంటుందని వెల్లడించారు.

# 20న ఢిల్లీ సిఎం ప్రమాణం

>> రామ్ లీలా మైదానంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించాని భావిస్తోంది. ఎన్డీయే పాలితరాష్ట్రాలకు ఇప్పటికే ఆహ్వానాలువెళ్లాయి. గురువార సాయంత్రం 4.30 గంటలకు సిఎం ప్రమాణస్వీకారం ముహూర్తం ఖరారుచేసారు. మోడీ అమిత్‌షా, జెపినడ్డా సహా బిజెపి అగ్రనేతల సమక్షంలో మంత్రివర్గం ప్రమాణస్వీకారంచేస్తుంది. ఇక ఢిల్లీసీఎం రేసులో పర్వేష్ వర్మ, రేకా గుప్తా, విజేందర్‌గుప్తా, సతీష్ ఉపాద్యాయ్, ఆశిష్‌సూద్, పవన్‌శర్మ, అజయ్‌మహావార్‌ల పేర్లు ప్రముఖంగా వస్తున్నాయి.జనంలో క్లీన్ ఇమేజ్ ఉన్న నేతకే ఢిల్లీ పగ్గాలు అప్పగించాలని అధిష్టానం ఒక అంచనాకు వచ్చేసిందని బిజెపినేతలు చెపుతున్నారు.

# రాజధాని అమరావతిలో మరో రూ.3578కోట్లతో టెండర్లు

## 10లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో బంగ్లాలు అభివృద్ధి

**రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** రాష్ట్ర రాజధాని అభివృద్ధిలో భాగంగా తాజాగా మరో రూ.3578 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులకు తాజాగా సీఆర్డీఏ టెండర్ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనలో కీలకమైన అఖిల భారత సర్వీస్‌కు చెందిన ప్రిన్సిపాల్ సెక్రటరీలకు 5.28లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 115 జీ+1 బంగ్లాలను నిర్మించేందుకు 516.60కోట్లతో టెండర్లు పిలిచారు. అలాగే మంత్రులు, న్యాయమూర్తులకు అమరావతి ప్రభుత్వ కాంప్లెక్స్‌ను 4.75లక్షల విస్తీర్ణంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు 492.30కోట్ల అంచనా వ్యయంతో టెండర్లను పిలిచారు. అదేవిధంగా రాజధానిలో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు 2570 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచారు. అదేవిధంగా రాజధాని సమీప గ్రామాలైన పిచుకల పాళెం, తుల్లూరు, అనంతవరం, అబ్బరాజుపాళెం, బుర్రుపాలెం, దొండపాడు, రాయపూడి గ్రామాల్లో జోన్ 4, జోన్ 5లలో కూడ మిగిలిన అభివృద్ధి పనులకు టెండర్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మూడు రోజుల క్రితం 2906కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులకు టెండర్‌లు పిలిచిన విశయం తెలిసిందే. దీంతో రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు నోటిఫికేషన్ వచ్చిన తర్వాత 6484కోట్ల రూపాయలు అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచినట్లు అయింది.

## వారం - వర్జ్యం

తేది : 18-02-2025, మంగళవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
షష్ఠి పూర్తి
చిత్త ఉ.7.34
వర్జ్యం : మ.1.53-3.42
దు.ఉ.9.01-9.47 2) రా.10.56-11.42
శుభసమయం : ఉ.6.00-9.00
సా.5.30-6.15
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

**వృషభం:** సన్నిహితుల నుండి విమర్శలు ఎదుర్కొంటారు. సోదరుల కలయిక.

**మిథునం:** ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరం. వివాదాలకు దూరంగా వుండండి.

**కర్కాటకం :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. వస్తు, వస్త్రా కొనుగోలు.

**సింహం:** చేపట్టిన పనులు నిదానంగా పూర్తి చేస్తారు. ఆరోగ్య సమస్యలు.

**కన్య :** ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. స్వల్పధనలాభం.

**తుల :** ముఖ్యమైన పనులు కొన్ని పూర్తి చేస్తారు.సన్నిహితుల నుండి కీలక సమాచారం.

**వృశ్చికం:** సంఘంలో గౌరవం పొందుతారు. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**ధనుస్సు:** శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. మానసిక ప్రశాంతత.

**మకరం:** మిత్రుల నుండి కొత్త విషయాలు తెలుసుకొంటారు. వాహనసౌఖ్యం.

**కుంభం:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఆరోగ్య సమస్యలు.

**మీనం :** బంధువులతో ఏర్పడిన తగాదాలు పరిష్కరించుకొంటారు. ధనలాభం.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శ్రీశైలం బ్రహ్మోత్సవాలకు సీఎం చంద్రబాబును ఆహ్వానిస్తున్న భ్రమరాంభ మల్లికార్జున స్వామి ఆలయ ఇఒ ఎం.శ్రీనివాసరావు, పండితులు, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

## మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలకు రండి

**విజయవాడ.ఫిబ్రవరి17,ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీశైలభ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవాలయంలో ఈనెల 19 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మొదలుకానున్నాయి. బ్రహ్మోత్సవాల కోసం దేవాలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆహ్వానం అందించారు దేవాలయ అధికారులు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును భ్రమరాంభ మల్లికార్జున స్వామి ఆలయ ఇఒ ఎం.శ్రీనివాసరావు, పండితులు, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆహ్వానించారు. శ్రీశైలం మహాక్షేత్రంలో ఈనెల 19వ తేదీ నుంచి మార్చి 1 వరకు మహోత్సవాలు జరుగుతున్నాయని సీఎంకు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు రావాలని సీఎం చంద్రబాబును ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఎంకు ఆలయ పండితులు స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించి ఆశీర్వదించారు.

## విద్యావంతుల ప్రయోజనాలకు కృషి: మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,ఫిబ్రవరి17,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యావంతుల ప్రయోజనాలకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పర్యాటక, సాంస్కృతిక మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.విద్యారంగంలో సాంకేతిక విజ్ఞానం పెంచుతుందన్నారు. ఐటి .కృత్రిమ మేధో(ఎఐ)ని అభివృద్ధి చేస్తోందన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ను అఖండ మెజారిటీతో గెలిపించాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. విజయవాడలో కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కి మద్దతుగా మంత్రి నాదెండ్ల మనోహార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న జనసేన ఆత్మీయ సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని ప్రసంగించారు.పట్టభద్రులైన యువత తమ తొలి ప్రాధాన్యత ఓటును కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కి వేసేలా అవగాహన కల్పించాలని కూటమి శ్రేణులకు మంత్రి దుర్గేష్ దిశానిర్దేశం చేసారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించుకుంటే యువత భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తారన్నారు.




సభలో ప్రసంగిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

ఈ కార్యక్రమంలో పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నియో జకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, జనసేన నాయకులు సామినేని ఉదయభాను, కిలారు రోశయ్య, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద ఘటనపై మంత్రి దుర్గేష్ దిగ్భ్రాంతి

**విజయవాడ,ఫిబ్రవరి17,ప్రభాతవార్తప్రతినిధి:** వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ దురదృష్టవశాత్తు గుంటూరుజిల్లా నారాకోడూరు-బుడంపాడు గ్రామాల మధ్య రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కూలీలు దుర్మరణంచెందిన ఘటన కలచి వేసిందని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కందుల దుర్గేష్ విచారం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం ప్రమాదవార్త తెలిసిన వెంటనే జిల్లా అధికారులతో మంత్రి దుర్గేష్ ఫోన్లో మాట్లాడి వివరాలు ఆరాతీశారు. అనంతరం జీజీహెచ్‌లో క్షతగాత్రులకు మెరుగైనవైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం తరపునఆదుకుంటామన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కూలీల కుటుంబాలకు మంత్రి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# తిరుమల సమాచారం

## ఆన్‌లైన్‌లో నేడు మేనెల ఆర్జితసేవ టిక్కెట్లు

### నేడు ఎలక్ట్రానిక్ డిప్, 21న ఆర్జితసేవా టిక్కెట్లు

**తిరుమల,ఫిబ్రవరి 17ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాలకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం రానున్న మే నెలకు సంబంధించి ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, ఆర్జితసేవలకు సంబంధించిన టిక్కెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తోంది. మే నెల ఆర్జిత సేవాటిక్కెట్లు ఎలక్ట్రానిక్ డిప్‌లో నేడు మంగళ వారం ఉదయం 10గంటలకు విడుదల చేస్తుండగా 20వతేదీ వంకు బుక్‌చేసుకునే సదుపాయం ఉంది. 22వతేదీ మధ్యాహ్నం 12గంటల లోపు లక్కీడిప్‌ద్వారా టిక్కెట్లు పొందిన భక్తులు నగదు చెల్లించి టిక్కెట్లు అందుకోవచ్చు. ఇక ఆర్జితసేవా కల్యాణం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవల టిక్కెట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఈనెల 21వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తోంది. వర్చువల్ సేవల టిక్కెట్లు 21న మధ్యాహ్నం 3గంటలకు విడుదల చేస్తారు. అంగప్రదక్షణ టోకెన్లను 22వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తోంది. రోజువారీగా (శుక్రవారం తప్ప)750 టోకెన్లను ఆన్‌లైన్‌లోనే విడుదల చేస్తున్న విషయం విదితమే. 300 రూపాయలు ఎస్ఇడి టిక్కెట్లు కోటా 24వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తారు. ఇదిలా ఉండగా శ్రీవాణి టిక్కెట్లు ఆన్‌లైతన్‌లో 22వతేదీ ఉదయం 11గంటలకు విడుదల చేస్తారు. దివ్యాంగులు,వృద్ధుల కోటా 22న మధ్యాహ్నం 3గంటలకు విడుదలచేస్తారు. భక్తులు ఈ టిక్కెట్లను ఆన్‌లైన్‌లో టిటిడిదేవస్థానమ్స్. ఎపి. జిఒవి,ఇన్ వెబ్‌సైట్‌లోమాత్రమే బుక్‌చేసు కోవాలని టిటిడి కోరింది.

## ఉపమాక ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

### హోంమంత్రి అనితకు టిటిడి ఛైర్మన్ నాయుడు హామీ



**తిరుమల,ఫిబ్రవరి 17ప్రభాతవార్తప్రతినిధి:** అనకాపల్లిజిల్లా నక్కపల్లి మండలం ఉపమాక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని, ఇందుకు అవసరమైన చర్యలు చేపడతామని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అత్యంత ప్రాశస్త్యంగల ఆలయాన్ని 2017వ సంవత్సరంలోనే టిటిడికి అప్పగించడం జరిగిందన్నారు. ఈ ఆలయాన్ని ఇప్పటివరకు కొంతవరకు అభివృద్ధి చేయలేదని, ఆలయానికి పూర్వవైభవం తీసుకురావాలని హోంమంత్రి అనిత ఛైర్మన్ నాయుడును కలసి కోరారు.ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించి, ఆలయ అభివృద్ధికి తగిన చర్యలు చేపడతామని ఆమెకు తెలిపారు. సోమవారం ఉదయం ఆమె శ్రీవారిని దర్శించుకుని అనంతరం తిరుమలలోనే ఉన్న ఛైర్మన్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపమాక ఆలయ అభివృద్ధిపై చర్చించారు. ఈ సమావేశంలో టిటిడి ఇఒ శ్యామలరావు, బోర్డుసభ్యులు ఎంఎస్‌రాజు, టిటిడి సిఇ సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు భారీ విరాళం

### రూ.11కోట్లు అందజేసిన దాత



**తిరుమల,ఫిబ్రవరి 17ప్రభాతవార్తప్రతినిధి:**ఏడుకొండలవేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న అన్నప్రసాదం ట్రస్ట్‌కు దాతలు విరాళాలిస్తున్నారు.సోమవారం ఉదయం ముంబైయునో ఫ్యామిలీట్రస్ట్‌కు చెందిన తుషార్‌కుమార్ దాత కుటుంబంతో కలసి 11కోట్లు రూపాయలు భారీ విరాళాలను అన్నప్రసాదం ట్రస్ట్‌కు ఇచ్చారు. ఈ విరాళాల డిడిలను టిటిడి అదనపు ఇఒ శ్యామలరావుకు అందజేశారు.ఈసందర్భంగా దాతను అదనపు ఇఒ అభినందించారు.



## రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలి

### ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి: హోంమంత్రి అనిత

**తిరుమల,ఫిబ్రవరి 17ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో అంతా మంచి జరుగుతోందని, ప్రజలు అన్ని విధాలా అభివృద్ధి చెందేలా పథకాలు అమలుచేస్తున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆయురారోగ్యాలతో ఉండాలని, స్వామివారిని వేడుకున్నట్లు చెప్పారు. తిరుమలలో భక్తులకు సౌకర్యాలు మెరుగపడ్డాయని, గతంలో కంటే స్వామివారి దర్శనం కూడా సంతోషంగా చేసుకునేలా టిటిడి అధికారులు చూస్తున్నారన్నారు. శ్రీకాళహస్తిస్వామి బ్రహ్మోత్సవాలను కూడా ఆలయ అధికారులు ప్రశాంతంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని సూచించడం జరిగిందన్నారు. సోమవారం ఉదయం ఆమె విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. హోంమంత్రితో బాటు తిరుమల అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్,సిఐ విజయకుమార్ ఉన్నారు.

## రాష్ట్ర సైనిక్ సంక్షేమశాఖకు స్కోచ్ గోల్డ్ అవార్డు

**విజయవాడ. ఫిబ్రవరి 17,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ ప్రతిష్ఠాత్మక స్కోచ్ గోల్డ్ అవార్డును గెలుచుకుంది. ఇండియాలో ఏ రాష్ట్ర సైనిక్ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌కు దక్కని గౌరవం రాష్ట్ర సైనిక సంక్షేమ విభాగం



స్కోచ్‌గోల్డ్ అవార్డుతో ఏపీ సైనిక్ వెల్ఫేర్‌డైరెక్టర్ బ్రిగేడియర్ వి. వెంకట్ రెడ్డి తదితరులు

దక్కించుకుంది. స్కోచ్ అవార్డు కమిటీ ఆహ్వానం మేరకు ఏపీ సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ వెంకట్ రెడ్డి న్యూఢిల్లీ ఇండియా హాబిటేట్ సెంటర్‌లో స్కోచ్ అవార్డు కమిటీ ఛైర్మన్ సమీర్ కొచ్చర్‌చే ఈ అవార్డును అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖలో మాజీ సైనికులు, యుద్ధ వీరుల వీర మాతలు, వీర నారీలు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం, ఉపాధి, పునరావాసం , ఈగవర్నెన్స్, పబ్లిక్ గ్రీవెన్స్‌ను త్వరిత గతిన పరిష్కరించడం, ఇన్నోవేటివ్ ఇనీషియేటివ్స్ తదితర అంశాల్లో స్కోచ్ గోల్డ్ అవార్డు జ్యూరీ కమిటీ అవార్డు కోసం పోటీపడిన అన్ని రాష్ట్రాల సైనిక సంక్షేమ శాఖల పనితీరును సునిశిత పరిశీలన చేసి ప్రతిష్ఠాత్మక స్కోచ్ గోల్డ్ అవార్డును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ కు అందించారు. స్కోచ్ గోల్డ్ అవార్డు ను గెలుచుకున్న ఏపీ సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ బ్రిగేడియర్ వెంకట్ రెడ్డి, అధికారులను రాష్ట్ర హోమ్, సైనిక సంక్షేమశాఖ మంత్రి వంగలపూడి అనిత, కేంద్ర ప్రభుత్వ మాజీ సైనికుల సంక్షేమ శాఖ కార్యదర్శి డా. నితెన్‌చంద్ర, కేంద్రీయ సైనిక్ బోర్డ్‌సెక్రటరీ బ్రిగేడియర్ డి ఎస్ బసేరా, రాష్ట్రహోమ్ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజీత్ అభినందించారు. సోమవారం విజ యవాడ మొగల్రాజపురంలో ఉన్న రాష్ట్ర సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో కలిసి స్కోచ్ గోల్డ్ అవార్డు గెలుపు ఆనందాన్ని డైరెక్టర్ బ్రిగేడియర్ వెంకట్ రెడ్డి పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టరేట్ కార్యాలయ సహాయ సంచాలకులు కెప్టెన్ డా. సత్యప్రసాద్, అధికారులు బాలాజీ, భక్తవత్సల రెడ్డి, అనంతపురం ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ అధికారి, డిప్యూటీ డైరెక్టర్ పి.తిమ్మప్ప, అధికారులు శిఖామణి, భానుప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.



రైల్వే జీఎం జైన్ నుంచి మ్యాన్ ఆఫ్ ది మంథ్ అవార్డు అందుకుంటున్న సిబ్బంది

## రైలు ప్రయాణికుల భద్రతకే తొలి ప్రాధాన్యం

### మ్యాన్ ఆఫ్ ది మంథ్ అవార్డుల ప్రదానోత్సవంలో జిఎం జైన్

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 17,ప్రభాతవార్త:** ప్రస్తుతం జరుగుతున్న మహా కుంభమేళాకు వెళ్లే యాత్రికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల భద్రతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ఆజ్ఞాపించారు. రైల్వే జోనల్ ప్రధాన కార్యాలయమైన రైల్ నిలయంలో జరిగిన భద్రతా సమీక్ష సమావేశంలో అదనపు జీఎం నీరజ్ అగర్వాల్‌తో కలిసి జోన్‌లో జరుగుతున్న రైల్వే పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతా నిమిత్తం అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో మార్గదర్శకాలు అందించేందుకు మరికొంత మంది సిబ్బందిని నియమించుకోవాలని ఆయన సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ ఏడాది జనవరి మాసంలో జోన్ పరిధిలో వివిధ ప్రాంతాలలో భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించేందుకు కృషి చేసిన విజయవాడ డివిజన్, రాజమండ్రికి చెందిన సీనియర్ ట్రైన్ మేనేజర్లు సత్యనారాయణ,పైలా ఈశ్వర్‌రావు,కొవ్వూరుకు చెందిన ట్రాక్ మెయింటెనర్ మధు, గుంతకల్లు డివిజన్ రెడ్డి పల్లికి చెందిన ట్రాక్ మెయింటెనర్ ప్రిన్స్ కుమార్,గుంతకల్లుకు చెందిన లోకో పైలట్ ఆర్ నాగేశ్వర్ రావు,గూళ్య పాలెంకు చెందిన స్టేషన్ మాస్టర్ కుందన్ కుమార్,నాందేడ్ డివిజన్ హింగోలీ దక్కన్‌కు చెందిన ట్రాక్ మెయింటెనర్ దత్త మహాదేవ,నాందేడ్‌లో లోకో పైలట్‌గా పనిచేస్తున్న యండి మొహర్రమ్ హుస్సేన్‌లకు జీఎం జైన్ మ్యాన్ ఆఫ్ ది మంథ్ అవార్డులను ప్రధానం చేశారు. విపత్కర పరిస్థితులను నివారించడంలో విధి పట్ల అప్రమత్తత, అంకితభావంతో చూపిన సిబ్బందికి ఎంప్లాయ్ ఆఫ్ ది మంథ్ అవార్డులను ప్రధానం చేశారు. అన్ని ఈ సమావేశంలో జోన్‌కు చెందిన ఆయా కీలక విభాగాలకు చెందిన ప్రధాన అధికారులతో పాటు హైదరాబాద్,సికింద్రాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ లకు చెందిన డిఆర్‌ఎంలు, డివిజన్‌లకు చెందిన సంబంధిత ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

## కులగణనలో దేశంలోనే తెలంగాణ రోల్‌మోడల్

### 42శాతం బలహీనవర్గాలకు రిజర్వేషన్ చట్టబద్ధత తీసుకువస్తాం: తెలంగాణ మంత్రి పొన్నంప్రభాకర్



**తిరుమల,ఫిబ్రవరి 17ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలోనే రోల్‌మోడల్‌గా కులగణన తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, బలహీనవర్గాల వారికి రాజకీయంగా, విద్యపరంగా అవకాశాలు లభిస్తాయని తెలంగాణామంత్రి పొన్నంప్రభాకర్ తెలిపారు. కులగణనతో 42శాతం బలహీనవర్గాల వారికి రిజర్వేషన్ కల్పించే విషయంపై చట్టబద్ధత తీసుకువస్తామన్నారు. దీనిపై చట్టంచేసి కేంద్రప్రభుత్వానికి పంపుతామని, కేంద్రమంత్రివర్గం ఆమోదించి చట్టం చేయాలని ఆయన కోరారు. మార్గ దర్శకాలతో కులగణన చేయడం వల్ల బలహీ నవర్గాల వారికి అన్ని విధాలా మంచి జరుగుతుందన్నారు. కులగణన ప్రయోజనాలను మరింతగా వర్తింపజేసేలా కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని కూడా వేడుకున్నట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం సానుకూలంగానే స్పందించి చట్టబద్ధతకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రజలకు అంతా మంచిజరగాలని, మరో పదేళ్లు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మరిన్ని మంచి పనులు చేస్తుందన్నారు. తెలం గాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుపై ప్రజలు కూడా సంతోషంగా ఉన్నారని పొన్నం తెలిపారు. సోమవారం ఉదయం ఆయన తిరుమలల విఐపి బ్రేక్‌లో అనుచరులతో కలసి ఆలయంలోనికి చేరుకున్నారు. ఆనందనిలయంలో కొలువైన శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారితీర్థప్రసాదాలు అందజేశారు.

## అన్ని విధాలా సహకరిస్తాం

### నవీముంబైలో శ్రీవారి ఆలయనిర్మాణం పనులపై ఆ రాష్ట్ర సిఎం పడ్నవీస్



**తిరుమల,ఫిబ్రవరి 17ప్రభాతవార్తప్రతినిధి:** మహారాష్ట్రప్రజలకు శ్రీవేంకటేశ్వరస్వామి సేవలను చేరువచేయడానికి, స్వామివారి దర్శన భాగ్యం కల్పించేందుకు వీలుగా నవీముంబైలో నిర్మాణంలో ఉన్న స్వామివారి ఆలయానికి అన్ని విధాలా సహకరిస్తామని ముఖ్యమంత్రి దేవేంద్రఫడ్నీవీస్ తెలిపారు. నవీముంబైలో ఆలయాన్ని నిర్మించే విషయంలో ఎలాంటి సహాయసహకారాలైనా అందిస్తామన్నారు. తిరుపతిలో ప్రారంభమైన ఆలయాల అభివృద్ధి ఎక్స్‌ఫో సదస్సులో పాల్గొనేందుకు ముందుగా సోమవారం మధ్యాహ్నం మహారాష్ట్ర సిఎం పడ్నవీస్ తిరుమలకు వచ్చారు. టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, సౌరబ్‌హెచ్‌బోరా స్వాగతం పలికారు. ఆలయంలోనికి చేరుకుని తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలోని శ్రీవారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పద్మావతి అతిధిగృహంలో ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చౌదరి, బోర్డుసభ్యులతో కలసి సిఎం పడ్నవీస్‌తో ఆలయ నిర్మాణంపై చర్చించారు.



## దుర్గమ్మ భక్తులకు వాట్సప్ సేవలు

### ఇఒ కె రామచంద్రమోహాన్

**ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** దుర్గమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇకపై వాట్సప్ 9441820717 ద్వారా గ్రీవెన్స్/ఫీడ్‌బ్యాక్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చినట్లు ఇఒ కె రామచంద్రమోహాన్ వెల్లడించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి వారివద్ద సలహాలు, సూచనలు స్వీకరిస్తామన్నారు. అదేవిధంగా భక్తులకు ఏవైనా ఫిర్యాదులుంటే వాట్సప్‌ద్వారా ఫిర్యాదు చేస్తే ఆ ఫిర్యాదు వెంటనే సంబంధిత అధికారికి పంపిస్తామని, భక్తులకు వారి ఫిర్యాదుకు సంబంధించిన తాము తీసుకున్న చర్యలు కూడావివరస్తామన్నారు.దీనిద్వారా భక్తులకు పారదర్శకమైన సేవలందిస్తామని ఇఒ వెల్లడించారు.

वस्त्र मंत्रालय MINISTRY OF TEXTILES
राष्ट्रीय परीक्षा एजेंसी National Testing Agency Excellence in Assessment
राष्ट्रीय फैशन प्रौद्योगिकी संस्थान
NATIONAL INSTITUTE OF FASHION TECHNOLOGY
A Statutory Institute Governed by the NIFT Act 2006
NIFT ప్రవేశాలు 2025
డాక్టరల్ ప్రోగ్రామ్‌లు
అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్
B.DES. హస్త వృత్తి కళల కేటగిరీ క్రింద
రిజిస్ట్రేషన్ కొరకు చివరి తేది
28వ ఫిబ్రవరి, 2025
ఆన్‌లైన్ దరఖాస్తు పెట్టుకోండి
https://nift.ac.in
https://exams.nta.ac.in/NIFT/
ADMISSIONS 2025
CBC 21354/12/0006/2425

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్
రాజేంద్రనగర్, హైదరాబాద్-500030, తెలంగాణ, ఇండియా
టెలిఫోన్: 91 40-24015374, టెలి-ఫ్యాక్స్: 91 40-24015346
ఇ-మెయిల్: niphm@nic.in, http://niphm.gov.in
NIPHM

ప్రకటన నం. 01/2025

NIPHM, ఒక (1) మెషీన్ మైండర్ యొక్క గ్రూప్ C పోస్ట్ కొరకు ప్రత్యక్ష / డిప్యుటేషన్ ప్రాతిపదిక క్రింద, 7వ CPC యొక్క పే లెవెల్ 4లో రిజర్వ్‌డు కాని కేటగిరీలో దరఖాస్తు కోరుతోంది. ఉద్యోగం యొక్క అర్హతా వివరాలు ఈ క్రింది విధంగా:-

ఆవశ్యకమైన విద్యార్హతలు మరియు అనుభవం:

3 సం॥ల పాలిటెక్నిక్ డిప్లొమా లేదా హైయర్ (గుర్తింపు పొందిన సంస్థ నుండి) మరియు కనీసం ఒక సర్టిఫికేషన్‌లు (CCNP/CCIE/CCNA)తో మరియు ఆడియో విజువల్ సెట్ అప్, వీడియో కాన్ఫరెన్స్ సెట్ అప్, నెట్‌వర్క్ మరియు సిస్టమ్ ట్రబుల్ షూటింగ్ మరియు పెర్ఫార్మెన్స్ ఆప్టిమైజేషన్ వంటి కమ్యూనికేషన్ ఎక్విప్‌మెంట్ ట్రబుల్ షూటింగ్ మరియు నిర్వహణలో కనీసం 5 సంవత్సరాల అనుభవంతోసహా.

లేదా

బాచిలర్స్ ఇన్ ఇంజనీరింగ్ / MCA లేదా హైయర్ (గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుండి) మరియు కనీసం ఒక సర్టిఫికేషన్‌లు (CCNP/CCIE/CCNA) ఆడియో విజువల్ సెట్ అప్, వీడియో కన్ఫరెన్స్ సెట్ అప్ నెట్‌వర్క్ మరియు సిస్టమ్ ట్రబుల్ షూటింగ్ మరియు పెర్మాఫార్మెన్స్ ఆప్టిమైజేషన్ వంటి కమ్యూనికేషన్ ఎక్విప్‌మెంట్ నిర్వహణ మరియు ట్రబుల్ షూటింగ్‌లో కనీసం 2 సంవత్సరాల అనుభవంతోసహా.

నిర్దేశిత నమూనాలో దరఖాస్తులు, సీల్డ్ కవర్‌పై "................ ఉద్యోగానికి దరఖాస్తు" అని వ్రాసి, హార్డ్ కాపీలో రిజిస్ట్రార్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్, రాజేంద్రనగర్, హైదరాబాద్-500030 తెలంగాణకు అందేటట్టుగా పంపవలెను.

**దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ వార్తాపత్రికలో ప్రకటన ప్రచురణ యొక్క తేదీ నుండి 21 రోజులు.** సవివరమైన విద్యార్హతలు, అనుభవం, వయస్సు మరియు ఇతర యోగ్యతా ప్రమాణాలు, సిలబస్, ఉద్యోగాల విధులు వగైరా దరఖాస్తు నమూనాతోసహా వెబ్ **http://niphm.gov.in/Recruit.html** నుండి పొందవచ్చును.

సం/-
రిజిస్ట్రార్
CBC 01379/11/0004/2425

వార్త

శారీరకంగా కానీ, మానసికంగా కానీ, నైతికంగా కానీ, ఆధ్యాత్మికంగా కానీ ఏ విధంగా కూడా బలహీనత పనికిరాదు.

-సోక్రటీస్

# అనుభవరాహిత్యమే!


మరో తొక్కిసలాట దుర్ఘటన మానవ హృదయాలను కలవరపరుస్తోంది. తొక్కిసలాటల పరంపరలో కుంభమేళాకు లేదా కొన్ని పర్వదినాలకు లేదా దేవాలయ సందర్శనల సందర్భంగా జరిగిన విషాద ఉదంతాల్లో నలిగిపోయిన వారు, మృతి చెందిన వారు సైతం భక్తులే. పుణ్యమొస్తుందనో, పాప ప్రక్షాళన జరుగుతుందనో ఆశపడతారు. విన్నదే తడవుగా పుణ్యక్షేత్రాలకు పయనమౌతారు. మొన్నా మధ్య ముక్కోటి ఏకాదశి నాడు శ్రీవారిని ఉత్తరద్వార దర్శనం చేసుకోవాలన్న ప్రయత్నంలో గందరగోళానికి గురైన ఘటనలో తొక్కిసలాటకు గురై ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. పరిమితిని మించి కిక్కిరిసిన జనంతో ఉండే ప్రతిచోటా రద్దీ వలన కలిగే పర్యవసానాలు కూడా ఇలాగే ఉంటాయి. ఇందుకు తగినజాగ్రత్తలు తీసుకోవడమే తక్షణ కర్తవ్యం. సరైన ఏర్పాట్లు మార్గదర్శనం లేకపోవడం వల్లనే వీటిని మానవ తప్పిదమనే అనాలి. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో 18 మంది మరణించారు. వారిలో 14 మంది మహిళలు, నలుగురు చిన్నారులు ఉన్నారు. దుర్ఘటన జరిగిన సమయాల్లో ఏం జరిగింది? ఎలా జరిగింది? అన్న అంశాలను క్రోడీకరించుకుంటే 'మానవ తప్పిదం' వల్లనేనని అర్థమవుతుంది. ప్రయాగ్‌రాజ్‌కు కుంభమేళా త్రివేణి సంగమ స్నానాల కోసం వెళ్లే భక్తులు అతి తక్కువ సమయంలో రెండు సార్లు తొక్కిసలాటకు గురయ్యారు. ఈసారి కుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం రైల్వేశాఖ న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక రైళ్లను ఏర్పాటుచేసింది. 12వ ప్లాట్‌ఫారంమీదకు రైలు వస్తోందంటే వారంతాఅదే ప్లాట్‌ఫారం మీద బండి కోసం వేచిఉన్నారు. కాస్సేపట్లో బండి స్టేషన్‌లోకి వస్తుందనగా ఆ ఎక్స్‌ప్రెస్ రైలు 16వ ప్లాట్‌ఫారం మీదకు వస్తోందని రైలు స్టేషన్‌లో ఎనౌన్స్‌మెంట్ రాగానే ఈ ప్లాట్‌ఫారం మీద ఉన్నవారు మరో ప్లాట్‌ఫారం మీదకు తమ లగేజితో పరుగులు తీశారు. అక్కడే ఉన్న ఎస్కలేటర్‌ల మీదకు ఎక్కే సమయంలో తోపులాట జరిగింది. పరిమితికిమించి ఎక్కిన జనానికి అవిచాలక చాలా మంది భక్తులు కింద పడి పోయారు. మిగిలిన వారంతా వారి మీద పడిపోయారు. ఏ ట్రైన్ ఏ ప్లాట్‌ఫారం మీదకు వస్తుందో ముందే ప్రకటించి మళ్లీ 'తూచ్' అని మరో ప్లాట్‌ఫారం నంబరు ప్రకటిస్తే జరిగేదిదే. 'తొక్కిసలాట' జరిగిన ప్రతి ఉదంతమూ ఓ గుణపాఠంగా నేర్చుకోవలసిన ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు మృతులకు పరిహారాలు ప్రకటించి చేతులుదులు పుకోవడం సాధారణమైపోయింది. కుంభ మేళాస్నానాలకు వెళ్తుండగా చీకట్లో సాటి ప్రయాణికులను చూడకపోవడంతో జరిగిన తొక్కిసలాటలో కనీసం 8 మంది చనిపోయారన్న విషయం తెలిసిందే. అదోరకం అనుభవం, ఫలానా సంగం రేవులో స్నానం చేస్తేనే పుణ్యఫలం అని తప్పుడు అర్థం వచ్చే ప్రవచనాలను విన్న ఎంతో మంది భక్తులు అక్కడికే వెళ్లారు. అదే తొక్కిసలాటకు కారణమైంది. ఇప్పుడు న్యూఢిల్లీ స్టేషన్‌లో జరిగిన దుర్ఘటన లాంటిదే. ఇదే రైల్వే స్టేషన్‌లో 2004 నవంబరు 13న జరిగిన ప్రమాదంలో నలుగురు చనిపోయారు. కారణం కూడా ఒకటే. ఛాత్‌పూజ్ కోసం బీహార్ వెళ్లే రైలు కోసం ప్లాట్‌ఫారమ్ మీద ఎదురు చూస్తుండగా ఆ రైలు మరో ప్లాట్‌ఫారం మీదకు రానున్నట్లు తెలిసి ఒకేసారిగా ఎక్కువ మంది ప్రయాణీకులు ప్లాట్‌ఫారం మారే సమయంలో జీవర్ బ్రిడ్జిమీద తొక్కిసలాట జరిగి అసువులు బాసారు. తాజాగా న్యూఢిల్లీలో రైల్వేస్టేషన్ దుర్ఘటనలో సమయా నికి ఆలస్యంగా నడుస్తున్న స్వతంత్ర సేనాని ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఎక్కాల్సిన ప్రయాణికులు కూడా ప్లాట్‌ఫారమ్‌పై పడిగాపులు పడికూర్చున్నారు. రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాటల ఘటనలో ఇదే మొదటిసారి కాదు. కానీ అధికారులు ప్రయాణికుల రద్దీ ఎక్కువైనప్పుడు తీసుకునే జాగ్రత్తల విషయంలో గత అనుభవాలను పరిగణనలోకి తీసుకోకపోవడమే. గతంలోనూ రైలు ప్రయాణికులెందరో తొక్కిసలాటల కారణంగా మృతిచెందిన వైనాలు ఎక్కువే. అంబులెన్సులు, అగ్ని మాపకదళాలు రంగంలోకి దిగినా ప్రయాణీకులను సజీ వంగా రక్షించలేకపోయారు. 2017 సెప్టెంబరు 29న మహారాష్ట్ర ముంబయిలోని ఎల్ఫిన్స్టోన్ స్టేషన్‌లో జరిగిన ప్రమాదంలో 22 మంది మృతిచెందారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జిమిద తొక్కిసలాట జరిగింది. 2013 కుంభమేళా సందర్భంగా అలహాబాద్ రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 36మంది మృతిచెందారు.అది కూడా మౌని అమా వాస్య రోజున స్నానాలుచేసి తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం జరిగింది. ఒకేసారి ఎక్కువమంది రైల్వే స్టేషన్ కు చేరుకోవడం ఆలస్యమైన రైళ్లు కూడా వివిధ ప్లాట్‌ఫారమ్‌ల మిద నిలిచిఉండడం లేదా ఆలస్యంగా రావడంవంటి సమస్యవలన ప్రయాణికుల రద్దీ ఎక్కువ కావడమే కారణమే. 2007 అక్టోబరు 3న మొగల్ సరాయ్ జంక్షన్ రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కి సలాటలో 14 మంది మహిళలు మృతి చెందారు. పై ఉదహరించిన 8 రైలు ప్రమాదాలూ ఒకే కోవకు చెందినవి. అన్నీ ఉత్తర ప్రదేశ్‌లోని రైల్వేస్టేషన్‌లలో పర్వదినాలకు వచ్చి వెళ్లే ప్రయాణికుల తొక్కిసలాటల్లో విషాదాలే. కాగా ఆయా తొక్కిసలాటలలో తెలుసుకున్న అనుభవా లేమీ రైల్వేశాఖ వంటబట్టించుకున్నట్లులేదు. మళ్లీమళ్లీ తొక్కిసలాట ప్రమాదాలు జరగకుండా తీసుకున్న చర్య లేవీ కానరావడం లేదు.ఇకనైనా ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన, రైల్వే ఉన్నతాధికారుల మీద ఉంది. అంతిమంగా ఇలాంటి ప్రమాదాలకు బాధ్యత వహించాల్సింది రైల్వేశాఖయే!

మనిషి పరిపూర్ణత అతని ఆస్తులలో ఉండదు. అతని స్వభావంలో ఉంటుంది.



మహాత్మాగాంధీ

మాట్లాడిన మాట, వదిలిన బాణం, జరిగిన కాలం, వదులుకున్న అవకాశం, ఈ నాలుగు వెనక్కిరావు.



ప్లినీ

# ర్యాగింగ్ నియంత్రణకు చర్యలేవి?

**విద్యాలయాల్లో యాంటీ ర్యాగింగ్ టీమ్‌లను ఏర్పాటు చేయాలి. సీనియర్లు, జూనియర్లకు వేరువేరుగా హాస్టల్ సౌకర్యం కల్పించాలి. సున్నితమైన ప్రదేశాలలో సి.సి కెమెరాలు ఏర్పాటు చేయాలి. కళాశాలలో చేరినప్పుడే విద్యార్థులు, తల్లిదండ్రుల నుండి ర్యాగింగ్‌కు సంబంధించిన అఫడవిట్ తీసుకోవాలి. ర్యాగింగ్‌ను సమర్థవంతంగా అరికట్టే ప్రత్యక్ష చర్యను కళాశాలల్లో తీసుకోవాలి. హాస్టల్‌లో విద్యార్థుల కార్యకలాపాలపై వార్డెన్‌లు నిఘా ఉంచాలి. యాదృచ్ఛికంగా తనిఖీలు నిర్వహించాలి. విద్యార్థులు కూడా యాంటీర్యాగింగ్ సెల్స్, హెల్ప్‌లైన్ నంబర్లు, కౌన్సెలింగ్ సెంటర్లు మొదలైన వాటి గురించి తెలుసుకోవాలి. ర్యాగింగ్ నియంత్రణకు విద్యార్థులు, విద్యాసంస్థల అధికారులు, తల్లిదండ్రులు, మనస్తత్వవేత్తలు, పౌర సమాజం, న్యాయనిపుణులు, స్థానిక అధికారులు, రాజకీయ ప్రతినిధులు, సామాజిక సంస్థలు, మీడియా సమిష్టికృషితో ర్యాగింగ్‌ను నిరోధించవచ్చు.**

డి జె మోహనరావు

కేరళలోని కొట్టాయంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులపై సీనియర్లు ర్యాగింగ్ చేసారు. హాస్టల్ గదుల్లో వివస్త్రలను చేసి, ప్రైవేట్ భాగాలపై గాయాలు కలిగించడానికి డంబెల్స్ ఉపయోగించి తీవ్రమైన శారీరక వేధింపులకు గురిచేసి క్రూరంగా హింసించారు. ఈ విషయం విన్న ప్రజలందరూ ఒక్కసారి తుల్లి పడ్డారు. కొత్తగా కాలేజీలో చేరిన విద్యార్థులతో స్నేహాన్ని బలపరుచుకునే విధానాన్ని మరచి సాటి విద్యార్థులను హింసకు గురిచేసి వాటిని చూసి పాశవిక ఆనందాన్ని పొందుతూ ఒక్కోసారి సాటి విద్యార్థులను చావు దాకా తీసుకెళుతున్నారు అక్కడి సీనియర్లు. ర్యాగింగ్ వందలాదిమంది అమాయకుల ప్రాణాలను బలితీసుకుంది. వేలాది మంది తెలివైన విద్యార్థుల కెరీర్‌ను నాశనం చేసింది. విద్యా సంస్థల్లో సీనియర్ విద్యార్థులు జూనియర్లను మానసికంగా, శారీరకంగా వేధించడం లేదా అణచివేయడాన్ని ర్యాగింగ్ అంటారు.మాట్లాడడం లేదా వ్రాయడం ద్వారా ఇతర విద్యార్థులను ఆటపట్టించేలా ప్రవర్తించడం లేదా అసభ్యంగా ప్రవర్తించడం. క్రమశిక్షణారాహిత్యంతో కూడిన ఏదైనా క్రమరహిత ప్రవర్తన అని 1999లో విశ్వజాగృతి కేసువిషయంలోసుప్రీం కోర్టు ర్యాగింగ్‌ను నిర్వచించింది. ఇది మానవ హక్కుల దుర్వినియోగానికి పరాకాష్ట.ర్యాగింగ్ అనేది శారీరక, మానసిక, లైంగిక వేధింపులతో సహా అనేక రూపాలలో ఉంటుంది. ర్యాగింగ్ కూడా ఒక రకమైన వివక్షే ! రంగు, జాతి, మతం, కులం, లింగం, లైంగిక ధోరణి, భాషా గుర్తింపు, పుట్టిన ప్రదేశం, నివాసస్థలం, ఆర్థిక నేపథ్యం, ప్రాంతీయత ఆధారంగా మరొక విద్యార్థిపై చూపే వివక్ష ! దీనికి ఎక్కువ శాతంలో సామాన్యులు మాత్రమే అధికంగా బలవుతున్నారు. సామాజికంగా, ఆర్థికంగా హోదాలో ఉన్నవారి జోలికి ర్యాగింగ్ దరిచేరదు. ఎందుకంటే వాళ్లంటే భయం. డెబ్బైవ దశకం చివరిలో ఒక ప్రాంతీయ ఇంజినీరింగ్ కళాశాలలో ఇద్దరు ఫ్రెషర్లు మరణించిన తరువాత కేంద్ర ప్రభుత్వం దేశంలో ర్యాగింగ్‌ను నిషేధిస్తూ మొదటిసారి నోటిఫికేషన్‌ను జారీ చేసింది. మద్రాస్ విశ్వవిద్యాలయం అప్పటి వైస్ ఛాన్సలర్ కుమారుడు నవరసుపై అదే కళాశాలలో సీనియర్ విద్యార్థి జాన్ డేవిడ్ దాడి చేయడమే కాకుండా తన పాదరక్షలను విప్పి నాకమని బలవంతం చేశారు. అతను అలా చేయడానికి నిరాకరించడంతో అతన్ని హింసాత్మకంగా కొట్టి చంపారు. ఈ కేసు ఆధారంగా 1997లో తమిళనాడు రాష్ట్రం దేశంలోనే మొట్టమొదటి ర్యాగింగ్ నిరోధక చట్టాన్ని ఆమోదించింది. ర్యాగింగ్‌ను అరికట్టేందుకు విశ్వవిద్యాలయాలకు మార్గదర్శకాలను జారీ చేయాలని విశ్వజాగృతి మిషన్ దాఖలు చేసిన పిల్‌పై సుప్రీంకోర్టు 1999లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ని కోరింది.ప్రొఫెసర్ కెపియస్ ఉన్ని ఆధ్వర్యంలో నలుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ర్యాగింగ్‌పై చట్టాలు తీసుకురావాలని, అడ్మిషన్ రద్దు నుంచి లక్షరూపాయల వరకు జరిమానాతోపాటు శిక్షలువిధించాలని పేర్కొన్నారు.వసతి గృహాల్లో వార్డెన్‌లు అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. ర్యాగింగ్‌ను అరికట్టడంలో విఫలమైన సంస్థలను మూసేయ్యాలని కూడా సూచించారు. 2001లో సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా ర్యాగింగ్‌ను నిషేధించింది. ర్యాగింగ్ సమస్యలను పర్యవేక్షించడానికి, పరిష్కరించడానికి విద్యాసంస్థలలో ప్రొక్టోరల్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. తీవ్రమైన సంఘటనలు జరిగితే పోలీసులకు నివేదించాలని సిఫార్సు చేసింది.



2006లో సుప్రీంకోర్టు ర్యాగింగ్‌ను నిరోధించడానికి మార్గాలు, పద్ధతులను సూచించడానికి సిబిఐ డైరెక్టర్‌డాక్టర్ రాఘవన్ ఆధ్వర్యంలో మరొక కమిటీని ఏర్పాటుచేసింది. 2007 ఆర్.కె. రాఘవన్ కమిటీ నివేదిక ర్యాగింగ్‌ను మానసిక వ్యాధిగా అభివర్ణించింది. దాని నిషేధం, నివారణ చర్యల అమలు రెండింటినీ సిఫార్సు చేసింది.ర్యాగింగ్‌కు పాల్పడే వ్యక్తులపై తీసుకోగల చర్యలను, దీనిని అరికట్టడంలో విఫలమైన సంస్థలపై సాధ్యమయ్యే చర్యలను సూచించడం మొదలైన పలు కీలకఅంశాలను స్పృశిస్తూ ర్యాగింగ్‌కుమానసిక, సామాజిక, రాజకీయ, ఆర్థిక,సాంస్కృతిక సహా అనేక అంశాలున్నాయని, ఇది ఉన్నత విద్యాప్రమాణాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొంది. పాఠశాల దశ నుంచే మానవీయ విలువలను పెంపొందించడంలో మన వైఫల్యం ర్యాగింగ్‌గా పరిగణించబడుతుందని పేర్కొంది. క్యాంపస్‌లలో ర్యాగింగ్ కేసుల పెరుగుదల సమస్యను పరిష్కరించడానికి యుజిసి ఉన్నత విద్యాసంస్థల్లో ర్యాగింగ్ ముప్పును అరికట్టడానికి కొన్ని నిబంధనలను 2009లో తీసుకువచ్చింది. ఈ నిబంధనలను అన్ని ఉన్నత విద్యా సంస్థలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించింది. ర్యాగింగ్ చేసిన వారు దోషులుగా తేలితే వారిపై తీసుకోవలసిన చర్యలను సూచించింది.అవి తరగతులకు హాజరు కాకుండాసస్పెన్షన్లు చేయొచ్చని,స్కాలర్‌షిప్ లేదా ఫెలోషిప్,ఇతర ప్రయోజనాలను ఉపసంహరించుకోవచ్చని, పరీక్షలకుహాజరు కాకుండా డిబార్ చేయొచ్చని, పరీక్షల ఫలితాలను నిలిపేయొచ్చని, సంస్థ నుండి బహిష్కరణ తత్ఫలితంగా నిర్ణీత వ్యవధిలో ఏదైనా ఇతర సంస్థలో ప్రవేశం నుండి డిబార్ చేయడం వంటివి ఉన్నాయి.ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1997లో ఆంధ్రప్రదేశ్ ర్యాగింగ్ నిషేధ చట్టాన్ని ప్రవేశపెట్టింది.విద్యాసంస్థలు, కళాశాలలు, విద్యను బోధించే ఏ సంస్థఅయినా, విద్యార్థి వసతిగృహం, ట్యుటోరియల్ కాలేజీ, రోడ్లు, బస్సులు ఆగేప్రాంతం, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, వైద్యశాలవంటి ప్రదేశాలన్నింటిలోనూ ర్యాగింగ్ జరపటం నేరంగా పేర్కొంది. ర్యాగింగ్ సందర్భంలో మరణించటం జరిగిన లేదా ఆ విద్యార్థి ఆత్మహత్యకు లోనైనా నేరస్తునికి జీవిత ఖైదు లేదా 10 సంవత్సరాల వరకు జైలుశిక్ష, 50,000 రూపాయలవరకు జరిమానా విధింపబడతాయని తెలిపింది. చట్టాలు ప్రధానంగా ర్యాగింగ్ మూల కారణాలు, ప్రవర్తనలను పరిష్కరించడం కంటే దానిని నిషేధించడంపై దృష్టి పెడుతున్నాయి. ఫలితంగా ర్యాగింగ్ సంఘటనలను నిరోధించడంలో విఫలమవుతున్నాయి. విద్యాసంస్థలు తమ ర్యాగింగ్ నిరోధక ప్రయత్నాలను ర్యాగింగ్ నిరోధక నోటీసులను ప్రదర్శించడం, అండర్ టేకింగ్‌లను పొందడం వంటి లాంఛనాలకే పరిమితం చేస్తున్నాయి. ఇవి ర్యాగింగ్‌ను సమర్థవంతంగా నిరోధించలేకపోతున్నాయి. యుజిసి 2009 నిబంధనలు, మార్గదర్శకాలు ఉన్నప్పటికీ అధికారులు కఠినంగా అమలు చేయకపోవడం వల్ల క్యాంపస్ వాతావరణాలు అసురక్షితంగా మారుతున్నాయి. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ర్యాగింగ్ గురించి అవగాహన కలిగించాలి. విద్యాలయాల్లో యాంటీ ర్యాగింగ్ టీమ్‌లను ఏర్పాటుచేయాలి. సీనియర్లు, జూనియర్లకు వేరు వేరుగా హాస్టల్ సౌకర్యం కల్పించాలి.సున్నితమైన ప్రదేశాలలో సి.సి కెమెరాలు ఏర్పాటుచేయాలి. కళాశాలలో చేరినప్పుడే విద్యార్థులు, తల్లిదండ్రుల నుండి ర్యాగింగ్‌కు సంబంధించిన అఫడవిట్ తీసుకోవాలి. ర్యాగింగ్‌ను సమర్థవంతంగా అరికట్టే ప్రత్యక్ష చర్యను కళాశాలల్లో తీసుకోవాలి.హాస్టల్‌లో విద్యార్థుల కార్యకలాపాలపై వార్డెన్‌లు నిఘా ఉంచాలి. యాదృచ్ఛికంగా తనిఖీలు నిర్వహించాలి. విద్యార్థులు కూడా యాంటీర్యాగింగ్ సెల్స్, హెల్ప్‌లైన్ నంబర్లు, కౌన్సెలింగ్ సెంటర్లు మొదలైన వాటి గురించి తెలుసుకోవాలి. ర్యాగింగ్ నియంత్రణకు విద్యార్థులు, విద్యాసంస్థల అధికారులు, తల్లిదండ్రులు,మనస్తత్వవేత్తలు,పౌరసమాజం,న్యాయనిపుణులు, స్థానిక అధికారులు,రాజకీయ ప్రతినిధులు, సామాజిక సంస్థలు, మీడియా సమిష్టికృషితో ర్యాగింగ్‌ను నిరోధించవచ్చు. దీన్ని అరికట్టడానికి చట్టాలు, విద్యాసంస్థల భాగస్వామ్యం, సమాజంలో నైతిక బాధ్యత అవసరం. ప్రతివిద్యార్థి సురక్షితమైన వాతావరణంలో చదువుకునే హక్కును కాపాడటం అందరి కర్తవ్యం.ర్యాగింగ్ రక్కసిని పక్కకు తోసేయాలి. ●

# ప్రజాస్వామ్యానికి సరైన చిరునామా భారత్

కనుమ ఎల్లారెడ్డి

ప్రపంచంలోని అన్ని దేశాలలో కంటే భారత్‌లోనే ప్రజాస్వామ్యం బలంగా ఉంది. భారత్‌లో ప్రజాస్వామ్యం చూసి ఎన్నో దేశాలు నేర్చవలసి ఉంది. నియంతలుఎక్కువ కాలం నిలదొక్కుకోలేరు. అందుకు ఫాసిజం, నాజిజమే ఉదాహరణ. అసలు నియంతలు భారత్‌లో ఉండరు. ఉన్నా ఎక్కువ కాలం మనజాలలేరు. నేడు విశ్వమంతా భారత్ వైపే దృష్టి సారిస్తోంది. భారత్ వంటి అతి పెద్ద దేశాలలో ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టాలంటే మాటలు కాదు.అందుకు నేతలు కూడా శ్రమించాలి. మరీ ముఖ్యంగా ప్రజలు నీతి వర్తనులుగా ఉండాలి. అబ్రహాం లింకన్ ప్రజాస్వామ్యంపై చెప్పిన నిర్వచనం నూటికి నూరు పాళ్లు భారత్‌కు అతికినట్లు సరిపోతుంది. ఆయన మాటలలో "ప్రజలకొసం, ప్రజల వలన, ప్రజల చేత ఎన్నుకోబడినదే అసలు సిసలు ప్రజాస్వామ్యం. ఇక్కడ ప్రజలకే అధికారం ఇవ్వబడింది. తనకున్న ఓటు హక్కు ద్వారా ప్రజానీకం ప్రభుత్వాలను మార్చి వేయగలరు. భారత్‌లో ఓటు హక్కు నిర్ణీత వయోపరిమితి అంటే 18 సంవత్సరాలు దాటిన ప్రతి పౌరునకు ఎటువంటి వివక్ష లేకుండా ఇవ్వబడింది. ఇక్కడ చదువు కొలమానం కానేకాదు. ఓటర్‌కు వయసే ముఖ్యం. అంటే నిర్ణీత వయసు వచ్చిన తరువాత అతనికి లేక ఆమెకు ఆలోచించే గుణం ఉంటుంది అనేది ఇక్కడముఖ్యం. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు ప్రజలు నిశితంగా గమనిస్తారు. అభివృద్ధి, సంక్షేమం గమనిస్తారు. రెండు సమపాళ్లలో ఉంటే అటు వంటి ప్రభుత్వంను ఎన్నుకుంటారు. ఇటీవల ఎన్నికలలో కూడా అదే రుజువైంది. అందుకనే భారత విదేశాంగ మంత్రి జై శంకర్ కూడా భారత్‌లో ప్రజాస్వామ్యం ఎప్పుడు విజయ వంతం అవుతుంది. ప్రజాస్వామ్యానికి అసలు చిరునామా భారతే అని చెప్పడం గమనార్హం. మన పొరుగు దేశాలలో ప్రజాస్వామ్యం విఫలంకావటం, ఆర్థిక సంక్షోభం, ఆస్థిరత చోటు చేసుకోవడం, సాక్షాత్తు ఒక ప్రధానిపై తిరుగుబాటు చేయడం, ప్రధాని నివాసంలోకి చొరబడటం, చివరికి ప్రధాని పలయానం చేయడం చూస్తున్నదే. అటు వంటి అమానుష చర్యలు భారత్‌లో మచ్చుకైనా కనిపించవు. కారణం ప్రభుత్వం నిబద్ధతతో, కార్యశీలతతో ప్రజారంజకంగా పనిచేయటమే. ఒక ప్రధానిని పదవీ విచ్యుతుని చేయడంఅంటే దానికి కొన్ని పద్ధతులున్నాయి. అంతేకాని ప్రధాని నివాసంలోకి జొరబడటం, చివరకు ప్రధాని పారిపోవటం, దాడి చేయటం హేయమైన చర్య. ప్రజాస్వామ్యం బలంగా లేకపోతే, పాలన సరిగ్గాలేకపోతే ఇటువంటి చర్యలు ఉంటాయి. భారత్‌లో ప్రజాస్వామ్యం ఎప్పుడు బలంగానే వుంటుంది. ప్రజలకు అవసరమైన చర్యలు చేపడుతుంది.దానికి ఉదాహరనే 80కోట్ల మందికి రేషన్ ఉచితంగా ఇవ్వటం. ప్రజలు ఓటింగ్‌లో పాలుపొందడం. మ్యూనిచ్‌లో ఇదే విషయాన్ని మన విదేశాంగా మంత్రి చెప్పడం సరైనదే. దాదాపు 70కోట్ల మంది ఓటింగ్‌లో స్వేచ్ఛగా పాల్గొన్నారు. ప్రజాస్వామ్యం ఎన్నో సవాళ్ళను ఎదుర్కొని నిలబడింది. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితులలో ప్రజలు చూపిన క్రమశిక్షణ ఎన్నదగినది. అంటే ప్రభుత్వానికి, ప్రజలు పూర్తిగా సహకరిస్తున్నట్లే లెక్క. ప్రజలకు లోబడి ప్రభుత్వం, ప్రభుత్వానికి లోబడి ప్రజలు ఉండటం భారత్ చేసుకున్న అదృష్టం. నాటికీ, నేటికీ విశ్వంలో భారతే అసలు, సిసలు ప్రజాస్వామ్యం. అది దేశ ప్రజలందరికి గర్వకారణం. ●

# గిరిజన హక్కులను కాలరాస్తున్న చట్టాలు!

బొల్లిముంతసాంబశివరావు

అడవి, అటవీభూముల, సంపదలపై తరతరాలుగా వస్తున్న ఆదివాసీ గిరిజనుల హక్కులను హరించటానికి వలస పాలకుల నుంచి దేశీయ పాలకుల వరకు అనేక గిరిజన వ్యతిరేక చట్టాలు చేశారు.1855లో భారత గవర్నర్ జనరల్‌లాగా బ్రిటిష్ ప్రభుత్వం పంపిన డల్హౌసీతొలి గిరిజన వ్యతిరేక అటవీ విధానాన్ని ప్రకటించి, అటవీ సంపదలన్నీ ప్రభుత్వ ఆస్తిగా ప్రకటించాడు. 1864లో అటవీ ఇన్‌స్పెక్టర్ జనరల్ నియామకంతో అడవిపై బ్రిటిష్ ప్రభుత్వ పెత్తనం ప్రారంభమైంది. 1865లో మరోచట్టం ద్వారా పూర్తిగా అడవులను తనఆధీనంలోకి తెచ్చుకునేందుకు బ్రిటిష్ ప్రభుత్వం హక్కు పొందింది. అధికార మార్పిడి తర్వాత దేశీయ పాలకులు, వలస పాలకుల విధానాలనే కొనసాగించారు. ఈ విధానం ద్వారా కేంద్రప్రభుత్వం రిజర్వు,రక్షిత, గ్రామ అడవులుగా, అటవీ ప్రాంతాన్ని విభజించింది. ఫలితంగా అడవి పై గిరిజనుల హక్కు పరిమితమైంది. 1973లో 'టైగర్ ప్రాజెక్టు' పేరుతోగిరిజనులను అడవి నుండి వెల్లగొట్టేందుకు పూనుకుంది. 1980లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన గిరిజన వ్యతిరేక చట్టం అడవి నుండి గిరిజనులను ఖాళీ చేయించే చర్యలు తీసుకుంది. 2023లో మోడీ ప్రభుత్వం అటవీ హక్కుల సవరణ చట్టద్వారా అటవీ భూములను బడా పారి శ్రామికవేత్తలకు కట్టబెట్టే విధానాలు చేపట్టింది. అడవిపై తమకు తరతరాలుగా ఉన్నహక్కును హరిస్తుండడం వలన పాలకులు, దేశీయ పాలకులు చేసిన చట్టాలకు వ్యతిరేకంగా గిరిజనులు అనేక పోరాటాలుచేశారు. 1802-03లో తిరుగుబాటు, 1830లో బీహార్,బెంగాల్లలో కోలి తిరుగుబాటు, 1855-56లో సంతాల గిరిజనుల తిరుగుబాటు, 1967లో నక్సల్బరి గిరిజన రైతాంగ తిరుగుబాటు, 1968-70 వరకుసాగిన శ్రీకాకుళ గిరిజన మిలిటెంట్ ఉద్యమం ముఖ్య మైన గిరిజన పోరాటాలు. షెడ్యూల్డ్ ఏరియా భూ బదలా యింపు నిబంధనల 1959 చట్టం,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మార్చి 4,1959లో అమల్లోకి వచ్చింది. ఈచట్టం వచ్చి66 సంవత్సరాలైనా, అమలు మాత్రం జరగలేదు. ఈచట్టంలోనూ గిరిజనులకు నష్టం కలిగించే అంశాలు ఉన్నాయి. ఈ చట్టం గిరిజనుల భూములను, 1963కంటేముందు నుంచి స్థానికంగా ఉండి భూమి హక్కులు కలిగిన గిరిజనేతరుల భూములను కూడా కాపాడుతుంది. దీనిఫలితంగా గిరిజనులకు చెందాల్సిన భూములు గిరిజనేతరుల పరమోతాయి. ఇది గిరిజన హక్కులను కాలరాయటమే. భారత రా జ్యాంగంలో ఆర్టికల్ 244 (1)ప్రకారం 5వ షెడ్యూల్డ్ ప్రాంతాలుగా గుర్తించిన వాటిల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతోపాటుతెలంగాణ ప్రాంతంలో ఉమ్మడి అదిలాబాద్, వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలుకూడా ఉన్నాయి.వీటిల్లో ఐదవ షెడ్యూల్డ్ అమల్లో కూడా ఉంది. తెలంగాణ ప్రాంతంలో ఈచట్టం 1963లో అమల్లోకివచ్చింది. ఈచట్టం నియమాలను 1969లో రూపొందించారు. దీనికి కీలకసవరణలు 1970 జరిగాయి కనుక ఈచట్టం 1/70గా ప్రాచుర్యంలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం గిరిజన ఉద్యమం, ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనుల భూమి సమ స్యను ముందుకు తెచ్చింది.గిరిజన



పోరాటాలు ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా చూసేందుకు ప్రభుత్వమే గిరిజను లకు భూములు ఇచ్చివారి హక్కులకు రక్షణ కల్పిస్తుందనే భ్రమలు కల్పించటానికి ఆనాటి బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ 1970లో1/70 చట్టాన్ని చేసింది. ఈచట్ట ప్రకారం గిరిజన ప్రాంతాల్లో భూమిపై పూర్తిహక్కు గ్రామసభలకు, పంచాయితీలకు, గిరిజన సలహామండలికి ఉంటుంది. గిరిజన ప్రాంతాల్లో సెంటు భూమి సేకరించాలన్నా గ్రామసభ, పంచాయితీ తీర్మానం అవసరం.ఈతీర్మానం గిరిజన సలహా మండలిపంపుతారు. 1/70సెక్షన్ 3 ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని అన్ని అటవీ సంపదలు, భూములు కేవలం గిరిజనులకు గాని లేక గిరిజనులు మెంబర్లుగా ఉన్న సొసైటీకి మాత్రమే చెందుతాయి. అందుకు విరుద్ధంగా గిరిజనే తరులు భూములు పొందితే చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయి. ఒక గిరిజనేతరుడి నుంచి గిరిజనుడు లేదా గిరిజనులతో కూడిన సొసైటీ బదలాయింపు చేసుకోవచ్చు. ఏజన్సీ ప్రాంతంలో ఒక గిరిజనేతరుడికి భూమిపై హక్కుఉంటే, తమ వారసులకు మాత్రమే భూ బదలాయింపు చేయాలి. 5వషెడ్యూల్లో ఉన్న అటవీ భూములను ప్రైవేట్ మైనింగ్ కంపెనీలకు లీజుకి ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమతాస్వచ్ఛంద సంస్థ 1993లో హైకోర్టులో కేసు వేయగాదాన్ని హైకోర్టుకొట్టివేస్తే, తిరిగి సమతాసంస్థ సుప్రీమ్ కోర్టులో స్పెషల్లీ విపిటిషన్ దాఖలు చేసింది. 1997 జూలైలో సుప్రీమ్కోర్టు త్రిసభ్య ధర్మాసనం తనతీర్పులో షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ప్రైవేట్మైనింగ్కంపెనీలకు ప్రభుత్వలేదా దానిసంస్థలు లీజుకిఇచ్చిన భూములు చెల్లవని తీర్పుఇచ్చింది. ఇదిసుప్రీమ్ కోర్టు సమతా తీర్పుగా ప్రాచుర్యంపొందింది. పీసాచట్టంకూడాప్రతిఆదివాసీ సమూ హా నికి, తమ గ్రామపరిధిలోని సహజవనరులపై హక్కు గ్రామ సభలకు మాత్రమే ఉందని స్పష్టంచేసింది. చట్టాలు చేయటం, వాటిని నిర్వీర్యం చేయటం పాలకుల విధానంగా మారింది.ఏచట్టం సక్రమంగా అమలుజరపలేదు. 1/70 చట్టం అందుకు మినహాయింపుకాదు. చట్టంలోకూడా గిరిజనేతర భూకామందులకు అనుకూలంగా అనేక అంశాలున్నాయి. గిరిజనులకు చెందాల్సిన వేలాది ఎకరాల భూములు గిరిజనేతరుల ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు డివిజన్లో 29,554.16 హెక్టార్లు, ఖమ్మం ఏజన్సీలో 4,07,368 ఎకరాలు,వరంగల్ జిల్లా ములుగు మండలంలో 1200 ఎకరాల భూములను గిరిజనేతరులు కబ్జాచేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లామనుగోపాల ప్రాంతంలో వేలాది ఎకరాల గిరిజన భూములను భూస్వాములు దౌర్జన్యంగా కాజేశారు.గిరిజనులకు చెందాల్సిన అటవీ భూములను, బహుళజాతి సంస్థలకు,గిరిజనేతరులకు కట్టపెట్టేందుకు 1996-2001 మధ్యతెలుగుదేశం ప్రభుత్వ పాలనలో1/70 చట్టసవరణకు నాటి ముఖ్యమంత్రి దగ్గర నుండి శాసనసభ కమిటీల నివేదికలదాకా అనేక ప్రయత్నాలు జరిగాయి. గత చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగానే 1/70 చట్టం గురించి స్పీకర్ అయ్యన్న పాత్రుడు మాట్లాడటం జరి గింది. చట్టంరద్దు అయితే భూములను, అటవీ సంపదలను గిరిజనులు కోల్పోతారు. ఈప్రమాదాన్ని గ్రహించిన స్పీకర్కు, కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గిరిజన ప్రజలు ఉద్య మించారు. ప్రభుత్వం వెడల గిరిజనుల్లో ఏర్పడిన వ్యతిరేక తను గమనించి,ఆఉద్యమాన్ని విరమించేలా చేయటాని కి1/70 చట్టాన్నిరద్దుచేయమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ప్రకటనచేయాల్సి వచ్చింది. గిరిజనులు అప్రమత్తత కలిగి ఉండాలి. ●

# ప్రజావాక్కు



### ర్యాగింగ్‌ని పూర్తిగా అరికట్టాలి

2001వ సంవత్సరంలో సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా ర్యాగింగ్‌ని నిషేధించింది.కానీ ఈమధ్యనే కేరళ రాష్ట్రం కొట్టాయంలోని ప్రభుత్వ నర్సింగ్‌కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులపై సీనియర్ విద్యార్థులుర్యాగింగ్ చేశారు. హాస్టల్ గదుల్లో వివస్త్రలను చేసి, ప్రైవేటు భాగాలపై గాయాలు కలిగించడానికి డంబెల్స్ ఉపయోగించి తీవ్రమైన శారీరక వేధింపులకు గురిచేసి క్రూరంగా హింసించారు. ఈ విషయం విన్న ప్రజలందరూ ఒక్కసారిగా తుల్లి పడ్డారు. క్యాంపస్లలో ర్యాగింగ్‌కేసుల పెరుగుదల సమస్యను పరిష్కరించడానికి యు.జి.సి ఉన్నత విద్యాసంస్థల్లో ర్యాగింగ్ ముప్పును అరికట్టడానికి కొన్ని నిబంధనలను 2009వ సంవత్సరంలో తీసుకువచ్చింది. ర్యాగింగ్లలకు పాల్పడే వ్యక్తులపై వెనువెంటనే చర్యలు తీసుకొని అలాగే ర్యాగింగ్లలను అరికట్టడంలో విఫలమైన విద్యాసంస్థలపై సాధ్యమయ్యే చర్యలను ఆయా రాష్ట్రప్రభుత్వాలుతీసుకొనే విధంగా,కేంద్రప్రభుత్వం దిశానిర్దేశంచేస్తేముందు ముందు ఇటువంటి ర్యాగింగ్‌లను పూర్తిగా అరికట్టవచ్చును.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### మాతృభాషలోనే విద్యాబోధన జరగాలి

ప్రస్తుత విద్యా విధానంలో విద్యార్థులు మానసిక వత్తిడికి లోనవుతున్నారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 350(ఎ) ప్రకారం మాతృభాషలోనే విద్యాబోధన చేయాలి. ఓపెన్ బుక్ పరీక్షలు నిర్వహించాలి.పుస్తకాల బరువుతగ్గించాలి. ఫీజులను నియంత్రించాలి.శారీరక శిక్షలు నిషేధించాలి. విద్యార్థులకు ఆసక్తి ఉన్న అంశంలోనే విద్యాబోధన చేయాలి. ఆట పాటలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

- పుట్టూరి రాం నర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

### సౌర పార్కులు ఏర్పాటు చేయాలి

పెరుగుతున్న ఉప ధృవాలు, సుడిగుండాలు వాతావరణ మార్పులు జనజీవనంపైన చాలా ప్రభావాన్ని చూపుతున్నాయి.మరొకవైపు ప్రపంచఉష్ణోగ్రతలుతగ్గించడం కోసం ఒప్పందాలు జరుగుతున్నాయి. సౌర పవన విద్యుత్ ఉత్పత్తి ద్వారా జార్ఖండ్ తెలంగాణ, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లాంటి బొగ్గు ఉత్పత్తి చేసే రాష్ట్రాలు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆ రాష్ట్రాలలో పీపీపీ మోడ్‌లో సౌర పార్కులు, సౌర విద్యుత్ ఉత్పత్తి క్లస్టర్లు ఫామ్ చేయాలి.

- భారత అవినాష్, జనగామ

### సమావేశాల నిర్వహణలో లోపాలు సరిచేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి నెలమూడవ శనివారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహణలో అనేక లోపాలు బయటపడ్డాయి. ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ఉదయం ఉపాధ్యాయులందరూ తమ తమ పాఠశాలలకు వెళ్లి మధ్యాహ్నం వరకు తమ పాఠశాలలో విధులు నిర్వహించి, తర్వాత వారికి కేటాయించిన క్లస్టర్ పాఠశాలలకు ఒంటి గంటకు హాజరుకావడం చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. క్లస్టర్‌పాఠశాల సమావేశాల పనివేళలు అర్ధ రోజు కాకుండా ఒకరోజు పూర్తిగా వుండాలి. అలా వీలుకానీ పక్షంలో పాత పద్ధతినే కొనసాగించాలి. ఇటీవలజరిగిన సమావేశాలు సాయంత్రం ఐదు గంటలవరకు జరిగాయి. సాయంత్రం ఐదుగంటల తర్వాత దాదాపు 5:45వరకు ఉపాధ్యాయులు వేచి ఉండి అటెండెన్స్ యాప్‌లో తమ హాజరును నమోదు చేసుకోవడం కొరకు ఎంత ప్రయత్నించినప్పటికీ ఫేషియల్ అటెండెన్స్ యాప్ పని చేయకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారు.

-వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### రాష్ట్రపతి పాలన విధించాలి

భారతీయ జనతా పార్టీ దేశంలో పగ్గాలు చేపట్టిన తరువాత ఏరాష్ట్రంలోనూ రాష్ట్రపతి పాలన విధించిన దాఖలాలులేవు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించడం కేవలం బి.జె.పి. స్వయంకృతాపరాధమే. ఇది కాదన లేదనే పరమసత్యం. గత రెండు సంవత్సరాలుగా ఆ రాష్ట్రంలో మైతీ, కుకీ తెగల మధ్య రిజర్వేషన్ల వివాదం సృష్టించిన మారణ హోమాలు ఎడతెరపి లేకుండా జరుగుతున్నా ప్రధానమంత్రి వీటిని చల్లార్చే ప్రయత్నం చేయకపోగా ఒక్కసారి కూడా తన ఏలుబడిలో నున్న రాష్ట్రానికి వెళ్ళకపోవడం అగ్నిలో ఆజ్యం పోసినట్టయింది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### వయోపరిమితి పెంచాలి

ఏడు సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక్క డిఎస్సి నోటిఫికేషన్ కూడా విడుదల చేయకపోవడంతో ఎంతో మంది అభ్యర్థులు నిర్ణీత వయసుమీరి డిఎస్సి రాసేందుకు దూరమవుతున్నారు. కొత్తప్రభుత్వం ప్రకటించనున్న డిఎస్సిలో అభ్యర్థులందరికీ న్యాయంజరిగేలా జనరల్ అభ్యర్థులకుగరిష్ట వయోపరిమితిని యాభై యేళ్లకు, మిగతా వెనుకబడిన కులాల వారికి యాభై ఐదేళ్ల వరకు పొడిగించాలి. వయోపరిమితి సడలింపు విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి.

-తూలుగు రమణారావు, అక్కరాపల్లి

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రార్థనామందిరాల చట్టంపై అదనపు పిటిషన్లకు నో!



## 1991 చట్టాన్ని కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది


## మందిర్, మసీదు పిటిషన్ల విచారణలో సుప్రీం చీఫ్ జస్టిస్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** ప్రార్థనామందిరాల చట్టం ప్రయోగించి మసీదుల్లో హిందూ ప్రార్థనా మందిరాలను గుర్తించాలంటూ దాఖలవుతున్న పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేసారు. 1991లో వచ్చిన ప్రార్థానామందిరాల చట్టం అనేది ఒక ప్రార్థనా మందిరం తమ మతానికి చెందినదని లేదా ప్రార్థనలు చేసుకునేందుకు కానీ, లేదా వాటి స్వభావాన్ని మార్చుకునేందుకు కాను ఈ చట్టం ప్రయోగించేందుకు వీలుండేది. అయిందేదో అయిపోయింది. ఇక చాలు ఇప్పటికయినా ఒక ముగింపు ఉండాలి అంటూ సుప్రీం చీఫ్‌జస్టిస్ వ్యాఖ్యలుచేసారు. ఇప్పటికే లెక్కకు మించిన సంఖ్యలో దాఖలయిన పిటిషన్లు పేరుకుపోయాయని ఇకపై ఈకేసుకు సంబంధించి కొత్తగా తమను పార్టీలనుచేయాలంటూ దాఖలయిన పిటిషన్లను అనుమతించేది లేదని సుప్రీం చీఫ్ జస్టిస్ సంజీవ్‌ఖన్నా స్పష్టంచేసారు.

అయితే కొన్ని వాదనలు విన్న తర్వాత ఒక ఇందులో తమను భాగస్వాములను చేయాలన్న పిటిషన్‌ను అనుమతించింది. అయితే ఈ పిటిషన్లపై నోటీసులు జారీచేసేందుకు మాత్రం నిరాకరించింది. సుప్రీం కోర్టులో ప్రార్థనా మందిరాల చట్టం చెల్లుబాటును సవాల్‌చేస్తూ దాఖలయిన పిటిషన్లను విచారణచేస్తున్న సంగతి తెలిసిందే. హిందూ దేవాలయాలను ధ్వంసం చేసారని వాటిని తిరిగి స్వాధీనం చేసుకునే విధంగా చేపట్టిన కార్యాచరణలకు సంబంధించి దాఖలయిన పిటిషన్లను ఆయన విచారణ చేస్తున్నారు. 1991లో ఈ చట్టం ప్రవేశపెట్టారు. మతపరమైన ప్రార్థనా స్థలం ఆరాధనా స్థలాల స్వభావస్వరూపాన్ని మార్చడానికి వీలులేదని ఈ చట్టంలో పొందుపరిచారు. 1947 ఆగస్టు 15నుంచి అమలులో ఉన్న చట్టం స్థానంలో ఈ చట్టాన్ని ప్రవేశపెట్టారు. అయితే అయోధ్య రామజన్మభూమి వివాదం ఈచట్టం పరిధిలోకి రాదని అప్పట్లో తేల్చారు. వాస్తవ పిటిషన్‌ను సుప్రీం న్యాయవాది అశ్వినికుమార్ ఉపాధ్యాయ్ దాఖలుచేసారు. గత ఏడాది ఇందుకు సంబంధించే హిందూ పార్టీలు 18 వ్యాజ్యాలు దాఖలు చేసాయి. దేశంలో ఉన్న పది మసీదులు కూడా హిందూ దేవాలయాలను కూల్చివేసి నిర్మించారని ఆ స్థలాలను స్వాధీనంచేయాలంటూ ఈ పిటిషన్లు ఖలయ్యాయి.

వీటిలో షాహి ఈద్గా కృష్ణ జన్మభూమి, కాశి విశ్వనాథ్ గ్యానవాపి మసీదు, సంభాల్ మసీదు వంటివికూడా ఉన్నాయి. అన్ని పిటిషన్లు కూడా మందిర్‌మసీదుకు సంబంధించినవే కావడం విశేషం. కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడే ఈ చట్టం ఆమోదించింది. ఇపుడు కాంగ్రెస్ పార్టీతోపాటు అసదుద్దీన్ ఒవైసీ మజ్లిస్‌పార్టీకూడా పిటిషనర్‌గా చేరింది.

ఈ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలుచేయాలని వారు కోరారు. అయితే మరొక పిటిషనర్ తరపున న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ ఈ చట్టాన్ని ఖచ్చితంగా అమలుచేయాల్సిన అవసరం ఉందని కోరారు. విచారణలో చీఫ్‌జస్టిస్ గత వాయిదాలో కొత్త పిటిషన్లను అనుమతించారు. అయితే ఇలాంటి పిటిషన్ల దాఖలుకు కొంత పరిమితి అంటూ ఉంటుందని ఎలాంటి ఆధారాలు లేని పిటిషన్లను అనుమతించబోమని పిటిషన్ దాఖలుచేసేముందు క్షేత్రస్థాయి ఆధారాలు ఉండాలని సంజీవ్‌ఖన్నా అన్నారు. సీనియర్ న్యాయవాది వికాస్‌సింగ్ పిటిషనర్ల తరపున వాదిస్తున్నారు. కేంద్రంనుంచి వచ్చే స్పందనను గమనించాలని కోరారు. తదుపరి విచారణను ఏప్రిల్ మొదటి వారానికి వాయిదా వేసారు.



# ఢిల్లీలో స్వల్పస్థాయిలో భూప్రకంపనలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** దేశరాజధాని ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో సోమవారం తెల్లవారుజామున భూకంపం సంభవించింది. ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్‌ప్రాంతాల్లో కొన్ని సెకన్లపాటు భూమి కంపించింది. రిక్టర్‌స్కేలుపై దీని తీవ్రత 4.0గా నమోదయింది. ధౌలాకాన్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కాలేజీ సమీపంలో ఐదు కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రకంపనలు సంభవించిన సమయంలో కొన్ని సెకన్లపాటు పెద్దశబ్దం వినిపించింది. అసలు ఆ శబ్దానికి గల కారణాలను నిపుణులు వెల్లడించారు. తక్కువ లోతున ఉండే భూకంప కేంద్రం ఏర్పడినప్పుడు ఇలాంటి శబ్దాలు వస్తాయని శాస్త్రవేత్తలు చెపుతున్నారు. స్వల్పకాలం వచ్చిన భూమి ప్రకంపనలు గాలిలో కలిసి ధ్వని తరంగాలుగా ఏర్పడతాయని యుఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది. అధిక ఫ్రీక్వెన్సీ ప్రకంపనల కారణంగా బూమ్ శబ్దం వస్తుందని తెలిపింది. కొన్నిసార్లు ప్రకంపనలు రాకపోయినప్పటికీ ఈ భారీ శబ్దాలు వెలువడేందుకు అవకాశం ఉందిన భూమి ఉపరితలం 70 కిలోమీటర్ల లోతులో ఉంటే శ్వాలోఫోకస్ ఎర్త్ క్వేక్స్‌గా పరిగణిస్తారు. సోమవారం ఢిల్లీ, బీహార్‌లలో వచ్చిన ప్రకంపనల్లో భూకంప కేంద్రాలు ఐదునుంచి పది కిలోమీటర్ల లోతులోనే ఉన్నాయి. ఢిల్లీ సీస్మిక్‌జోన్ నాలుగులో ఉంది. దేశాన్ని నాలుగు భూకంప జోన్లుగా వర్గీకరించారు. మండలం-2 అనేది 4.9కన్నా తక్కువ తీవ్రతఉండే ప్రాంతం. దేశ భూభాగంలో 40.93శాతంగా ఉంది. కర్ణాటక పీఠభూమి, ద్వీపకల్ప ప్రాంతాలు వీటిలో ఉన్నాయి. మూడో మండలం 5-5.9తీవ్రతతో ఉంటుంది. దేశ విస్తీర్ణంలో 30.79శాతం, పంజాబ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, బీహార్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలతోపాటు కేరళ, గోవా లక్షద్వీప్ దీవులు ఇందులో ఉన్నాయి.

ఇక మండలం -ఇలో అత్యధిక తీవ్రత కలిగిన భూకంపాలు ఉంటాయి. 6-6.9శాతంవరకూ ఉంటాయి. భారత్‌లో 17.49శాతం భూభాగం ఉంది. జమ్ముకాశ్మీర్, హిమాచల్, ఢిల్లీ, సిక్కిం, యూపిలోని ఉత్తర ప్రాంతాలు, బీహార్, బెంగాల్, మహారాష్ట్ర పశ్చిమతీరం, రాజస్థాన్‌లున్నాయి. మండలం-5లో ఏడుకంటే ఎక్కువ తీవ్రమైన భూకంపాలు సంభవిస్తాయి. 10.79 శాతం భూభాగంలో ఇలాంటివిచోటుచేసుకునే ప్రమాదం ఉంది. ఈపరిదిలో ఉత్తర బీహార్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్‌లోని రాన్ ఆఫ్ కచ్ అండమాన్ నికోబార్ దీవులున్నాయి.



# మహాకుంభ్‌లో అగ్నిప్రమాదం

**మహాకుంభ్‌నగర్, ఫిబ్రవరి 17:** మహాకుంభ్ మేళాలో సోమవారం మరోసారి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సెక్టార్8లో ఈప్రమాదం జరిగినట్లు అదికారులు వెల్లడించారు. వెంటనే ఆ ప్రాంతానికి అగ్నిమాపక సిబ్బందిని తరలించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఎలాంట ప్రాణహాని లేదని ప్రకటించారు. శ్రీ కపిమానస్ మండల్‌శిబిరంలోని రెండు షామియానాల్లో మంటలు చెలరేగాయి.

మరో ప్రమాదం కన్సూమర్ ప్రొటెక్షన్ కమిటీ శిబిరంలో చోటుచేసుకుంది. వెనువెంటనే అగ్నిమాపక సిబ్బంది ఆప్రాంతానికి వెళ్లి మంటలను అదుపుచేసారు. అంతకుముందు సెక్టార్ 19లో ఒకసారి కల్పసవాసీలు ఉన్న షామియానాల్లో ప్రమాదంజరిగింది. తక్షణమే అప్రమత్తం కావడంతోప్రాణహాని తప్పింది. ఈనెల ఏడవ తేదీ మరోసారి హరిహరానంద్ క్యాంప్‌లో ప్రమాదంజరిగింది. వెంటనే సిబ్బంది మంటలను ఆర్పివేసారు. మరో సందర్భంలో సెక్టార్ 18లో శంకరాచార్య మార్గ్‌లో కూడా మంటలు లేచాయి. ఈ అన్ని ప్రమాదాల్లోను ఎలాంటి ప్రాణహాని కానీ, గాయాలపాలయిన సందర్భాలు కూడా నమోదుకాలేదని తక్షణమే అదుపుచేసినట్లుయూపి అగ్నిమాపక అధికారులు వెల్లడించారు.

## కలర్‌కోడ్స్, కేంద్రీకృత వార్‌రూమ్‌లతో

# రైల్వేట్రాఫిక్ క్రమబద్ధీకరణ



## 26వరకూ కుంభమేళాకు ప్రత్యేక ఏర్పాట్లు

## దేశవ్యాప్తంగా రైల్వేశాఖ మార్గదర్శకాలు జారీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగినతొక్కిసలాట 18మంది మృతిచెంది డజన్ల కొద్దీ గాయపడిన సంఘటనను పురస్కరించుకుని రైల్వేశాఖ పటిష్టమైన పర్యవేక్షణ చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా రైల్వేలకు ఖచ్చితమైన మార్గదర్శకాలను జారీచేస్తున్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది. ఒకేసారి ప్లాట్‌ఫామ్‌పై మూడు రైళ్లు రావడం వాటిలో ఒకటి ప్రయాగరాజ్ స్పెషల్‌అనిరాసిఉండటం ప్రయాగరాజ్ ఎక్స్‌ప్రెస్ కోసం వచ్చినవారు అదే తమ రైలు అనుకుని తోసుకుని రావడంతో తొక్కిసలాట జరిగింది. దీనికితోడు రైల్వేశాఖ కూడా ఏకకాలంలో 1500 జనరల్ టికెట్లను విక్రయించింది. వీటివల్ల 13,14 ప్లాట్‌ఫారాల్లో అత్యంత రద్దీ ఏర్పడింది. ఈనెల 26వ తేదీ మహాకుంభ్‌మేళా చివరిరోజు కావడంతో ఇకరోజురోజుకూ భక్తులు మరింతగా వస్తారని త్రివేణి సంగమంలో పవిత్రస్నానం ఆచరించేందుకు వారంతా ఎక్కువ భక్తిభావాలతో వస్తున్నందున అందుకు తగిన ఏర్పాట్లుచేసేందుకు నిర్ణయించింది. కుంభ్ తరహా ట్రాజెడీ మరోసారి జరక్కుండా రైల్వేశాఖ కలర్‌కోడ్ ఎన్‌క్లోజర్లు, అధునాతన టెక్నాలజీని వినియోగిస్తోంది. అంతేకాకుండా సమస్యలు ఎదురయినపుడు రిస్క్‌మేనేజ్‌మెంట్ శిక్షణ కూడా అందిస్తోంది. ప్రయాణీకుల భద్రతకోసం దేశవ్యాప్తంగా ఉన్న రైల్వేస్టేషన్లతోపాటు ప్రధానంగా ఢిల్లీ రైల్వే స్టేషన్లలో వచ్చే ఆరునెలల్లో ఈ మార్పులు చేపట్టింది. ఇందుకోసం ప్రత్యేక జోన్లు కలర్ కోడ్స్ సెక్షన్లు, రద్దీ పర్యవేక్షణ వంటివి మొత్తం 60 స్టేషన్లలో అమలుచేస్తోంది.

ముందుగా మహాకుంభ్ రద్దీని క్రమబద్ధీకరించేందుకు అత్యవసరంగా వీటిని ఏర్పాటుచేసింది. ఈ 60 రైల్వేస్టేషన్లను హైట్రాఫిక్ రైల్వేస్టేషన్లుగా వర్గీకరించారు. ఈ 60 అత్యంత రద్దీస్టేషన్లలో 35 స్టేషన్లు నేరుగాప్రయాగరాజ్‌కే కనెక్ట్ అవుతున్నాయి. కేంద్రీకృత వార్‌రూమ్ ఏర్పాటుచేసి ముందు ఈ సమస్యాత్మక రైల్వేస్టేషన్లలో ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తారు. మొత్తం 35స్టేషన్లలో ఢిల్లీలో ఉన్న స్టేషన్లను ప్రత్యేకించి పర్యవేక్షించాలని నిర్ణయించారు. ఢిల్లీ రైల్వేస్టేషన్లలో 200 కొత్త సిసిటివి కేమేరాలను ఏర్పాటుచేసారు. శాంతిభద్రతల రూపేణా ఢిల్లీపోలీసులు ఆరుగురు ఇన్‌స్పెక్టర్ ర్యాంక్ అదికారులను నియమించారు. ఎన్డీఎల్‌ఎస్ హబ్‌లోనే వీరంతా ట్రాఫిక్ చూస్తారు. అలాగే రైల్వేపోలీస్‌ఫోర్స్ కూడా అధికంగా నియమించారు. అలాగే ముందు సాయంత్రం నాలుగు గంటలనుంచి ఏడుగంటలపాటు ప్లాట్‌ఫామ్ టికెట్ల విక్రయాలను నిలిపివేసారు. స్టేషన్‌లోకి ఇలా ప్లాట్‌ఫామ్ టికెట్‌తో వచ్చేవారిని అనుమతించడంలేదు. అయితే సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు ఈనిబంధన వర్తించదని నార్తరన్ రైల్వేస్ సిపిఆర్‌ఓ హిమాంశు శేఖర్ ఉపాధ్యాయ్ అన్నారు.

న్యూఢిల్లీ స్టేషన్‌లో తొక్కిసలాటజరిగే సమయంలో పాట్నాకువెళ్లే మగధ్‌ఎక్స్‌ప్రెస్ 14వ ప్లాట్‌ఫామ్‌లో ఉంటే న్యూఢిల్లీ జమ్ము ఉత్తర్ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ 15వ నంబరు ప్లాట్‌ఫామ్‌పై ఉందని చెప్పారు. 14,15 ప్లాట్‌ఫారాలకు ఫుట్‌బ్రిడ్జిపై వచ్చేవారు కొందరు జారిపడి ఇతరులపై పడ్డారని, అక్కడే తొక్కిసలాట ప్రారంభం అయిందన్నారు. ఇప్పటివరకూ ఏ ఒక్క రైలును కూడా రద్దుచేయలేదని, ప్లాట్‌ఫామ్‌ను కూడా మార్చడం జరగలేదని సిపిఆర్‌ఓ స్పష్టంచేసారు.

# రాంచి స్టేషన్‌లో తొక్కిసలాట

## స్పృహతప్పిపడిపోయిన ఐదుగురు మహిళలు

**రాంచి, ఫిబ్రవరి 17:** న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటసంఘటన మరువకముందే రాంచీ రైల్వేస్టేషన్‌లో కూడా ఆదివారం ఇలాంటి సంఘటనే చోటుచేసుకంది. రైల్వేస్టేషన్‌కు భారీ సంఖ్యలో యాత్రీకులు రావడంతో అత్యంత రద్దీ ఏర్పడింది. యుపి, ఢిల్లీకి వెళ్లే రైళ్లు ఎక్కేందుకు ప్రయాణీకులు తోపులాటలో ఎంతోమందికి గాయాలయ్యాయి. 12817 జార్ఖండ్ స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ రాంచి స్టేషన్‌కు రాగానే ఈ భారీ తొక్కిసలాటజరిగింది. అప్పటికే రైలు మొత్తం ప్యాసింజర్లతో కిక్కిరిసి పోయింది. టికెట్‌లేని ప్రయాణీకులుకూడా రైలులో ఉన్నారు. అంతేకాకుండా లోపలినుంచి తలుపులు కూడా మూసివేసారు. టికెట్లతో ఉన్న ప్రయాణీకులు తలుపులు తెరవాలని మొరపెట్టుకున్నా లోపలి ప్రయాణీకులు స్పందించలేదు. ఆర్పీఎఫ్ జవాన్లు బోగీల్లోకి ప్రవేశించేందుకు యత్నించి విఫలం అయ్యారు. కొందరు టికెట్లతో ఉన్న ప్రయాణీకులు కొన్ని బోగీల్లోకి ప్రవేశించగలిగారు. సుమారు 60 మందికిపైగా రైలును అందుకోలేకపోయారు. మొత్తం 18 మంది మహిళలు తొక్కిసలాటలో ఊపిరాడకపోవడంతో ఎక్స్‌ప్రెస్‌రైలును పట్టుకోలేకపోయారు. ఈ సంఘటనలో ఒత్తిడికి గురయి ఐదుగురు మహిళలు స్పృహతప్పిపడిపోయారు. వారిని ట్రాఫిక్ నుంచి తప్పించి సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్లారు. సీనియర్‌రైల్వే అధికారుల వివరాల ప్రకారం ఆర్పీఎఫ్ సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారని వాణిజ్యవిభాగాలకు కూడా రైళ్ల కెపాసిటీకి అనుగుణంగా మాత్రమే టికెట్లు జారీచేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఆదివారంసెలవు కావడంతో రాంచి రైల్వేస్టేషన్‌కు అనేకమంది ప్రయాణీకులు వచ్చారన్నారు. రాంచీ డిఆర్‌ఎం జస్మిత్‌సింగ్ బింద్రా మాట్లాడుతూ కుంభ్‌మేళా కారణంగానే భారీ రద్దీ ఏర్పడిందన్నారు. స్వర్ణజయంతి రైలుకు భారీ రద్దీ రావడంతో కొందరు ప్రయాణీకులు రైళ్లను అందుకోలేకపోయారు. వారి టికెట్‌సొమ్ము రిఫండ్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఆగ్నేయరైల్వే అదికారులకు కుంభ్ స్పెషల్‌ట్రైన్ నడిపేందుకు అనుమతులు తీసుకున్నామని, 19వ తేదీ కట్టుదిట్టంగా భద్రత ఏర్పాటుచేయాలని ఆర్పీఎఫ్ కమాండెంట్‌ను కోరామన్నారు. ప్రయాణీకులకు ఇబ్బందులు లేకుండాచూడాలని కూడా ఆదేశాలు జారీచేసామన్నారు. మరో వారం రోజులపాటు రాష్ట్రంలోని అన్ని రైల్వేస్టేషన్ల నుంచి ప్రయాణీకులు మహాకుంభ్‌మేళాకు వెళ్లే అవకాశం ఉన్నందున సమస్యలు ఉత్పన్నం కాకుండా ఇప్పటినుంచేచర్యలు తీసుకోవాలని కోరినట్లు డిజిపి తెలిపారు.



# 'మహా'కూటముల్లో బయటపడుతున్న లుకలుకలు!

**ముంబయి, ఫిబ్రవరి 17:** మహారాష్ట్రలో రాజకీయ పార్టీల్లో అంతర్గత అసమ్మతి రాజుకుంటున్నది. మహా పేరుతో ఉన్న కూటములన్నింటిలోను ఈ అనిశ్చితిపెరిగిపోతోంది. ఉపముఖ్యమంత్రి శివసేన అధినేత ఏక్‌నాథ్‌షిండేను ఎన్సీపీ ఎస్పీ అధినేత శరద్‌పవార్ ప్రశంసించడం, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌తో శివసేన ఉద్ధవ్‌వర్గం భేటీకావడంతో మహాయుతి, మహావికాస్ అఘాడి కూటముల్లో అసలు ఏంజరుగుతుందో తెలియనిపరిస్థితులు అలుముకున్నాయి. మూడు నెలల కిందటే అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి, మహావికాస్ అఘాడి కూటములు హోరాహోరీ పోటీకి దిగాయి. బిజెపి ఆధ్వర్యంలోని మహాయుతి ఘనవిజయం సాధించింది. సిఎం అభ్యర్థి పరంగా అధికార కూటమిలో ఓటమిపై ప్రతిపక్ష కూటమిలోనువిభేదాలు పొడసూపాయి. చివరికి అన్నీ సర్దుకున్నా మళ్లీ రాజకీయ ప్రత్యర్థులతో భేటీలు ఉత్కంఠను పెంచుతున్నాయి. గడచిన రెండున్నర నెలల్లో సిఎం ఫడ్నవిస్‌తో ఉద్ధవ్ శసేన నేతలు మూడుసార్లు సమావేశం అయ్యారు. ఆపార్టీ కీలకనేత ఆదిత్యఠాక్రే రెండుసార్లుభేటీ అయ్యారు. శివసేనలో చీలికకు ఫడ్నవిస్ కారణమని గతంలో తీవ్రంగా ఆరోపించిన ఉద్ధవ్ వర్గనేతలు ఇలా భేటీకావడం ఆశ్చర్యం కలిగించింది. మహారాష్ట్ర నవనిర్మాణ్‌సేన అధ్యక్షుడు రాజ్‌ఠాక్రేతోకూడా ఫడ్నవిస్ భేటీ అయ్యారు. రెండుపార్టీలతో అవగాహన ఉంటుందని జోరుగా చర్చలుజరిగాయి. రెండుకూటముల్లోని పార్టీలుప్రత్యర్థి పార్టీలతో అంటకాగుతున్నాయని విశ్లేషకులు చెపుతున్నారు.

స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఈభేటీలు ఇపుడు కీలకం అయ్యాయి. వేరే మార్గాలున్నాయని భాగస్వాములకు హెచ్చరికలు పంపడానికే ఈ సమావేశాలు జరుగుతున్నాయన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక తాజాగా ఇన్‌ఛార్జిమంత్రుల నియామకంతో అధికార కూటమిలో విభేదాలు పెరిగాయి. బిజెపి గిరీశ్‌మహాజన్‌ను నాసిక్‌కు, ఎన్సీపీకి చెందిన అదితి తత్కారేను రాయ్‌గఢ్‌కు ఇన్‌ఛార్జిలుగా నియమించడంతో శివసేన అగ్రహంతో ఉంది. తమ మంత్రులు దాదాజీ భూసే, భరత్ గొడావలేలను జాబితాలోకి చేర్చకపోవడంపై పార్టీ ఆగ్రహంతో ఉంది.

# బెంగాల్ బడ్జెట్ సమావేశాల్లో బిజెపి ఎమ్మెల్యేల సస్పెన్షన్

**కోల్‌కత్తా, ఫిబ్రవరి 17:** బెంగాల్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో బిజెపి సభ్యులు అనుచితంగా ప్రవర్తించారన్న ఆరోపణలపై స్పీకర్ సమావేశాలు పూర్తయ్యేంతవరకూ ముగ్గురు బిజెపి ఎమ్మెల్యేలను సస్పెండ్‌చేసారు. వీరిలో బిజెపి సభాపక్షనేత సువేందు అధికారి మరో ముగ్గురు బిజెపి ఎమ్మెల్యేలు సభా కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగించారని చెపుతూ సభలో తీర్మానంప్రవేశపెట్టడంతో వారిని బడ్జెట్ సమావేశాలు ముగిసేంతవరకూ వారిని సస్పెండ్ చేస్తున్నట్లుప్రకటించారు ఈమేరకు స్పీకర్ బిమన్ బెనర్జీ అగ్నిమిత్రపాల్, బంకింగ్‌ఘోష్, బిశ్వనాథ్‌కారక్‌లతోపాటు బిజెపి నేత సువేందు అదికారిని కూడా సస్పెండ్‌చేసారు. వీరు సభజరుగుతున్న సమయంలో వెల్‌లోకి దూసుకువచ్చి సభా బిజినెస్ పత్రాలను చించివేసి సభలో ఎగురవేసినట్లు స్పీకర్ పేర్కొన్నారు. పాల్‌ప్రతిపాదించిన వాయిదా తీర్మానంపై చర్చకు స్పీకర్ తిరస్కరించడంతో ఈ చర్యలు తీసుకున్నారు. ఈనెలలో సరస్వతిపూజ నిర్వహణ సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో టిఎంసి కేడర్ బిజెపి నేతలు కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసారని వీటిపై చర్చించాలని పట్టుబట్టారు. చర్చకు అనుమతించని స్పీకర్ ఒక బిజెపి ఎమ్మెల్యే ఈ తీర్మానంచదవడానికి అనుమతించారు. పాల్ తీర్మానం చదివిన వెంటనే బిజెపి ఎమ్మెల్యేలు నిరసన ప్రారంభించారు. టిఎంసి చీఫ్ విప్ నిర్మల్‌ఘోష్ ఇందుకు సంబంధించి బిజెపి ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని ప్రతిపాదన తెచ్చారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని తీర్మానంప్రవేశపెట్టడంతో బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యేంతవరకూ వారిని సస్పెండ్‌చేస్తున్నట్లు తెలిపారు.

# తైవాన్ విషయంలో చైనాకు అమెరికా షాక్!



**బీజింగ్, ఫిబ్రవరి 17:** తైవాన్‌కు సంబంధించిన వైఖరిపై అమెరికా తీసుకొన్న ఓ నిర్ణయం చైనాకు తీవ్ర ఆగ్రహం కలిగించింది. దీంతో బీజింగ్ విదేశాంగ శాఖ అగ్రరాజ్యంపై మండిపడింది. 'తైవాన్ స్వాతంత్ర్యానికి మేము మద్దతు ఇవ్వం' అని అమెరికా విదేశాంగ శాఖ వెబ్‌సైట్‌లో ఉన్న స్టేట్‌మెంట్‌ను తాజాగా తొలగించారు. ఈవిషయం డ్రాగన్ ఆగ్రహానికి కారణమైంది. దీనిపై తాజాగా చైనా విదేశాంగ శాఖ స్పందిస్తూ.. 'ఇది తైవాన్ వేర్పాటు వాదానికి మద్దతిచ్చే వారికి తప్పుడు సంకేతాలు పంపుతుంది. దీనిని సరిచేసుకోవాలి' అని చైనా విదేశాంగ శాఖ పేర్కొంది.

అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్‌లోని తైవాన్- అమెరికా సంబంధాల ఫ్యాక్ట్‌షీట్‌లో గతంలో 'మేము తైవాన్ స్వాతంత్ర్యాన్ని సమర్థించము' అని ఉండేది. ఈ వాక్యాన్ని గత వారం తొలగించారు. రొటీన్ అప్‌డేట్‌గా దీనిని అమెరికా అభివర్ణించింది. తాము వన్ చైనా పాలసీకి కట్టుబడి ఉన్నామని అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి వెల్లడించారు. మరోవైపు తైవాన్ దిశగా చైనా భారీ స్థాయిలో యుద్ధనౌకలు, విమానాలను పంపింది. మొత్తం 41 విమానాలు, 9 నౌకలను పంపింది. ఈ విషయాన్ని తైవాన్ రక్షణ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. మరోవైపు కెనడాకు చెందిన ఓ యుద్ధ నౌక తైవాన్ జలసంధి నుంచి ప్రయాణించడం బీజింగ్‌కు ఆగ్రహం తెప్పించింది. హెచ్‌ఎంసిఎస్ ఒట్టావా శనివారం దక్షిణంనుంచి ఉత్తరప్రాంతానికి ప్రయాణించింది.

# శాంతి చర్చల కోసం పశ్చిమాసియాకు జెలెన్‌స్కీ



## త్వరలో రష్యా అధినేతతో భేటీ: ట్రంప్

**కీవ్, ఫిబ్రవరి 17:** ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధాన్ని ముగించడం కోసం ట్రంప్ చేస్తున్న యత్నాలు జోరందుకొన్నాయి. సౌదీ అరేబియాలో శాంతి చర్చలు జరగనున్నట్లు ఆయన ప్రకటించారు. తాజాగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పశ్చిమాసియా పర్యటనలో భాగంగా ఆదివారం అర్థరాత్రి అధికారిక పర్యటన నిమిత్తం యుఎఇ చేరుకొన్నారు. భారీ మానవీయ సహాయ కార్యక్రమం నిమిత్తం తాను ఇక్కడికి వచ్చినట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు కొన్ని రోజుల్లో అమెరికా-రష్యా మధ్య సౌదీ అరేబియాలో ఉక్రెయిన్‌పై శాంతి చర్చలు జరగనున్నాయి. ఇందుకోసం అమెరిక విదేశాంగ మంత్రి మార్కో రూబియో, పశ్చిమాసియా ప్రతినిధి స్టీవ్ విట్‌కోఫ్, జాతీయ భద్రతా సలహాదారు మైక్ వాల్జ్ కూడా సౌదీకి ప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా రియాద్‌లోని కొందరు అధికారులు మాట్లాడుతూ ఈ చర్చలకు వేదిక కావడంతో పాటు.. మధ్యవర్తిత్వంలోను తమ దేశం కీలక పాత్ర పోషించనుందన్నారు.

ఇక ఉక్రెయిన్ లేకుండానే ఈ చర్చలు చేపడుతున్నారంటూ అమెరికా మిత్రదేశాల నుంచి అసంతృప్తులపై ట్రంప్ స్పందించారు. యుద్ధాన్ని ముగించే ఏ చర్చల్లోనైనా జెలెన్‌స్కీ భాగస్వామి అవుతారని ట్రంప్ వివరణ ఇచ్చారు. అంతే కాదు.. చాలా తొందరలో రష్యా అధినేతతో తాను భేటీకానున్నట్లు చెప్పారు. ఆయన ఫ్లోరెడాలోని డెటోనా రేసులో పాల్గొన్న సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. 'కచ్చితమైన సమయం అనుకోలేదు.. కానీ, తొందర్లోనే జరుగుతుంది' అని విలేకర్లతో పేర్కొన్నారు.

మరోవైపు అమెరికా-రష్యా చర్చలకు దూరంగా జరిగిన బ్రిటన్ మాత్రం భిన్నమైన ప్రకటన చేసింది. ఆ దేశ ప్రధాని స్టార్మర్ మాట్లాడుతూ అవసరమైతే ఉక్రెయిన్‌లో తమ సేనలు బరిలోకి దిగుతాయని అన్నారు. ఐరోపా దేశాల అత్యవసర సమావేశానికి ముందు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఇది ఉక్రెయిన్ భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్న మాత్రమే కాదు.. ఐరోపా ఉనికికి కీలకమైంది. సుదీర్ఘకాలం పాటు ఉక్రెయిన్‌లో శాంతి, సురక్షితనుకాపాడటం చాలా ముఖ్యం' అని పేర్కొన్నారు.

మూడేళ్లుగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే శాంతి చర్చల దిశగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రంగంలోకి దిగడం ఐరోపా దేశాల్లో కలవరం రేకెత్తిస్తోంది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఇప్పటికే ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్‌కు అమెరికా సాయం నిలిచిపోవడం వల్ల తలెత్తే పరిణామాలపై ఇప్పుడు ఇయు దేశాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. యుద్ధ విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత తమ భద్రతకు ముప్పు తలెత్తవచ్చన్న ఆందోళన ఐరోపా దేశాల్లో ఉంది. రష్యా కన్ను తమపై పడే అవకాశం ఉందని అవి భావిస్తున్నాయి. చర్చలపై ట్రంప్ దృష్టిసారించగా ఇయు దేశాలు సోమవారం పారిస్‌లో అత్యవసరంగా సమావేశం కాబోతున్నాయి.

# యుఎస్‌లో కట్ట తెగిన కెంటకీ

## మెరుపు వరదలకు 8 మంది జలసమాధి

**వాష్టింగ్టన్, ఫిబ్రవరి 17:** అమెరికాలోని కెంటకీలో వచ్చిన మెరుపు వరదల్లో మృతుల సంఖ్య పెరిగి 8కి చేరింది. అక్కడి ఒబియాన్ నదికి సంరక్షణగా నిర్మించిన కట్ట తెగిపోవడంతో ఒక్కసారిగా సమీప ప్రాంతాలు జలమయం అయ్యాయని ఒబియాన్ కౌంటీ మేయర్ వెల్లడించారు. ఆ ప్రాంతంలో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. దీంతోపాటు ఆ ప్రాంతంలో విపత్తు సంభవించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీంతోపాటు ఫెడరల్ సహాయాన్ని కూడా ఆయన కేటాయించారు. ఆదివారం వచ్చిన వరద నుంచి వందల మందిని రక్షించినట్లు రాష్ట్ర గవర్నర్ ఆండీ బెషీర్ వెల్లడించారు. ఈ సంఖ్య 1,000 వరకు ఉంటుందన్నారు. ఈ ప్రాంతంలో చాలాచోట్ల రోడ్లు మునిగిపోయాయి. కెంటకీలోని రివర్ మెడికల్ సెంటర్ ప్రాంతానికి కూడా వరద నీరు చొచ్చుకురావడంతో చాలామంది పేషెంట్లను ఇతర ప్రాంతాలు తరలించారు. 39,000 ఇళ్లల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బలమైన గాలులు వీస్తుండటంతో మరిన్ని ప్రాంతాల్లో కరెంటు నిలిచిపోవచ్చని భావిస్తున్నారు.

ఇక అమెరికా ఉత్తర ప్రాంతంలో ప్రాణాలు తోడేసేంత చలి ఉంది. జార్జియా, ఫ్లోరిడాలకు టోర్నడో హెచ్చరికలు జారీ అయ్యాయి. అట్లాంటాలో చెట్టు విరిగి ఇంటిపై పడటంతో ఒక వ్యక్తి మరణించారు. ఆర్కిటెక్ నుంచి వీస్తున్న చలిగాలుల కారణంగా నార్త్, సౌత్ డకోటా, మిన్నెసోటలోని కొన్నిచోట్ల -45.6 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు ఉష్ణోగ్రత పడిపోయింది.



టెన్నిస్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎంఎల్ఏ బొజ్జల సుధీర్ రెడ్డి

# సీనియర్ సిటిజన్స్‌కు గుర్తింపు

## తండ్రి పేరుతో జాతీయస్థాయి టెన్నిస్ పోటీలు: ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** తన తండ్రి, మాజీ మంత్రి శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి పేరుతో వచ్చే ఏడాది సీనియర్ సిటిజన్స్ జాతీయస్థాయి టెన్నిస్ పోటీలు నిర్వహణకు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి తెలిపారు. సోమవారం విక్రమ్ టెన్నిస్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లకు తగిన ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి అంటే రిపబ్లిక్ సారధ్యంలో సుమారు 35 సంవత్సరాల పాటు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో టెన్నిస్ టోర్నమెంటు నిర్వహించిన ఘనత ఉందన్నారు. శ్రీకాళహస్తిలో టెన్నిస్ క్రీడ అంతరించకుండా విక్రమ్ క్రీడా సంఘం కృషి చేయటం వారి లోని ప్రతిభకు గుర్తింపు అన్నారు. నిర్వాహకులు డాక్టర్ చంద్రశేఖర్ స్వతహాగా టెన్నిస్ క్రీడాకారులు కావటంతో నిర్వహించడమే కాకుండా యువతకు ప్రోత్సాహంగా నిలిచారన్నారు. ఇక్కడ టెన్నిస్ నిర్వహణ, శిక్షకు ఏర్పాట్లు చేయటం టెన్నిస్ ఆకాములు నిర్వహించటం అభినందనీయం అని ఎంఎల్ఏ అన్నారు. సీనియర్ సిటిజన్స్ సమాజానికి మార్గ దర్శకులన్నారు. వారి అనుభవాలు భావితరాలకు అందించాలన్నారు. తల్లి దండ్రులు ఎప్పుడూ బిడ్డలకు భారం కాదని ప్రస్తుత పరిస్థితుల మూలంగా తరంతరం మధ్య అంతరం ఏర్పడుతుందన్నారు. తనకు సీనియర్ సిటిజన్లు అంటేనే గౌరవం అన్నారు. రాబోయే సంవత్సరం నుంచి తానే నిర్వాహకుడుగా ఉంటానన్నారు. తన తండ్రి పేర పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశానికి డాక్టర్ చంద్రశేఖర్ అధ్యక్షత కార్యక్రమాలు నిర్వహించారు.

ఐటా ప్రతినిధి మోహన్ మాట్లాడుతూ రాష్ట్రంతో పాటు కర్నా టకలోనూ సీనియర్ సిటిజన్స్ టెన్నిస్ టోర్న మెంట్లు వివిధ సంస్థల సహకారంతో నిర్వహిస్తున్నట్లు వివరించారు. సీనియర్ సిటిజన్స్ సంపూర్ణ ఆరోగ్యం ఉంటే సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ చంద్రశేఖర్, మునిలక్ష్మీ, రామచంద్ర, మోహన్, శ్రీకాళహస్తి మార్కెటింగ్ కమిటి మాజీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు తదితరులు హాజరయ్యారు. శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి కొంత సేపు సీనియర్ సిటిజన్లతో టెన్నిస్ ఆడారు.



సోమవారం విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపి లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

# సెంట్రల్ వర్సిటీని ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపి,ఎమ్మెల్యే

## ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు బాధాకరం

## వైస్ ఛాన్సలర్ ఎస్.ఏ.కోరిపై తగు చర్యలు తీసుకుంటాం

**బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** సెంట్రల్ యూనివర్సిటీలో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు బాధాకరం వాటికి సంబందించిన వైస్ ఛాన్సలర్ ఎస్.ఏ.కోరి తోపాటు సంబందిత అదికారుల పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అనంతపురం ఎంపి అంబికా లక్ష్మినారాయణ, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ అన్నారు. సోమవారం బుక్కరాయసముద్రం మండల పరిదిలోని జంతులూరు గ్రామ సమీపంలో ఉన్న సెంట్రల్ యూనివర్సిటీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూనివర్సిటీలో గత కొన్ని రోజులుగా విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా యూనివర్సిటీ యాజమాన్యం నిర్లక్ష్యం గురించి విద్యార్థులు ధర్నా చేస్తున్న విషయం తెలుసుకొని ఇక్కడికి రావడం జరిగిందన్నారు. యాజమాన్యం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైయింది కాదన్నారు. నిన్న జరిగిన సంఘటన మెదటిసారి కాదని ఇదే సంఘటన 2024 డిశంబర్ 8వతేది జరిగిందని, ఈ విషయం మీద అప్పుడు ఆంధ్రప్రదేశ్ గవర్నర్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ కి లేఖ రాశమన్నారు.

ప్రభుత్వం ద్వారా ఈ సమ స్యను మరొసారి సంబందిత కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి వీసి నిర్లక్ష్యం మీద గతంలో జరిగిన సంఘటనల పట్ల తగు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం విద్యార్థుల భద్రతా దృష్ట్యా సంబందిత పోలీసుల అదికారులతో మాట్లడి భద్రత విషయంలో తగిన సూచనలు చేయడం జరిగింది.

24 గంటలు సీసీటీవీ ద్వారా నిఘా ఉంచాలని, అలాగే విద్యార్థులకు భోజన విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని లేని పక్షంలో కాంట్రాక్టర్‌ను మార్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. యూని వర్సిటీలో నిరంతరం విద్యుత్ సదుపాయం ఉండేలా సంబందిత శాఖలను ఆదేశించడమైనది.



# అనుమతి ఉన్న లే అవుట్లనే కొనుగోలు చేయాలి

## టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులతో మంత్రి నారాయణ సమీక్ష

**నెల్లూరు కార్పొరేషన్,ఫిబ్రవరి 17,ప్రభాతవార్త:** అనుమతి ఉన్న లేఅవుట్ల వివరాలను సంబంధిత వెబ్సైట్లో పొందుపరుస్తామని వాటినే కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పిలుపునిచ్చారు. సోమవారం నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ విభాగంలో నిబంధనలను ప్రజలకు అనుకూలమైన విధంగా సడలించామని వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. గతంలో మాదిరి నిబంధనలను అతిక్రమించి లేఅవుట్లు ఇళ్ల నిర్మాణం చేపడితే చర్యలు తప్పనిసరన్నారు. ఇప్పటికే నిబంధనలను పాటించకుండా వేసినటువంటి వెంచర్ల విషయంలో రాబోయే రెండు నెలల్లో ప్రజలకు లేఔట్ నిర్మాణదారులకు ఇరువైపులా నష్టపోకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా అప్రూవల్ కోసం 2016 నుండి పెండింగ్ లో ఉన్న కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించి అప్రూవల్ లెటరు స్వయంగా సంబంధిత దరఖాస్తుదారునికి మంత్రి అందజేశారు. అదేవిధంగా సడలించిన నిబంధనల గురించి ప్రజలకు మరింత అవగాహన పెంపొందించేందుకు లైసెన్స్డ్ సర్వేయర్లకు త్వరలో వర్క్ షాపులు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా స్థానిక సంస్థల ద్వారా ప్రజలు చెల్లించే వివిధ రకాల పన్నుల ఆదాయాన్ని స్థానికంగానే ఖర్చు చేసుకునే విధంగా చర్యలు చేపడతామన్నారు.

ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత మున్సిపల్ కమిషనర్ సూర్య తేజ నుడా చైర్మన్ శ్రీనివాసుల రెడ్డి డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ నాయ కులు గిరిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రియల్ ఎస్టేట్‌తో రోడ్డునపడ్డ టిడిపి, బిజెపి నేతలు

మాజీమంత్రి పల్లె, మంత్రి సత్యకుమార్ అనుచరుని మధ్య భూ వివాదం

పోలీస్ స్టేషన్లో కేసులు

మంత్రి అనుచరుడు దౌర్జన్యం అంటూ ఫిర్యాదులు

తను తప్పు ఏం లేదంటున్న మంత్రి అనుచరుడు





**అనంతపురం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త బ్యూరో:** శ్రీ సత్యసాయి జిల్లా పెనుగొండ ప్రాంతంలో ప్రముఖ కియా కార్ల ఫ్యాక్టరీ సమీపంలో కోట్లాది రూపాయల భూముల కొనుగోలు అమ్మకాల విషయాల్లో లోలోపల ఉన్న ఆస్తి తగాదాలు ఒక్కసారిగా బగ్గుమన్నాయి. టిడిపి నేత, మాజీ మంత్రి పల్లె రఘు నాథ్ రెడ్డి, బిజెపికి చెందిన రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్ అనుచరుడు ఆదినారాయణ యాదవ్ మధ్య అంతర్గతంగా ఉన్న రియల్ ఎస్టేట్ గొడవలు బహిర్గతమయ్యాయి. పోలీస్ స్టేష న్లో కేసులు వరకు వెళ్లడం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. మంత్రి సత్య కుమార్ యాదవ్ అనుచరుడు ఆదినారాయణ యాదవ్ దౌర్జన్యంగా స్థలాల ప్రహరీ గోడలను ఆదివారం కూల్చి వేయడం, పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేయ డం చర్చనీయాంశంగా మారింది. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన రాత్రి పొద్దుపోయే వరకు వేచి చూచిన పెనుగొండ పాత్రికేయులకు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది దౌర్జన్యం చేశారని చెబుతున్నారు గాని దౌర్జన్యం చేసినట్లు ఎవరు ఫిర్యాదు చేశారు? ఫిర్యాదు చేసిన వాళ్ళు రైతులా? రాజకీయ నాయకుల అన్నది సస్పెన్స్‌గా పోలీస్ అధికారులు ఉంచారు. ఇది సివిల్ పం చాయతీ అంటూ అధికారులు సమస్యను గుట్టు గా ఉంచారు. రెండు వర్గాలు వారు కూటమి ప్రభుత్వంలో భాగస్వాములు ఉండడంతో ఆ ప్రాంత పోలీస్ అధికారులు కఠినంగా చర్యలు తీసుకోలేక ఇక్కట్ల గురవుతున్నారు. వివరాల్లోకెళ్తే పెనుగొండ ప్రాంతంలో కియా కార్ల పరిశ్రమ ఏర్పాటు చేసే సమయంలో రియల్ ఎస్టేట్ బాగా జరిగింది. లక్షల్లో ఉన్న భూములు కోట్లకు వచ్చాయి. . ముఖ్యంగా కియా పరిశ్రమ, దాని అనుబంధ పరిశ్రమలు వచ్చిన పెనుగొండ ప్రాంతంలో రోడ్డు వైపునే కాకుండా లోపల ప్రాంతంలో కూడా భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఆ సమయంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి కలిసి పెనుగొండ ప్రాంతంలో కియా పరిశ్రమ రాకముందే భారీగా భూములు కొన్నారని, తద్వారా ఆ భూములకు ఎక్కువ ధర పలికిందని చర్చ జరిగేది. అయితే ఎవరు ఎంత భూమి కొన్నారు? ఎవరు పేర్లతో కొన్నారు? అందులో ఎంత అమ్మారు? ఇంకా ఎంత ఉన్నది అన్నది వారికే తెలియాలి. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి పెనుగొండ ప్రాంతంలో భూములు కొన్నప్పుడు కొంత భూమిని బిజెపి నేత, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ పేరుమీద పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆదినారాయణ యాదవ్ పై నమ్మకంతో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పెట్టుబడులు పెట్టినట్లు, ఆ మేరకు డాక్యుమెంట్లు కూడా అధికారికంగా ఆదినారాయణ యాదవ్ పేరు మీద ఉన్నట్లు తెలియ వచ్చింది. గతంలో వైసీపీలో ఉన్న ఆదినారాయణ యాదవ్ ప్రస్తుతం బిజెపిలో ఉన్నారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ సమక్షంలో ఆదినారాయణ యాదవ్ బిజెపిలో చేరి ముదిగుబ్బలో చక్రం తిప్పుతున్నారు. ఈ నేపథ్యంలో పెనుగొండ ప్రాంతంలోని కియా ఫ్యాక్టరీ వద్ద భూములు కొనుగోలు, అమ్మకాల విషయంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, బిజెపి నేత ఆదినారాయణ యాదవ్ మధ్య రియల్ ఎస్టేట్ గొడవలు తాజాగా బహిర్గతమయ్యాయి.. ఈ వివాదంలో తన వాదనను బిజెపి నేత, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ సోమవారం అనంతపురంలో విలేకరులకు వివరించారు. దీనిపై మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి,, బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి కూడా స్పందించి వివరణలు ఇస్తే ఈ వివాదానికి కారణాలు ఏమి అన్నది తెలిసే అవకాశం ఉంది. పెనుగొండలో మంత్రి సత్యకుమార్ అనుచరులు వీరంగం చేసి భూమి ప్రహరీని ధ్వంసం చేశారని, భూమి యజమాని ప్రభాకర్ రెడ్డి పై కర్రలు, కర్రలతో దాడి చేసి, బెదిరింపులకు పాల్పడ్డారని అని బాధితులు కియా పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోక్లెయిన్, కారును సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీస్ అధికారులు అధికారికంగా తెలిపిన విషయం తెలిసిందే.

**బిజెపి నేత ఆదినారాయణ యాదవ్ వివరణ:** మంత్రి సత్య కుమార్ అనుచరుడు భూ ఆక్రమణలు అంటూ వచ్చిన వార్తలపై ముదిగుబ్బ ఎంపీపీ, బిజెపి నేత ఆదినారాయణ యాదవ్ స్పందించారు. కియా పరిశ్రమ వద్ద జరుగుతున్న భూమి వివాదం మీద ఆయన సోమవారం అనంతపురంలో జరిగిన విలేకరుల సమావేశంలో క్లారిటీ ఇచ్చారు. గతంలో తాను మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి 250 ఎకరాల భూములు కొనుగోలు చేశామని, ఆ తర్వాత ఎవరి భూమి వారు వాటా ప్రకారం తీసుకున్నామన్నారు. కానీ పల్లె రఘునాథ్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి వారి భూముల్ని అమ్మిన తర్వాత ప్రభాకర్ రెడ్డి సీన్లోకి వచ్చారని, ఆయన నా భూమిని కాజేసే ప్రయత్నం చేస్తున్నారని.. దీనికి పల్లె రఘునాథ్ రెడ్డి సపోర్ట్ చేస్తున్నారన్నారు. ఈ భూమి వివాదం ఏడేళ్లుగా సాగుతోందన్నారు. కానీ మంత్రి సత్య కుమార్ వచ్చి 9 నెలలు మాత్రమే గడుస్తోందన్నారు. దీనిపై పల్లె రఘునాథ్ రెడ్డి అందర్నీ మంత్రి వద్దకు తీసుకెళ్లారని.. అయితే ఇది పార్టనర్స్ మధ్య సమస్య అని.. మీరే పరిష్కరించుకోవాలని సత్యకుమార్ సూచించినట్టు చెప్పారు. ఈ భూమి వాదంలోకి మంత్రిని ఎందుకు లాగుతున్నారో అర్థం కావడం లేదన్నారు. నిన్నటి రోజు జరిగిన సంఘటనలో కూడా అక్కడ ఎవరు పేదలు లేరని.. నా భూమిని అక్రమించి పనులు చేస్తున్నారని.. అడ్డుకుంటే వారే వచ్చి దాడులు చేశారని.. ఆ తర్వాత మా వాహనాల్లో రాడ్లు ఇతర ఆయుధాలు వేశారన్నారు. ఒక సినిమా సీన్ ని క్రియేట్ చేశారని ఆయన వాపోయారు.

పైగా తామే డైల్ 100 కి కాల్ చేసి రక్షణ కల్పించాలని కోరామని.. అయితే పోలీసులు మరోరకంగా దీన్ని తప్పుదారి పట్టించారన్నారు. గతంలో కూడా ప్రభాకర్ రెడ్డి పదకొండున్నర కోట్లకు సంబంధించి వివాదం నెలకొందని.. దీనిపై కోర్టులో కూడా కేసు ఉందన్నారు. అక్కడ వేసిన రోడ్డును కూడా తవ్వించారని ఆయన చెప్పిన్న దౌర్జన్యాలు అన్నీ కావన్నారు. అప్పట్లో అధికారం అడ్డం పెట్టుకొని నాపై చాలా ఒత్తిడి చేశారని చంపాలని కూడా చూశారన్నారు. కానీ తాను ఏ తప్పు చేయలేదు కాబట్టి కోర్టుకు వెళ్లి దీని నుంచి బయటపడ్డానన్నారు. ఒక ఫేక్ అగ్రిమెంట్ కూడా క్రియేట్ చేశారన్నారు. గతంలో ఎస్పీ సత్య ఏసుబాబు ఉన్న సమయంలోనే ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశారని గుర్తు చేశారు. ఈ నా భార్య పేరు మీద ఉందని.. ఇందుకు పక్కా డాక్యుమెంట్లు కూడా ఉన్నాయని ఆదినారాయణ యాదవ్ వివరించారు.

దీనిపై మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, భూయజమాని ప్రభాకర్ రెడ్డి ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.

# షేర్ ట్రేడింగ్ మనీస్కామ్ ముద్దాయిలు ఇద్దరు అరెస్ట్

## ముద్దాయిల నుంచి 12కోట్ల రూపాయల రికవరీ: కావలి డీఎస్పీ పి.శ్రీధర్



**కావలి, ఫిబ్రవరి17 ప్రభాతవార్త:** షేర్‌ట్రేడింగ్ పేరుతో చీటింగ్‌చేస్తూ పలు ప్రాంతాల్లో తప్పించుకుని తిరుగుతూ కావలిలో తిష్టవేసిన మనీస్కామ్ మోసగాళ్ల షేక్.మహబూబ్ సుభానీ, ఎలసిరి బ్రహ్మానందంలను అరెస్ట్‌చేసినట్లు కావలి డీఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. వారివద్దనుంచి దాదాపు 12కోట్లరూపాయల మేరకు ఆస్తులు, నగదును రికవరిచేసినట్లు ఆయన తెలిపారు. కావలి డీఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వీరికి సంబంధించి బ్యాంకుల్లో 5కోట్ల 35లక్షల 92వేల 126రూపాయలు సీజ్ చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా 5కోట్ల 74లక్షల 51వేలు ఆస్తులను సీజ్‌చేసినట్లు తెలిపారు. 28లక్షల 48వేల 600ల రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సామ్‌సంగ్ కంపెనీకి చెందిన 2ఫోన్లు, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. షేర్‌ట్రేడింగ్ ముసుగులో డబ్బులు షేర్‌మార్కెట్‌లో ఇన్వెస్ట్‌చేస్తే తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని, ఆన్‌లైన్ షేర్‌ట్రేడింగ్ ముసుగులో ప్రజలను మభ్యపెట్టి పెద్దఎత్తున డబ్బులు వసూలుచేశారని తెలిపారు. కాకినాడ, మఖ్తల్, తదితర ప్రాంతాలలో కోట్లల్లో వసూలుచేసి ప్రజలకు కుచ్చుటోపిపెట్టి పరారయ్యాడన్నారు. ఈ నేపథ్యంలో 2021 నవంబర్‌లో కావలి ముసునూరు మర్రిచెట్టు గిరిజనసంఘం కాలనీలో ఇల్లు తీసుకుని అనంతార్ధ అసోసియేట్స్ అనే పేరుతో షేర్‌మార్కెట్ ముసుగులో పెద్దనెట్‌వర్క్‌నే ఏర్పాటుచేశాడన్నారు. రోజువారి, వారం, పదిహేనురోజులు, నెలవారి, మూడు నుంచి పన్నెండు నెలల కాలపరిమితిగా కొన్నిస్కీమ్‌లు ప్రజలకు పరిచయం చేశారన్నారు. కాకినాడ, మఖ్తల్ ప్రాంతాలలో చేసిన విధంగానే ప్రజలనుంచి దాదాపు వందలాదికోట్లు డబ్బులు వసూలుచేసి ప్రజలసొమ్ముతో, తన కుటుంబ సభ్యు లపేరుతో తన ఏజెన్సీ సభ్యులపేరుతో ఆస్తులు కొనుగోలు చేశారన్నారు. భారీస్థాయిలో కోట్లు గడించి ఇక్కడినుంచి ఉడాయించేందుకు పక్కాప్లాన్ వేశాడన్నారు. ఈలోగా ఫిర్యదులను పురస్కరించుకుని అరెస్ట్‌చేయడం జరిగిందన్నారు. కాకినాడ, మఖ్తల్ ప్రాంతాల్లో షేక్.మహబూబ్ సుభానిపై చీటింగ్‌కేసులు నమోదు అయ్యాయన్నారు. కావలిలో షేర్‌ట్రేడింగ్ ముసుగులో మోసపోయిన వారంతా ముందుకువచ్చి పోలీసులకు ఫిర్యాదుచేస్తే ఎన్నివందల కోట్లల్లో మోసం చేశారో అన్న వివరాలు తెలుస్తాయన్నారు.


**షేక్.మహబూబ్ సుభాని భాగోతం:** బాపట్లజిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరి గ్రామానికి చెందిన వ్యక్తి షేక్.మహబూబ్ సుభాని అని డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. విజయవాడలోని సిద్దార్ధ అకాడమీలో ఎంసిఎ పూర్తిచేశారన్నారు. కొంత కాలం కంప్యూటర్ అధ్యాపకుడుగా నర్సారావుపేటలో పనిచేశా డన్నారు. దాని తర్వాత నెట్‌వర్కెట్ మార్కెటింగ్ రంగంలోకివచ్చి షేర్‌మార్కెట్ ట్రేడింగ్‌మీద బాగా అవగాహన పెంపొందించుకున్నాడన్నారు. గుంటూరు, విజయవాడలో మొదటగా కొంతకాలం పనిచేసి అక్కడినుండి కుటుంబంతో కలిసి బీదర్‌కు వెళ్లాడన్నారు. అక్కడినుండి పూనేలో కొంతకాలం స్థిరపడ్డాడన్నారు. ఆ తర్వాత తన కుటుంబంతో కాకినాడకువెళ్లి అక్కడ ప్రజలతో తాను షేర్‌మార్కెట్‌రంగంలో అనుభవం సంపాదించుకున్నాడని చెప్పాడన్నారు. డబ్బులు షేర్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని మభ్యపెట్టి వందలాదికోట్లు దోచుకుని కాకినాడనుంచి పరారైపోయాడన్నారు. కొంతకాలానికి సుభాని తెలంగాణ రాష్ట్రం మఖ్తల్ అనే ప్రాంతానికి వెళ్లి అక్కడ చెప్పులవ్యాపారం, ఫర్టిలైజర్స్ వ్యాపారం, బంగారువ్యాపారం చేసి అక్కడకూడా కాకినాడలో చేసినట్లుగానే ప్రజలను మభ్యపెట్టి షేర్‌మార్కెట్ ముసుగులో డబ్బులు వసూలుచేసి కోట్లల్లో ఉడాయించాడన్నారు. కావలిలో ముసునూరుకు చెందిన ఎలసిరి బ్రహ్మానందం తోడవడంతో ఇక్కడ కోట్లల్లో డబ్బులు వసూలుచేశాడన్నారు. అన్ని వివరాలు సేకరిస్తున్నామన్నారు. మోసగాళ్ల భరతంపడతామని డీఎస్పీ హెచ్చరికలు చేశారు.

**కావలి షేర్‌ట్రేడింగ్ ముసుగులో ఉన్నవారి వివరాలు వెల్లడించాలి...** కావలి షేర్‌ట్రేడింగ్ ముసుగులో పెట్టుబడులు పెట్టిన వారివివరాలు వెల్లడించాలని పాత్రికేయులు డీఎస్పీని పదేపదే అడగడం జరిగింది. ఎంతమంది సి.ఐలు, ఎస్.ఐలు, కానిస్టేబుళ్లు పెట్టుబడులు పెట్టారో వారివివరాలు, ప్రజలు ఎంతమంది మోసపోయారో వారివివరాలు తెలియచేయాలని కోరడంతో ఇంకా పూర్తి వివరాల సమాచారం రాలేదని త్వరలో తెలియచేస్తామని డీఎస్పీ పి.శ్రీధర్ చెప్పారు. కావలి ప్రాంతంలో ఎక్కువమంది పోలీసుశాఖనుంచే పెట్టుబడులు పెట్టడంతో వారిని చూసి జనంకూడా అత్యాశకు లోనై పెట్టుబడులుపెట్టి మోసపోయారని ప్రచారం సాగుతుంది. షేర్‌ట్రేడింగ్ ముసుగులో సుభాని దాదాపు 150 కోట్ల రూపాయల పైచిలుకు డబ్బులు వసూలు చేసినట్లు పోలీసుశాఖలో కొంతమంది చెప్పడాన్నిబట్టి తెలుస్తుంది. పోలీసు ఉన్నతాధికారులు జోక్యంచేసుకుని పేదప్రజలు కట్టిన డబ్బులను వారికి వచ్చేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సమావేశంలో కావలి రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.రాజేశ్వరరావు, వన్‌టౌన్ సిఐ ఫిరోజ్‌ఖాన్, టూటౌన్ సిఐ గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు. 12 రోజుల్లో దాదాపు 12కోట్ల రూపాయలను రికవరిచేసి మోసగాళ్ల గుట్టురట్టు చేసిన కావలి రూరల్ సిఐ జి.రాజేశ్వరరావును కావలి డీఎస్పీ శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు.

# జిబిఎస్ పై ఆందోళన వద్దు

## అందుబాటులో ఔషధాలు: మంత్రి సత్యకుమార్ యాదవ్

**సచివాలయం,ఫిబ్రవరి 17,ప్రభాతవార్త:** గుల్లియన్ భారీ సింద్రోమ్ (జిబిఎస్) విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, అన్ని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో తగిన వైద్యసేవలు, ఔషదాలుఅందుబాటులోఉన్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ప్రచార విభాగంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ జిబిఎస్ పై ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని, నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ వ్యాధి ప్రబలడానికి గల ప్రధాన కారణాలను నిశితంగా పరిశీలించడం జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేడు సమీక్ష నిర్వహించి గతంలో నమోదైన జిబిఎస్ కేసుల వివరాలను పూర్తిస్థాయిలో విశ్లేషించి ఈ వ్యాధి సోకడానికి విస్తరించడానికి గల కారణాలను గుర్తించాలని ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్రంలో గత ఏడాది పది ప్రభుత్వ ఆసుపత్రుల్లో 301కేసులు నమోదుకాగా, వీటిలో అధికమొత్తంలో 115కేసులు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదవ్వడానికి కారణం ఆ ఆస్పత్రుల్లో న్యూరాలజీకి సంబంధించిన అన్ని రకాల వైద్యసేవలు, ఔషదాలు అందుబాటులో ఉండటమే నన్నారు. జనవరిలో 43కేసులు నమోదుకాగా వారిలో 17 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో తగినవైద్య సేవలు అందజేసేందుకు అవసరమై ఇమ్యూనోగ్లోబిన్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని, ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఒక పేషంట్‌కు రోజుకి 5ఇంజక్షన్లు 5రోజులపాటు ఇవ్వాలి ్స ఉంటుందని, బహిరంగ మార్కెట్‌లో ఈ ఇంజక్షను ఖరీదు దాదాపు రూ.20వేల వరకు ఉందని, అయితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో దీని ్న ఉచితంగా ఇవ్వడం జరుగు తుందని ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద కూడా ఈ వ్యాధి కవర్ చేయబడుతుందన్నారు. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ సిఎస్ ఎం.టి.కృష్ణబాబు మాట్లాడుతూ పూనే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దాదాపు 181 మంది లో ఈ జిబిఎస్ వ్యాధి లక్షణాలను గుర్తించడంతో ప్రభుత్వం అప్రమత్తమైందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి తగిన వైద్యసేవలు పొందితే ఎలాంటి ప్రమాదం ఉండదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 1,200ఇమ్యూనోగ్లోబిలిన ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని, మరో 6,000ఇంజక్షన్లు సమకూర్చుకునేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి. సుందరాచారి మాట్లాడుతూ 1834లోనే ఈ వ్యాధిని గుర్తించడం జరిగిందని, ఇది చాల పురాతనమైన వ్యాదే అని పలు రకాల ఇన్‌ఫెక్షన్ల వల్ల ఈ వ్యాధి ప్రభలే అవకాశం ఉందన్నారు. కాబట్టి ఈ వ్యాధి లక్షణాలు ఏమాత్రం బయట పడినా సరే వెంటనే వైద్యులను సంప్రదించాల న్నారు. రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు డాక్టర్ నరసింహం ఈ సమావేశంలో పాల్గొన్నారు.




సచివాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

# ప్రజల్లో సంతృప్తి కనిపించాలి: సిఎం చంద్రబాబు

## నిర్లక్ష్యం, అవినీతి ఉంటే బాధ్యులపై చర్యలు

**విజయవాడ.ఫిబ్రవరి 17,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలే ఫస్ట్ అనే విధానంతో ప్రభుత్వం పనిచేస్తుందని పునరుద్ఘాటించారు. దీనికి అనుగుణంగా అన్ని శాఖల్లో, అన్ని స్థాయిలో అధికారులు, ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి ప్రభుత్వ కార్యక్రమం అమల్లో ప్రజల నుంచి సంతృప్తి వ్యక్తం అవ్వాలని సిఎం అన్నారు. ఏదైనా పాలసీలోనో, అమలులోనో లోపాలు, తప్పులు ఉంటే సరిదిద్దాలన్నారు. ఆయా శాఖల్లో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పనితీరు బాగుంటేనే అన్ని కార్యక్రమాల్లో ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తుందన్నారు..అప్పుడే ప్రభుత్వానికి కూడా మంచి పేరు వస్తుందని సిఎం చంద్రబాబు అన్నారు. సోమవారం వారానికి నాలుగు శాఖలపై సమీపర్సెప్షన్ ట్రాకింగ్ సమీక్షలో అధికారులకు సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అనేక కష్టాలు, సవాళ్లను అధిగమించి సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేస్తున్నామని వీటి ఫలితాలు రావాలంటే వాటి అమలు అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా ఉండాలని సిఎం అన్నారు. మొక్కుబడి పనితీరుతో మార్పు రాదని గత ప్రభుత్వానికి తమ ప్రభుత్వానికి పాలనలో స్పష్టమైనవ్యత్యాసం కనిపించేలా మార్పు వచ్చింది అనే అభిప్రాయం వ్యక్తం అయ్యేలా అన్ని వ్యవస్థలు పనిచేయాలని సిఎం సూచించారు.

**దీపం పథకం:** దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల డెలివరీ విషయంలో లబ్ధిదారుల నుంచి అక్కడక్కడా ఫిర్యాదులురావడంపై సిఎం అధికారులను వివరణ కోరారు. ప్రభుత్వం ఉచితంగా సిలిండర్లు ఇస్తుంటే వాటిని డెలివరీ చేసే సమయంలో డబ్బులుఅడుగుతున్నట్లు వచ్చిన ఫిర్యాదులపైయాక్షన్‌తీసుకోవాలని సిఎం సూచించారు.



**ఆర్టీసీ సర్వీసులు:** ఆర్టీసీ సర్వీసులకు సంబంధించి సదరు బస్సు సమయానికి బయలుదేరిందా నిర్థేసించిన సమయానికి గమ్యానికి తీసుకువెళ్లారా బస్ స్టాండ్‌లో సదుపాయాలు ఎలా ఉన్నాయి అనే అంశాలపై ప్రయాణికుల నుంచి తీసుకున్న ఫీడ్ బ్యాక్‌పై చర్చించారు. ఇప్పటికి 1100 బస్సుల్లో క్యూ ఆర్ కోడ్ పెట్టామని అధికారులు చెప్పగా, మొత్తం 11 వేల బస్సులతో పాటు బస్ స్టాప్‌లు, బస్ స్టేషన్ లలో కూడా విరివిగా క్యూర్ ఆర్ కోడ్ ఉంచి ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు తీసుకోవాలన్నారు.

**చెత్త నుంచి కంపోస్ట్ తయారీ:** పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి కంపోస్ట్ తయారీ కేంద్రాల పనితీరుపై ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. 5,859 గ్రామాల నుంచి ఈ మేరకు సమాచారం తీసుకున్నారు. ఈ కేంద్రాలు మరింత ఎఫెక్టివ్ గా పని చేయాలని ప్రజలు కోరుకుంటున్నట్లు సర్వే ద్వారా వెల్లడైంది. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు అయ్యిందని..గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి వ్యవస్థలో, విభాగంలో మార్పు కనిపించాలని సిఎం స్పష్టం చేశారు. ఆయా పథకాలు, కార్యక్రమాల అమలు విషయంలో జిల్లాల వారీగా కూడా ర్యాంకులు ఇస్తామని...వెనకబడి ఉన్న జిల్లాల కలెక్టర్లు దీనికి అనుగుణంగా పనిచే యాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

# తెలంగాణ 'పెద్దలసభ'లో యువగళం

## కాంగ్రెస్ సంస్థాగత బలోపేతంగా మండలి అభ్యర్థుల ఎంపిక

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** తెలంగాణ 'పెద్దలసభ'లో యువగళం వినిపించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధపడుతోంది. శాసనమండలిలో ఖాళీ అవుతున్న ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో శాసనసభ, లోకసభకు పోటీచేసి ఓటమిపాలైన నాయకులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ సుముఖంగా లేదు. పార్టీ సంస్థాగత అభివృద్ధి కోసం కష్టపడిన యువతను ప్రోత్సహించాలని కాంగ్రెస్ అధిష్ఠానం ఖరారుచేసిన నిర్ణయం చుక్కెన్నట్లు సమాచారం. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ కూడా రాబోయే 20 ఏళ్లలో పార్టీ సంస్థాగత అభివృద్ధికి యువతకు పదవులు కట్టబెట్టాలని ఇటీవల జరిగిన పిఏసి సమావేశంలో దిశానిర్దేశం చేశారు. శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి పాలైన కాంగ్రెస్ నాయకులు దొడ్డిదారిన మండలిలో ప్రవేశించి మంత్రిమండలిలో చోటు సంపాదించాలని ఇన్నాళ్లు ఆశపడిన వారికి కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం నిరాశే కలిగిస్తున్నది.

మార్చి 29న ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, శేరి శుభాష్‌రెడ్డి, యెగ్గె మల్లేశం, ఎంఎంఐఎం చెందిన వారి పదవీకాలం ముగియబోతున్నది. ఈ ఐదు ఎమ్మెల్సీలలో కాంగ్రెస్ కూటమికి నాలుగు ఎమ్మెల్సీలు ప్రస్తుత బలాబలాలను పరిగణనలోకి తీసుకొంటే దక్కే అవకాశం ఉంది. బిఆర్ఎస్ ఒకటి పొందే అవకాశం ఉంది. 2023 నవంబరులో కాంగ్రెస్ పార్టీ శాసనసభ ఎన్నికల సమయంలో సిపిఐ డిమాండ్ చేసిన హుస్నాబాద్‌తో సహా మరో మూడు నియోజకవర్గాలు ఇవ్వకుండా రెండు ఎమ్మెల్సీ పదవులు ఇస్తామని హామీ ఇచ్చి సిపిఐతో ఒప్పందం చేసుకొంది. కూనంనేని సాంబశివరావుకు మాత్రమే ఒకేఒక్క సీటు ఇచ్చింది. రెండింటిలో ప్రస్తుతం ఒక్కటి సిపిఐకి మిత్రధర్మంగా కేటాయించాల్సిన అవసరం ఉంది. కాంగ్రెస్ నాలుగింటికి పోటీ చేయాలని భావించినా సిపిఐ కనీసం ఒక్కటైనా ఈసారి కేటాయించాలని గట్టిగా కోరుతున్నది. సిపిఐ నుంచి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ కార్యదర్శి చాడవెంకటరెడ్డి, పల్లా వెంకటరెడ్డిలలో ఎవరో ఒకరికి ఈ దఫా పోటీ చేసేందుకు కాంగ్రెస్ ఒక సీటు ఇచ్చే అవకాశం ఉంది. ఫిబ్రవరి 27న మండలి గ్రాడ్యుయేట్ ఎన్నికలు, కౌంటింగ్ పూర్తికాగానే ఎమ్మెల్యే కోట ఎమ్మెల్సీ ఎన్నికల నగారా మోగే అవకాశం ఉంది. దీనితో ఆశావాహులు ఎవరి ప్రయత్నాల్లో వారు చేస్తున్నారు.

కాంగ్రెస్ మూడు సీట్లు మూడు ప్రధాన సామాజిక వర్గాల నేతలకు ఇవ్వాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు కాంగ్రెస్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. రెడ్డి సామాజిక వర్గానికి ఒకటి, బిసి వర్గానికి రెండో సీటు, ఎస్సీ, ఎస్టీలలో ఎవరో ఒకరికి మూడో సీటు ఇచ్చే అవకాశం ఉందని అంతా భావిస్తున్నారు. కాంగ్రెస్‌పార్టీ ఇతమిద్దంగా తన విధానం తెలపకపోవడంతో సీట్లు కేటాయింపు విషయంలో ఔత్సాహికులకే కాదు రాజకీయ పరిశీలకులకు కూడా ఉత్కంఠత నెలకొంది. యువతరానికి అవకాశాలు ఇవ్వాలని పార్టీ విధానం ప్రకటించడంతో కార్పొరేషన్ చైర్మన్ పొందిన వారు కూడా ఎమ్మెల్సీ కోసం మైహూనా అంటూ ముందుకు వస్తుండటంతో పోటీ పెరుగుతున్నది. రెడ్డి వర్గానికి ఒక సీటు ఇచ్చే అవకాశం ఉందని సంకేతాలు వెలువడటంతో కేబినెట్ ర్యాంకు కలిగిన నామినేటెడ్ పోస్టుల్లో ఉన్న నాయకులు కూడా పెద్దల సభకు పోతామని మనస్సులో మాట చెప్పి ఢిల్లీ స్థాయిలో పైరవీలతో ప్రయత్నాలు మొదలు పెడుతున్నారు.

మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి, ఎస్సీ వర్గం నుంచి అద్దంకి దయాకర్, సిద్దేశ్వర్, దొమ్మాటి సాంబయ్య ఎస్టీ వర్గం నుంచి రాములునాయక్ వంటి వారు ఎమ్మెల్సీ పదవులు ఆశిస్తున్నారు. గవర్నర్ కోటాలో ముస్లింలకు అవకాశం ఇవ్వడంతో ఈ దఫా ముస్లిం నాయకులకు పెద్దలసభకు పంపే అవకాశంలేదు. యువతకు పార్టీలో అవకాశం ఇవ్వదలుచుకుంటే ఇప్పటికే ఎమ్మెల్సీగా బల్మూరి వెంకట్‌కు రాజ్యసభ ఎంపిగా అనిల్ కుమార్‌యాదవ్‌కు అవకాశం ఇచ్చారు. అదేవిధానంలో యువతకు పెద్దపీట వేసుకొంటూ పోతే తమ పరిస్థితి ఏమిటనే ఆందోళన, అసంతృప్తితో ఎమ్మెల్యే, ఎంపీగా ఓటమిపాలైన వారు రగులుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా యువతకు మాత్రమే అవకాశాలు ఉంటాయని ప్రస్తావించడంతో వృద్ధులు, ఓటమిపాలైన నేతలు నిర్వేదంగా ఉన్నారు.



విజేతలకు బహుమతి అందిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

## జాతీయ స్థాయిలో ఆడే క్రీడాకారులు సిద్దిపేట నుంచి తయారవ్వాలి

### మహిళ క్రికెటర్ త్రిష అందరికీ స్ఫూర్తి కావాలి

### మాజీ మంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** సిద్దిపేట మట్టి నుంచి జాతీయ స్థాయిలో ఆడే క్రీడాకారులు తయారుకావాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మినీస్టేడియంలో సోమవారం కెసిఆర్ క్రికెట్ ట్రోఫీ విజేతలకు నగదుతోపాటు జ్ఞాపికలలను అందించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని ఓటిమి గెలుపుకు నాంది పలుకుతుం దన్నారు. బిఆర్ఎస్ ఓటమి రాబోయే రోజుల్లో 3 సార్ల గెలుపుకు నాంది పలుకుతుందన్నారు. మహిళ క్రికెటర్ త్రిష అందరికీ స్ఫూర్తి కావాలన్నారు. రాష్ట్రంలో మళ్లీ కెసిఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కెసిఆర్ హయాంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలుపారని గుర్తు చేశారు. రాష్ట్రంలో రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ కాలేదు రైతు భరోసా రావడం లేదన్నారు. కెసిఆర్ హయాంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తే సిఎం రేవంత్‌రెడ్డి మాత్రం రాష్ట్ర గ్రాఫ్ పడిపోయేటట్లు పాలన చేస్తున్నారని మండిపడ్డారు. కెసిఆర్ అవసరమైతే 20-20 అడుతాడని సిఎం రేవంత్‌రెడ్డి మాత్రం తొండి గండి..కలెక్షన్‌లో 20-20 మ్యాచ్‌లు ఆడుతున్నాడని ఆరోపించారు. సిఎం రేవంత్‌రెడ్డి మాటలు అన్ని తొండి గ్యారెంటీలన్ని గండి అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సిద్దిపేట అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. నాలుగు కోట్ల ప్రజల అకాంక్షను నెరవేర్చి 10 యేండ్లు సిఎంగా రాష్ట్రాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపిన ఘనత కెసిఆర్‌కే దక్కుతుందన్నారు.

## రాజస్థాన్‌లో వాటర్ విజన్ 2047 సదస్సులో నేడు పాల్గొననున్న మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** రాష్ట్ర పంచాయితీరాజ్‌శాఖ మంత్రి సీతక్క మంగళవారం రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో కేంద్ర మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరగనున్న వాటర్ విజన్ 2047 సదస్సులో పాల్గొనున్నారు. రెండు రోజులుపాటు జరనున్న ఈ సదస్సులో తెలంగాణలో అమలవుతున్న గ్రామీణ మంచి నీటి సరఫరా వ్యవస్థ అనే అంశంపై ప్రసంగించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన చర్యలను కేంద్రం, ఇతర రాష్ట్రాలకు వివరించనున్నారు. అదే విధంగా తాగు నీటి వ్యవస్థ స్థిరత్వం కోసం తమ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఈ సందర్భంగా వివరించనున్నారు. ఇంటింటికి రక్షిత మంచి నీటిని అందిం చేందుకు కేంద్రం ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం కోరనున్నారు.

## వన్ మ్యాన్ ఆఫీస్‌ను ఆవిష్కరించిన ఎల్ఐసి

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** వినియోగదారులకు 24 గంటలు మరింత మేలైన సేవలు అందించేందుకు ఎల్ఐసి వన్ మ్యాన్ ఆఫీస్ (ఓఎంఎన్) సేవలను సోమవారం ఆవిష్కరించింది. ఈ సందర్భంగా ఎల్ఐసి సీఈవో, మేనేజింగ్ డైరక్టర్ సిద్దార్థ మహంతి మాట్లాడుతూ..2047 నాటికి అందరికి బీమా లక్ష్యంగా ఈ సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. ఓఎంఎన్ ద్వారా ఎప్పుడైనా ఎక్కడైనా ఎల్ఐసీ సేవలను అత్యంత వేగవంతంగా అందింవచ్చని తెలిపారు. డిజిటల్ రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా తాము ఈ సేవలను వినియోగదారుల సౌకర్యం కోసం అందుబటులోకి తీసుకు వచ్చినట్లు తెలిపారు. వన్ మ్యాన్ ఆఫీస్ సేవలతో ఏజెంట్లుకు డిజిటల్ పాలసీల అమ్మకంలో సహాయం చేయడం, వివిధ రకాల సేవల కోసం కస్టమర్లకు పాలసీలకు సంబంధించిన కొత్త వివరాలను అందించడం, వారి సేవలకు సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని వారికి అందించడం జరుగు తుంద న్నారు. మోబైల్‌లో ఈ యాప్‌ను డైన్‌లోడ్ చేసుకోవడంతో ఎల్ఐసికి సంబం ధించిన ప్రతి సమాచారాన్ని పూర్తి వివరాలను తెలుసుకోవచ్చున్నారు. వినియోగ దారుల ప్రీమియం వివరాలను, చిరునామా మార్పు, లోన్‌ల దరఖాస్తుల స్వీకరణ, పాలసీ పునరుద్ధరణ తదితర సేవలను సులభంగా పొందవచ్చని వివరించారు. మారుతున్న కాలన మాన పరిస్థితులకు అనుగుణంగా ఓఎంఎన్‌లో మార్పులు చేర్పులు చేసుకునే అవకాశం కూడా ఉందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆళ్ల రామకృష్ణ

## తొలగించిన 26 బిసి కులాలను మళ్లీ బిసి జాబితాలో చేర్చాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి ఆళ్ల రామకృష్ణ విజ్ఞప్తి


**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** గత కెసిఆర్ ప్రభుత్వంచే అక్ర మంగా, దారుణంగా తొలగించబడిన 26 బిసి కులాలను వెంటనే రాష్ట్ర ప్రభు త్వం బిసి జాబితాలో చేర్చాలని ఆ 26 బిసి కులాల పోరాట సమితి అధ్యక్షుడు, ఒబిసి మేధావుల ఫోరం జాతీయ అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొలగించబడిన 26 కులాలకు కెసిఆర్ జన్మదినాన్ని దుర్దినంగా ప్రకటించారని ఆరోపించారు. కెసిఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రం విధ్వంసానికి గురైందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిల రిజర్వేషన్‌లను 34 శాతం నుంచి 20 శాతానికి తగ్గించిన ఘనుడు కెసిఆర్ అని, 26 బిసి కులాలను తెలం గాణ లోని బిసి జాబితా నుంచి తొలగించి లక్ష లాది మందిని రోడ్డుపాలు చేశారని ఆయన ఆరోపించారు. సమావేశంలో సమితి నాయ కులు చిత్తూరు వేణు, చొల్లంగి ప్రసాద్, కంద్రింగుల కృష్ణప్రసాద్, బొందరి రమణమూర్తి, మల్లుల చంద్రశేఖర్, ఉమాపతి, భాస్కర్ పాల్గొన్నారు.

## హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టి మళ్లించే యత్నం

### మోడీపై సిఎం వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

### మాజీ ఎంపి బూర నర్సయ్యగౌడ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారంటూ మాజీ ఎంపి బూర నర్సయ్యగౌడ్ మండి పడ్డారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. హైడ్రా, హెచ్ఎండిఏ, ట్రిపుల్ ఆర్, కుల గణన, రాజకీయ గణన వంటి అంశాలతో ప్రజలను మభ్య పెడుతున్నారని అన్నారు. ప్రధాని నరేంద్రమోడీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మోడీని కన్వర్టెడ్ బిసి అంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని, ఇది తీవ్రంగా ఖండించదగిన విషయమని అన్నారు. సిఎం హోదాలో ఉన్న వ్యక్తి హుందాగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.





సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆ పార్టీ మాజీ ఎంపి బూర నర్సయ్యగౌడ్

మోడీ ఎప్పుడూ తాను బిసి అని చెప్ప లేదని, ఆయన 'మోడీ కా పరివార్' అని, దేశమంతా తన కుటుంబమేనని చెబుతారన్నారు. బిసి సామాజిక వర్గానికి చెందిన ఒక వ్యక్తిని ప్రధానమంత్రిగా చేసిన ఘనత బిజెపిదే అన్నారు. కాంగ్రెస్ నాయకుల తీరుతో భవిష్యత్తులో మహాత్మాగాంధీ, భగత్‌సింగ్, సుభాష్‌చంద్రబోస్ కులాలను ప్రస్తావించే దుర్భాగ్యమైన పరిస్థితి భారతదేశానికి రాకూడదని, రాజకీయ విమర్శలు వేరు, వ్యక్తిగతంగా అవహేళన చేయడం వేరన్నారు. మోడీ గురించి అవహేళనగా మాట్లాడిన వారు చివరకు ఏమయ్యారో తెలుసుకోవాలన్నారు. ఈ విషయం రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాన్నారు. మోడీ కులం 'తెలి'. తెలంగాణలో గాండ్ల కులంగా పేర్కొంటారు. బిసి రిజర్వేషన్లు అమలైనప్పుడు గాండ్ల కులం బిసి జాబితాలోనే ఉందన్నారు.

# బిసి ముఖ్యమంత్రి కాంగ్రెస్ పార్టీ నుంచే సాధ్యం



సోమవారం గాంధీభవన్‌లో నిర్వహించిన ఒబిసి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న పిసిసి చీఫ్ మహేష్‌కుమార్

### కేబినెట్ విస్తరణలో ఆ వర్గాల వారికి ప్రాధాన్యత

### రిజర్వేషన్ పెంపు విషయంలో మోడీని ఒప్పించే దమ్ము బండికి ఉందా?

### ఒబిసి కార్యవర్గ సమావేశంలో పిసిసి చీఫ్ మహేష్‌కుమార్

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభావార్త:** తెలంగాణలో బిసి ముఖ్యమంత్రి కాంగ్రెస్ పార్టీ నుంచి మాత్రమే కాగలడని పిసిసి చీఫ్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం గాంధీభవన్‌లో ఒబిసి రాష్ట్ర కార్యవర్గ సమావేశం నూతి శ్రీకాంత్‌గౌడ్ అధ్యక్షతన జరగగా అందులో జాతీయ ఒబిసి సెల్ చైర్మన్ అజయ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మహేష్ కుమార్ మాట్లాడుతూ బిజెపి, బిఆర్ఎస్ బిసి నాయ కుడిని సిఎంగా చేయగలవా అని ప్రశ్నిం చారు. దేశ వ్యాప్తంగా కులగణన చేసే సత్తా మోడీకి ఉందా అని అన్నారు. బిసిలలో ఐక్యత లోపించిందని బిసిలు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. వెనుకబడిన తరగతులకు రాజ్యాధికారం రావాలని 42 శాతం రిజ్వేషన్ చట్టబద్ధత కోసం ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి తీర్మానం చేసి పంపుతామని, ఆ బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో ప్రధానిని ఒప్పించి చేర్పించే దమ్ము కేంద్రమంత్రి బండి సంజయ్‌కు ఉందా అని పిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ సవాల్ చేశారు. రాహుల్‌గాంధీ ఆశయం మేరకు కులగణన సర్వే నిర్వహిం చామని తెలిపారు. బండి సంజయ్‌ను రాష్ట్ర అధ్యక్షపదవి నుంచి తొలగిస్తే పార్టీలకు అతీతంగా స్పందించామని గుర్తుచేసుకున్నారు. కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు సామాజిక మాధ్యమాలపై కూడా దృష్టి కేంద్రీకరించి ప్రభుత్వ పథకాలు ప్రజల వద్దకు తీసుకెళ్లాలని, ప్రతిపక్షాల వ్యతిరేక ప్రచారం తిప్పికొట్టాలని కోరారు. క్యాబినెట్ విస్తరణలో వెనుకబడిన తరగతులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. తెలంగాణలో బిసి తప్పకుండా సిఎం అవుతారని, ఐతే ఈ ఐదేళ్లు మాత్రం రేవంత్‌రెడ్డి సిఎంగా కొనసాగుతారని అన్నారు.

# శాంతిభద్రతలు ఎల్బీనగర్ డిసిపికి పార్ట్‌టైమ్ జాబ్‌గా మారింది!

### ఇప్పటికైనా ఆయన తీరు మార్చుకుంటే మంచిదని హితవు

### కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ తీవ్రఆగ్రహం

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** హైదరాబాద్ లోని ఎల్బీనగర్ డీసీపీ వ్యవహారశైలిపై కాంగ్రెస్ పార్టీ ప్రచారకమిటీ చైర్మన్, సీనియర్ నేత మధు యాష్కీ తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విష యాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతానని ఆయన తెలిపారు. ఎల్బీనగర్ డీసీపీ పూర్తి సమయం ల్యాండ్ సెటిల్‌మెంట్లు చేయడంలో నిమగ్నమయ్యారని విమర్శించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం మాత్రం పార్ట్ టైమ్‌గా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎల్బీ నగర్ డీసీపీ ఇప్పటికైనా తన ప్రవర్తనను మార్చు కోవాలని మధుయాష్కీ సూచించారు. ఒకవేళ డీసీపీ తన తీరును మార్చుకోకపోతే ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటారని ఆయన హెచ్చరించారు. గాంధీభవన్‌లో సోమవారం చిట్‌చాట్ చేస్తూ ఓ ల్యాండ్ వివాదంలో తలదూర్చి డాక్యుమెంట్స్ తీసుకురమ్మని సెటిల్ చేస్తానని ఒత్తిడి చేశారని ఆరోపించారు. ల్యాండ్ వివాదంలో జోక్యం చేసుకోవడానికి పోలీసులకు ఏం పని, సీఎం దృష్టికి తీసుకువెళ్లాని ఆయన అన్నారు. డిసిపి మారితే మంచిది, లేదంటే చర్యలు ముఖ్యమంత్రి చర్యలు తీసుకొంటారు. అధికారుల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పింది నిజమని మధుయాష్కీ మద్దతు పలికారు. బండి సంజయ్ గాడి తప్పిన బండి లాగ ఆయన మాటలు ఉన్నాయని అన్నారు. బీజేపీలో రాష్ట్ర అధ్యక్షుడి పదవి కోసం పోటీ నడుస్తుందని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరోక్షంగా బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోటీ చేస్తున్నవని ఆపాదించారు. జైపూర్ మీటింగ్‌లో రాహుల్ గాంధీ తన కులం ఏమిటో చెప్పారని ఆయన తెలిపారు. జాతీయ జెండా నా మతం అన్నారన్నారు. కులగణనపైన తమ వైఖరి చెప్ప కుండా తప్పించుకోవడానికి రాహుల్ గాంధీ కులం ఏమిటి అంటున్నారు.

రాజకీయ లబ్ధి కోసం కులం, మతాన్ని వాడుకోవడం ప్రధానమంత్రికి తగదని అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు సీఎం రేవంత్ రెడ్డి కులగణన చేశారని, కేటీఆర్, కవిత బిసిల గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వళ్లించినట్లుందని ఆయన అన్నారు. కేసీఆర్ ఇప్పటికైన దళితులను ముఖ్యమంత్రిని చేస్తానని కొడుకును, కూతుర్ని, అల్లున్ని తీసుకెళ్లి ప్రమాణం చేసి ప్రజలకు నిజమైన వాగ్దానం చేయాలని కోరారు. మిగిలిన సర్వేలో మీ సంఘాలు పాల్గొనే విధంగా ప్రచారం చేయాలని బీసీ సంఘాలు మేధావులకు విజ్ఞప్తి చేశారు. కేసీఆర్‌కు పుట్టిన రోజు సందర్భంగా గులాబీ పువ్వు ఇచ్చి సర్వేలో పాల్గొనే విధంగా చేయాలి. అగ్ర కులాల ఆగ్రహాన్ని లెక్క చేయకుండా బడుగు బలహీన వర్గాలకోసం పోరాడుతున్న రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపర్చాలి. రేవంత్ రెడ్డి సమర్థవంతంగా పని చేస్తున్నారని అన్నారు. రాష్ట్రం కోసమ్ము ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రం ఏర్పడ్డాక కూడా దొరల పాలన ఏర్పడింది. ఢిల్లీ ఎన్నికల్లో 2013లో ఆమ్ ఆద్మీ పార్టీ తో పొత్తు పొత్తుకున్నప్పుడే కాంగ్రెస్ బలహీన పడింది. ఆమ్ ఆద్మీ పార్టీని పెంచి పోషించేది బీజేపీ పార్టీయే అని ఆయన సూత్రీకరణ చేశారు.

# కుల, మతాలతో రాజకీయం చేస్తున్న బిజెపి

### ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :** కులం, మతం పేరుతో దేశంలో రాజ కీయాలు నడిపే రాక్షస ప్రవృత్తి గలవారు బిజెపి నాయకులని ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ ఆరోపించారు. సిఎల్‌పి కార్యాలయంలో మీడియాతో మాట్లా డుతూ రాహుల్‌గాంధీ ఇల్లీగల్లీ కన్వర్టెడ్ గాంధీ అని బూర నర్సయ్య దిగజారి వ్యాఖ్యలు చేయడం ఆయన స్థాయికి తగదని అన్నారు. రాహుల్‌గాంధీ కులంపైన బిజెపి నాయకులు అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారు, రాహుల్‌గాంధీది త్యాగాల కుటుంబమని అన్నారు. దేశం కోసం నెహ్రూ జైలుకు వెళ్లారని, దేశసమగ్రత కోసం రాహుల్‌గాంధీ నానమ్మ ప్రాణం త్యాగం చేశారని, రాజీవ్‌గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారని ఆయన అన్నారు. కేంద్ర మంత్రులమనే ఇంగితం కూడా కిషన్‌రెడ్డికి, బండి సంజయ్‌కు లేదని, ఎంత సేపు కులం, మతం గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ దేశాభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు తీసుకొందని అన్నారు. గాంధీ కుటుంబంపై బిజెపి నాయకులు విమర్శలు చేయడం దేశ ప్రజలు సమర్థించరని ఆయన అన్నారు.

**బిజెపి కుల, మత రాజకీయాలను తిప్పకొట్టాలి : మహబూబాబాద్ ఎంపి బలరాంనాయక్**

బిజెపి నాయకుల కుల, మత నీచరాజకీయాలను తిప్పికొట్టాలని మహ బూబాబాద్ ఎంపి బలరామ్ నాయక్ పిలుపు నిచ్చారు. బూర నర్సయ్య నిజమైన బిసి అయితే రాహుల్‌గాంధీ కులగణన సమర్థించాలని కోరారు. కులగణనను బిజెపి బిసి నాయకులు విమర్శిస్తూ మాట్లడటం తగదని హితవు చెప్పారు. మహిళలకు రాజకీయంగా రిజర్వేషన్ చట్టసభల్లో కల్పించాలని రాజీవ్‌గాంధీ భావించారు.

# కాంగ్రెస్ పాలనలో నరకం చూస్తున్న ప్రజలు



ఎర్రవల్లిలో నిర్వహించిన హోమం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత

### మతాల పేరుతో డ్రామాలాడుతున్న కాంగ్రెస్, బిజెపి

### ఎర్రవల్లిలో నిర్వహించిన యాగంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత

**మర్కుక్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** మతాల పేరుతో కాంగ్రెస్, బిజెపి పార్టీలు డ్రామాలు చేస్తున్నాయని, ఇచ్చిన హామీలు అమలుచేయడంలో విఫలమైన 14 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు నరకం చూస్తున్నారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. సోమ వారం మాజీ ముఖ్య మంత్రి కెసిఆర్ జన్మదినం సందర్భంగా కెసిఆర్ దత్తత గ్రామం ఎర్రవల్లిలో పిఎసిఎస్ వైస్‌చైర్మన్ కమ్మరి బాలరాజు, గ్రామ విడిసి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సుదర్శన యాగం, ఆయుష్ హోమం కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవితతోపాటు మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ ఎస్ ముఖ్య నేతలు పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అంతకుముందు వర్ధ రాజ్‌పూర్‌లోని వరద రాజస్వామి దేవాల యంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పేరుపై ప్రత్యేక పూజలు నిర్వహించి ఎర్రవల్లికి చేరుకొని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కులమతాలకతీతంగా కెసిఆర్ జన్మదిన వేడుకలు ప్రజలందరూ జరుపు కున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని, మతాల పేరుతో డ్రామాలు చేస్తున్నారని ఆరోపిం చారు. నరేంద్ర మోడీ ఏ కులమైతే మాకేంది, రాహుల్ గాంధీ ఏ మతమైతే మాకేం సంబంధమని, కులమతాల పేరుతో ప్రజలను మోసం చేస్తు న్నారని ఆరోపించారు. కెసిఆర్ జన్మదినాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అన్నిమతాల ప్రజలు జరుపుకున్నారని, కెసిఆర్ ఆయురా రోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థ నలు, పూజలు చేశారని తెలిపారు.

ఈ కార్య క్రమంలో గజ్వేల్ మాజీ ఎఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్, తాజా మాజీ ఎంపిపి పాండుగౌడ్, మాజీ జెడ్‌పిటిసి మంగమ్మ రాంచంద్రం, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి బాల్‌రెడ్డి, బిఆర్ఎస్ బిసి సెల్ మండల అధ్యక్షుడు మేకల కనకయ్య, బిఆర్ఎస్ జిల్లా యూత్ అధ్యక్షుడు నాగరాజు, మాజీ కౌన్సిలర్లు గుంటుకు రాజు, కృష్ణారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కనకయ్య, గీసు మల్లేశం, నవీన్, స్వామి, చంద్రం, మాజీ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నేతలు, గ్రామ ప్రజలు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.




తెలంగాణ సమగర (మోచి) కుల సంఘం సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సిహెచ్ రాజమౌళి

## లిడ్‌క్యాప్‌ను అభివృద్ధి చేసి ఉపాధి కల్పించాలి

### వర్గీకరణ చేసిన సిఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు

**హైదరాబాద్ ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** లిడ్‌క్యాప్ సంస్థను భారీ స్థాయిలో అభివృద్ధి చేసి రాష్ట్రంలోని లక్షలాది మంది చర్మకారులకు ప్రభుత్వం ఉపాధి కల్పిం చాలని తెలంగాణ సమగర (మోచి) కుల సంఘం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సి.హెచ్. రాజమౌళి విజ్ఞప్తి చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ జాబితాలోని మాదిగ, ఉప కులాలకు 9 శాతం రిజర్వేషన్‌లు కల్పించినందుకు, మోచి కులాన్ని వర్గీకరణలోని 'బి' కేటగరిలో చేర్చినందుకు సిఎంకు, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజ నర్సింహ, జస్టిస్ షమీర్ అక్తర్ కమిషన్‌కు, ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు ధన్యవాదాలు తెలిపారు. మోచి అరాధ్యదైవమైన సంత్ రవిదాస్ మహారాజ్ ధామంను హైదరాబాద్ నగరంలో నెలకోల్పాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ఎస్.దశరథ్, వైస్-చైర్మన్ వాగ్మరి, కార్యనిర్వాహక అధ్యక్షుడు హెచ్.రవీందర్, అధ్యక్షుడు ఎం.భాస్కర్, ప్రధాన కార్యదర్శి డి.నోమురాజు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ నిరుద్యోగ జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ర్యాలీలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

## విఆర్ఎల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** జీవో నెంబర్ 81 ప్రకారం 61 సంవత్సరాల వయసు దాటిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, వీఆర్ఏ వారసుల జేఏసీ అధ్యక్షులు ఆంజనేయులు నాయకత్వంలో వేలాదిమందితో పెద్దఎత్తున మహాధర్నా నిర్వహించారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం 2020 సెప్టెంబరు 9న అసెంబ్లీలో వీఆర్ఎలకు పేస్కేల్, వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. హామీలను అమలు చేయాలని వీఆర్ఏలు 80 రోజుల పాటు దీర్ఘకాలిక సమ్మె చేసిన ఫలితంగా గత ముఖ్యమంత్రి వీఆర్ఏ జేఏసీతో చర్చలు జరిపి జీవో నెంబర్ 81, 85లను విడుదల చేసి, 20,555 మంది వీఆర్ఓల్లో 16,758 మంది వీఆర్ఏలను వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులల్లో సర్దుబాటు చేసి, 3,797 మంది వీఆర్ఏ వారసులకు ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. జీవో నెంబర్ 81, 85 ప్రకారం వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు వస్తాయని 15 నెలల నుండి ఎదురు చూస్తున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, 3,797 మంది వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇచ్చి, రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.

# నాగచైతన్యకు 'తండేల్' బిగ్గెస్ట్ హిట్

యువ సామ్రాట్ నాగ చైతన్య లేటెస్ట్ సెన్సేషన్ తండేల్ బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని సాధించింది. 100 కోట్ల క్లబ్‌లోకి ఎంటరైన అతని మొదటి చిత్రంగా నిలిచింది. చందూమొండేటి దర్శకత్వం వహించి, సాయి పల్లవి హీరోయిన్‌గా నటించిన తండేల్ నాగ చైతన్యకు బిగ్గెస్ట్ హిట్. ఫిబ్రవరిలో ఆఫ్ సీజన్ విడుదలైనప్పటికీ, ఆది వారాలు తప్ప, పెద్ద సెలవులు లేనప్పటికీ, ఈ చిత్రం ఫుట్ ఫాల్స్ అద్భుతంగా వున్నాయి. అలాగే ఈ చిత్రం హెచ్‌డి వెర్షన్ విడుదలైన మొదటి రోజే లీక్ అయినప్పుడు పైరసీ ఆందోళనలు పెద్ద ఎత్తున తలెత్తాయి. అయితే అలాంటి అవాంతరాలని కూడా దాటుకొని వందకోట్ల క్లబ్ లో చేరడం మామూలు విషయం కాదు. తండేల్ ఇప్పుడు బిగ్ మైల్ స్టోన్‌ని దాటింది, సెకండ్ వీక్ ముగియకముందే, ఓవర్సీసిస్ ఎర్నింగ్‌లో ఒక మిలియన్ డాలర్లు దాటింది. ప్రపంచవ్యాప్తంగా 100 కోట్లకు పైగా వసూలు సాధించింది. ఈ చిత్రం డొమస్టిక్ మార్కెట్లో అద్భుతంగా రాణించడమే కాకుండా, తెలుగు రాష్ట్రాల్లోని డిస్ట్రిబ్యూటర్స్‌కు లాభ దాయకమైన వెంచర్ అయ్యింది. ఇప్పటికే బ్రేక్‌ఈవెన్ అయి లాభాలు తెచ్చిపెట్టింది. నాగ చైతన్య ఈ ప్రాజెక్ట్ కోసం అహర్నిశలు కష్టపడ్డారు. పాత్ర కోసం కంప్లీట్‌గా ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. తండేల్ విజయం అక్కినేని అభిమానులకు గొప్ప ఆనందాన్ని తెచ్చిపెట్టింది. తమ అభిమాన హీరో ఈ అద్భుతమైన విజయాన్ని సాధించడం చూసి వారు సంతోషిస్తున్నారు. నిర్మాత బన్నీవాసు ఈ సినిమా వందకోట్ల క్లబ్ లో చేరుందని ముందే నమ్మకంగా చెప్పారు. చెప్పినట్లే సినిమా వందకోట్ల క్లబ్‌లో చేరింది. మూవీ ప్రజెంటర్ అల్లు అరవింద్ మొదటి నుంచి ఈ సినిమా బిగ్గెస్ట్ హిట్ అవుతుందని చెప్పారు. ఆ మాటని ఆడియన్స్ కూడా ప్రూవ్ చేశారు. గీతా ఆర్ట్స్‌లో వన్ అఫ్ ది బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది తండేల్. ఆదివారం అదిరిపోయే బుకింగ్స్‌తో బుక్‌మైషోలో ట్రెండింగ్‌లో వుంది తండేల్.



# 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' ప్రి రిలీజ్ ఈవెంట్

దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమలో ప్రముఖ నిర్మాణ సంస్థల్లో ఒకటైన ఎజిఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ వరుసగా హిట్ చిత్రాలను నిర్మిస్తోంది. ఎజిఎస్ ఎంటర్‌టైన్‌మెంట్, ప్రదీప్ రంగనాథన్ కాంబోలో బ్లాక్ బస్టర్ 'లవ్ టుడే' చిత్రం వచ్చింది. ఇప్పుడు మళ్లీ ఈ కాంబోలో 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, కయాదు లోహార్ హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రాన్ని కల్పాతి ఎస్. అఘోరం, కల్పాతి ఎస్. గణేష్, కల్పాతి ఎస్. సురేష్ నిర్మించారు. ఓరి దేవుడా సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహించారు. ఈ మూవీ ఫిబ్రవరి 21న రాబోతోంది. ఈ క్రమంలో ఆదివారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు డైరెక్టర్ హరీష్ శంకర్, సాయి రాజేష్, కిషోర్ తిరుమల వంటి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ హరీష్ శంకర్ మాట్లాడుతూ, 'తెలుగులో ప్రదీప్ రంగనాథన్ అద్భుతంగా మాట్లాడారు. ఒకసారి హీరోని మనం సొంతం చేసుకుంటే.. ఆ హీరో ఏం చేసినా మనకు చాలా నచ్చేస్తుంది. ఇప్పుడు ప్రదీప్ అలాంటి ఇమేజ్‌ను ఇక్కడ సొంతం చేసుకున్నారు. ఇక ప్రదీప్‌ని సినిమా సినిమాకి గ్యాప్ ఇవ్వొద్దని కోరుకుంటున్నాను. అశ్వత్ మారిముత్తు అద్భుతమైన దర్శకుడు. ట్రైలర్ కట్ చూస్తేనే ఈ సినిమా పెద్ద హిట్ అవుతుందనిపిస్తోంది. తెలుగులో మైత్రి మూవీ మేకర్స్ ఓ బ్రాండ్. టాలెంట్ హంట్‌లో మైత్రి రవి గారు చాలా ముందుంటారు. తెలుగులో మైత్రి



ఎలానో.. తమిళంలో ఏజీఎస్ అలా ఉంటుంది. ఎప్పుడూ కొత్త కంటెంట్, కొత్త వాళ్లని ఎంకరేజ్ చేస్తుంటారు. ఎస్ కే ఎన్ మాట్లాడిన తరువాత మనం మాట్లాడటానికి ఏం ఉండదు. ఈ సినిమాకు తెలుగు డైలాగ్స్ బాగా రాశారు. ఫిబ్రవరి 21న ఈ చిత్రాన్ని నేను ఫస్ట్ డే ఫస్ట్ షో చూస్తాను. ఈ మూవీని అందరూ సపోర్ట్ చేయండి' అని అన్నారు. హీరో ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ, 'లవ్ టుడే టైంలో ఇక్కడకు వచ్చినప్పుడు అందరికీ మాట ఇచ్చా. నెక్స్ట్ టైం ఇక్కడకు వచ్చినప్పుడు తెలుగులోనే మాట్లాడతా అని చెప్పా. అందుకే ఇప్పుడు తెలుగులో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నాను. మాటిస్తే చేస్తామా? లేదా? అన్న దానికంటే.. అసలు ప్రయత్నించామా? లేదా? అన్నదే ముఖ్యం. అదే మా డ్రాగన్ చిత్రం. ఓ మామూలు అబ్బాయి.. జీవితంలో ముందుకు వెళ్లాలని చేసే ప్రయత్నమే మా డ్రాగన్ అన్నారు. చిత్ర దర్శకుడు అశ్వత్ మారిముత్తు మాట్లాడుతూ.. 'తెలుగు ఆడియెన్స్ నిన్ను ఎక్కువగా ప్రేమిస్తారు.. నువ్వు తెలుగులో మాట్లాడేందుకు ప్రయత్నించు అని ప్రదీప్‌కు చెప్పాను. ఈరోజు ఆయన ఈవెంట్‌లో అద్భుతంగా మాట్లాడారు. అలాంటి డెడికేషన్ ఉంది కాబట్టే ప్రదీప్ ఈ స్థాయికి వచ్చాడు. ఏజీఎస్ అనేది నాకు హోం బ్యానర్. నెక్స్ట్ చిత్రాన్ని వాళ్ల బ్యానర్‌లోనే చేస్తున్నాను.

# 'మదరాసి' టైటిల్ గ్లింప్స్ విడుదల

శివకార్తికేయన్, ఎ.ఆర్. మురుగదాస్ కాంబినేషన్‌లో వస్తున్న హైఆక్టేన్ యాక్షన్ ఎంటర్‌టైనర్ మదరాసి. శివకార్తికేయన్ అమరన్‌తో తన కెరీర్‌లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌ను అందించారు. కెరీర్‌లో అత్యున్నత స్థాయిలో ఉన్న దర్శకుడు మురుగదాస్ ఈ సంవత్సరం రెండు మేజర్ ఫిలిమ్స్ అందించబోతున్నారు. శ్రీ లక్ష్మీ మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రం విజువల్ వండర్‌గా అద్భుత స్థాయిలో రూపొందుతోంది. శివకార్తికేయన్ పుట్టినరోజు సందర్భంగా, ఈ ఇంటెన్స్ యాక్షన్ ఎంటర్టైనర్ నుండి యాక్షన్‌ప్యాక్డ్ గ్లింప్స్‌తో ఈ చిత్రం టైటిల్ మదరాసిని రివిల్ చేశారు మేకర్స్. శివకార్తికేయన్ పూర్తిగా పవర్‌ప్యాక్డ్ అవతార్‌లో కనిపించారు. ఈ గ్లింప్స్ సినిమాలోని ఇతర కీలక పాత్రలను కూడా పరిచయం చేస్తుంది. టైటిల్ గ్లింప్స్‌లో సినిమాటోగ్రాఫర్ సుదీప్ ఎలామోన్ హైక్లాస్ విజువల్స్ ఆకట్టుకున్నాయి, రాక్‌స్టార్ కంపోజర్ అనిరుధ్ రవిచందర్ తన ఎలక్ట్రిఫైయింగ్ స్కోర్‌తో విజువల్స్‌ను ఎలివేట్ చేశాడు. తన ఇంటన్సీవ్ నెరేటివ్ గ్రిప్పింగ్ స్టోరీ టెల్లింగ్‌తో ఆకట్టుకునే ఎఆర్ మురుగదాస్ మదరాసితో సరికొత్త ఎక్సయిటింగ్ యాక్షన్‌ప్యాక్డ్ కథను చూపించబోతున్నారని గ్లింప్స్ ప్రామిస్ చేస్తోంది. హీరోయిన్ రుక్మిణి వసంత్‌కు ఇది మొదటి బిగ్గెస్ట్‌ప్రాజెక్ట్, విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, షబీర్, విక్రాంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్, అరుణ్ వెంజరమూడు ఆర్ట్ డైరెక్టర్. యాక్షన్ కొరియోగ్రఫీని కెవిన్ మాస్టర్, దిలీప్ మాస్టర్ పర్యవేక్షిస్తారు. టైటిల్ రివీల్, గ్లింప్స్ ఈ హైప్రొఫైల్ ప్రాజెక్ట్ కోసం ఎక్సయిట్మెంట్ పెంచాయి.



# 'హరిహర వీరమల్లు' ఫస్ట్ లుక్ పోస్టర్

పి పి ఆర్ ఫిలిమ్స్ పతాకంపై రాజా బిరుదుల, లావణ్య రామారావు, చినబాబు ప్రధాన పాత్రధారులుగా సుధాకర్ బుర్రి దర్శకత్వంలో తెరకెక్కిన లవ్ అండ్ యూత్ ఫుల్ ఎంటర్టైనర్ కాలగమనం. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఏపీ ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు, హరిహర వీరమల్లు నిర్మాత ఏయం రత్నం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫిలిం ఛాంబర్ సెక్రటరీ మోహన్ గౌడ్‌తో పాటు చిత్ర యూనిట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాత ఏయం రత్నం మాట్లాడుతూ, ఈ సినిమా టైటిల్ కాలగమనం ఇప్పటి పరిస్థితులు అనుగుణంగా ఉన్నట్టుంది. ఈ సినిమా సక్సెస్ అయ్యి నిర్మాతకు మంచి పేరు రావాలని కోరుకుంటున్నాను అని అన్నారు. చిత్ర దర్శక నిర్మాత సుధాకర్ బుర్రి మాట్లాడుతూ, లెజెండరీ ప్రొడ్యూసర్ ఏయం రత్నం మా పోస్టర్‌ను ఆవిష్కరించడం మా అదృష్టంగా భావిస్తున్నాము. సక్సెస్ ఫుల్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఆయన చేతుల మీదుగా ఈ పోస్టర్ ఆవిష్కరణ జరగటం మాకు ఎంతో బలాన్ని ఇచ్చింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలన్ని పూర్తయ్యాయి. మార్చి ఎండింగ్‌లో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకు



రానున్నాం. అలాగే మా ఈ కార్యక్రమంలో సహకరించిన మోహన్ గౌడ్‌కి, దయాల కెనడి బోస్, దొడ్ల చిన్నారావు, పిల్లెం రామారావుకి, కాప శ్రీనివాస రావుకి, మూల్పూరి లక్ష్మణ స్వామికి, నత్తా నాగేశ్వరరావుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను అన్నారు. హీరో రాజా మాట్లాడుతూ, ఏయం రత్నం లాంటిగొప్ప నిర్మాత చేతుల మీదుగా మా చిత్రం ఫస్ట్ లుక్ ఆవిష్కరించడం సంతోషంగా ఉంది. నాలాంటి అప్ కమింగ్ యాక్టర్స్‌కి ఆయన ఒక ఇన్స్పిరేషన్.

# 'ఇట్స్ ఓకే గురు' నుంచి లిరికల్ సాంగ్

చరణ్ సాయి, ఉషశ్రీ హీరో హీరోయిన్స్‌గా నటిస్తున్న సినిమా "ఇట్స్ ఓకే గురు". ఈ చిత్రాన్ని వండర్ బిల్ట్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్‌పై సురేష్ అనపురపు, బస్వ గోవర్ధన్ గౌడ్ నిర్మిస్తున్నారు. దర్శకుడు మణికంత ఎం రూపొందిస్తున్నారు. త్వరలో ఇట్స్ ఓకే గురు సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ సినిమా నుంచి నిలవదే నిలవదే.. లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. నిలవదే నిలవదే.. పాటను సంగీత దర్శకుడు మోహిత్ రెహ్మానియక్ బ్యూటిఫుల్‌గా కంపోజ్ చేయగా, లక్ష్మీ ప్రియాంక ఫీల్ గుడ్ లిరిక్స్ రాశారు. సిద్ధార్థ్ మీనన్ ఆకట్టుకునేలా పాడారు. ఈ పాట ఎలా ఉందో చూస్తే నిలవదే నిలవదే.. ఎదురుగా నా మది..తపన తెరచాటులో..తగని ఆరాటమే, రెండై ఉన్న ప్రాణాలే ఒకటయ్యాయిలా, నీతో ఉన్న కాలాలే మధురమే.. అంటూ మంచి లవ్ ఫీల్‌తో సాగుతుందీ పాట. నటీనటులు: చరణ్ సాయి, ఉష శ్రీ, సుధాకర్ కోమాకుల తదితరులు. టెక్నికల్ టీమ్: డీవోపీ, ఎడిటర్ సన్నీ.డి, మ్యూజిక్ మోహిత్ రెహ్మానియక్, బీజీఎం ఎ.జె. ప్రియన్ డైలాగ్స్: కడలి సత్య నారాయణ, చైతన్య, లిరిక్స్: లక్ష్మీ ప్రియాంక, రాహుల్ రెడిన్ఫినిటీ, ప్రణవ్ చాగంటి, బ్యానర్: వండర్ బిల్ట్ ఎంటర్ టైన్ మెంట్స్ పీఆర్‌ఓ జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్), నిర్మాతలు: సురేష్ అనపురపు, బస్వ గోవర్ధన్ గౌడ్, దర్శకత్వం మణికంత.ఎం.



# 'శ్రీలీల నయా లుక్'



శ్రీలీల నయా లుక్

# మార్చి 14న 'దిల్ రూబా' రిలీజ్

యంగ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా "దిల్ రూబా" మార్చి 14న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. ఈ సినిమాలో రుక్సర్ థిల్లాన్ హీరోయిన్‌గా నటిస్తోంది. "దిల్ రూబా" చిత్రాన్ని శివమ్ సెల్యులాయిడ్స్, ప్రముఖ మ్యూజిక్ లేబుల్ సారెగమ తమ నిర్మాణ సంస్థ అయినటువంటి ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తు న్నారు. వాలెంటైన్స్ డే సందర్భంగా రిలీజ్‌కు రావాల్సిన "దిల్ రూబా" సినిమా బెటర్ ఔట్ పుట్ కోసం పోస్ట్ పోన్ అయ్యింది. మార్చి 14న ఈ సినిమాను గ్రాండ్ రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ప్రమోషనల్ కంటెంట్‌తో "దిల్ రూబా" మూవీ లవర్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. "క" మూవీ బ్లాక్ బస్టర్ తర్వాత కిరణ్ అబ్బ వరం మంచి ఫామ్ లోకి వచ్చారు. ఈ నేపథ్యంలో "దిల్ రూబా" సినిమాపై అన్ని వర్గాల ప్రేక్షకుల్లో హై ఎక్స్ పెక్టేషన్స్ ఏర్పడుతున్నాయి. నటీనటులు: కిరణ్ అబ్బవరం, రుక్సర్ థిల్లాన్, తదితరులు. టెక్నికల్ టీమ్: పీఆర్‌ఓ: జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్) అండ్ దుడ్డి శ్రీను. ప్రొడక్షన్ డిజైనర్: సుధీర్, ఎడిటర్: ప్రవీణ్.కేఎల్ సినిమాటోగ్రఫీ:డానియేల్ విశ్వాస్.



# ముగ్గురు సూపర్ స్టార్స్‌తో రష్మిక మందన్న



నేషనల్ క్రష్ రష్మిక మందన్న పాన్ ఇండియా స్థాయిలో సాధిస్తున్న విజయాలు సర్ ప్రైజ్ చేస్తున్నాయి. ఈ విజయాలతో బాలీవుడ్ హీరోయిన్స్‌ను మించిన క్రేజ్ సొంతం చేసుకుంటోంది రష్మిక. ఇండియన్ బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్స్ అందుకుంటూ హీరోయిన్‌గా నెంబర్ వన్ పొజిషన్‌కు వెళ్లింది. ఆమె రీసెంట్‌గా మూడు బిగ్గెస్ట్ హిట్స్ దక్కించుకుంది. రణ్ బీర్ కపూర్ సరసన నటించిన యానిమల్, అల్లు అర్జున్‌కు జోడీగా చేసిన పుష్ప 2, వికీ కౌశల్‌తో కలిసి నటించిన ఛావా ఘన విజయాలు సాధించాయి. ఈ మూడు చిత్రాలతో హ్యాట్రిక్ హిట్స్ అందుకుంది రష్మిక మందన్న. ముగ్గురు స్టార్ హీరోలతో మూడు బ్లాక్ బస్టర్స్ ఇచ్చిన రష్మికకు సోషల్ మీడియాలో అప్రిషియేషన్స్ దక్కుతున్నాయి. ఈ సక్సెస్‌లు కొనసాగిస్తూ ప్రస్తుతం తన క్రేజీ లైనప్ కంటిన్యూ చేస్తోంది రష్మిక. సల్మాన్ ఖాన్ సరసన సికిందర్, నాగార్జున, ధనుష్ హీరోలుగా దర్శకుడు శేఖర్ కమ్ముల రూపొందిస్తున్న కుబేర సినిమాలతోతో పాటు ది గర్ల్ ఫ్రెండ్ మూవీలో నటిస్తోంది.

# 'జాబిలమ్మ నీకు అంతా కోపమా' మీట్ ది ప్రెస్

పా పాండి, రాయన్ వంటి బ్లాక్ బస్టర్ల తరువాత ధనుష్ 'జాబిలమ్మ నీకుఅంతా కోపమా' అంటూ దర్శకుడిగా మరోసారి అందరినీ మెప్పించేందుకు రెడీ అయ్యారు. ధనుష్ హోమ్ బ్యానర్ అయిన వండర్‌బార్ ఫిల్మ్స్, ఆర్‌కె ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 21న విడుదల చేయనున్నారు. తెలుగులో ఈ మూవీని ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్‌ఎల్‌పి విడుదల చేస్తోంది. ఈక్రమంలో చిత్ర యూనిట్ మీడియా ముందుకు వచ్చింది. ఈ మేరకు నిర్వహించిన ప్రెస్ మీట్‌లో.. జాన్వీ నారంగ్ మాట్లాడుతూ, 'మేం ఓ కొత్త లవ్ స్టోరీతో రాబోతున్నాము. 'జాబిలమ్మ నీకు అంతా కోపమా' ఫిబ్రవరి 21న అందరి ముందుకు రాబోతోంది. ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేసే అవకాశాన్ని ఇచ్చిన ధనుష్‌కి థాంక్స్. ఈ చిత్రం అందరినీ అలరిస్తుందని నమ్ముతున్నాను' అని అన్నారు. అనికా సురేంద్రన్ మాట్లాడుతూ, 'మా చిత్రం ఫిబ్రవరి 21న రాబోతోంది. అందరూ మా సినిమాను చూసి సపోర్ట్ చేయండి. మా చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తున్న ఏషియన్, సురేష్‌కు థాంక్స్' అని అన్నారు. నటి రబియా మాట్లాడుతూ, 'ఈ చిత్రంతోనే నేను ఇండస్ట్రీలోకి అడుగు పెడుతున్నాను. సినిమాను ఎంతో ఎంజాయ్ చేస్తూ చేశాం. మేం అందరం కొత్త వాళ్లమే. ఈ సినిమాను అందరూ ఆదరించండి. ఫిబ్రవరి 21న థియేటర్లోకి మేం అంతా రాబోతోన్నామ'ని అన్నారు. వెంకటేష్‌మీనన్ మాట్లాడుతూ, 'ఫిబ్రవరి 21న మా చిత్రం రిలీజ్ కాబోతోంది. మా సినిమాను అందరూ చూసి సపోర్ట్ చేయండి' అని అన్నారు. రమ్య రంగనాథన్ మాట్లాడుతూ, 'నాకు తెలుగు ఎక్కువగా రాదు. ఈ మూవీతోనే నేను తెరకు పరిచయం కాబోతోన్నాను. ఈ సినిమా ప్రమోషన్స్‌కు హైదరాబాద్ రావడం ఆనందంగా ఉంది. మా సినిమాను ఫిబ్రవరి 21న థియేటర్లో చూసి సపోర్ట్ చేయండి' అని అన్నారు. పవిష్ మాట్లాడుతూ, 'వెంకీ అట్లూరి వల్లే నేను కెమెరా ముందుకు రాగలిగాను. మా చిత్రం ఫిబ్రవరి 21న రాబోతోంది. అందరూ చూసి ఆదరించండి' అని అన్నారు.



# గడ్డి గులాబీతో ఆదాయం

**పూల వ్యాపారమవగానే గులాబీ, ఢిల్లీ, చామంతి... కొన్నిసార్లు చాలా ఖరీదైన పూలూ గుర్తొస్తాయి. కానీ గడ్డి గులాబీతోనూ సంపాదించొచ్చని ఊహించగలమా? అదే చేస్తోంది. పార్వతీ మోహనమ్!**



పార్వతి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. పనిదినాల్లో పడిన కష్ట మంతటినీ వారంతా ఇంటిదగ్గర పూలను చూడగానే మర్చిపోయేది. ఈమెది కేరళలోని ముహమ్మ గ్రామ్, ఉద్యోగమేమో కొచ్చిలో తనకి పోర్చ్యులకు (గడ్డి గులాబీ)లంటే ప్రాణం. ఎక్కడ భిన్నరకాలున్నాయన్నా తెచ్చేసుకునేది. వాటిని ఏకంగా అర ఎకరంలో పెంచేది ప్రతివారం ఇంటికి రావడం... ఆ వారంలో తన మొక్కలు ఎంత పెరిగాయో చూసుకుంటే ఒత్తికంతా ఎవరో తీసేసినట్టుగానే పోతుందట. ఈ అభిరుచి మొదలయ్యింది. లాన్‌లోనే పీజీ చదువుతుండగా, కాలేజీ మూతపడింది. ఆన్‌లైన్‌లో తరగతులకు హాజరవుతూ ఖాళీ సమయంలో తనకు నచ్చిన గడ్డిగులాబీను సేకరించడం మొదలు పెట్టిందట. తొలిరోజుల్లో 30 రకాలను సేకరిం చింది. వాటి ఫొటోలను ఫేస్ బుక్‌లో పంచుకుంటోంటే గార్డెనింగ్ గ్రూప్ సభ్యులు చాలామంది మాకూ కావాలని సంప్రదించడం మొదలుపెట్టారు. దీన్ని వ్యాపారంగా మార్చుకుంటే ఎలా ఉంటుంది అని ఆలోచించిన పార్వతి చిన్న కుండీల్లో మొక్కలను ఉంచి, అమ్మకానికి పెట్టింది. ఆర్డర్లు మొదలయ్యాయి. తన వ్యాపారం గురించి ఎవరో



యూట్యూబర్ పోస్టు పెడితే వైరలైంది. దీనితో ఆర్డర్లు పెరిగాయి. ఎలాగూ ఆదాయం వస్తోంది కదా... మరిన్ని రకాలను తెప్పించుకుంటూ వెళ్లింది. అలా ఇప్పుడు తన దగ్గర 300 రకాల గడ్డి గులాబీ లేదా నాచు పూల మొక్కలు ఉన్నాయి. వీటిలో థాయ్‌లాండ్ బ్రెజిల్ నుంచి తెప్పించుకున్నవి ఉన్నాయి. వాట రేటు పెంచుతూ... కుండీల్లో అమ్ముతూ ఆదాయాన్ని పొందుతోంది. నెలకు వీటిద్వారా కనీసం రూ. లక్షకుపైగా రాబడి పొందుతోంది. ఉద్యోగం చేస్తూనే దీన్ని నిర్వహిస్తోంది. అభిరుచిని ఆదాయంగా మలుచుకున్న 23 ఏళ్ల పార్వతి ఆలోచన భలేగుంది! □

**అబ్బా టైలర్ 'ఫోన్ ఎత్తట్లేదు' 'వేడుక దగ్గర పడుతోంది ఇంకా దుస్తులు కుట్టడం అవ్వలేదు' డ్రెస్... పెట్టడం కోసం ఎన్నిసార్లు తిరగాల్సి వస్తోందో... దుస్తులు కుట్టించుకునే అమ్మాయిల నుంచి తరచూ వినపడే మాటలే ఇవి. టైలరింగ్‌పరంగా ఎదురయ్యే ఇలాంటి సనుస్యలన్నింటికీ చెక్ పెట్టాలనుకున్నారు అనమాయ రెడ్డి అలా తీసుకొచ్చిన 'రన్ టైలర్' తక్కువ వ్యవధిలోనే రూ. కోట్ల సంస్థగా తీర్చిదిద్దారు. ఆ ప్రయాణాన్ని తెలుసుకుందాం..**



ఒకరు చెప్పింది కాదు... ఏదైనా సొంతంగా చేయాలన్నది నా తత్వం. మాది కడప. వ్యాపార స్థులమే... కాకపోతే సంప్రదాయ కుటుంబం. అమ్మాయిలను త్వరగా బయటికి పంపేవాళ్లు కాదు. నాకేమో ప్రపంచాన్ని చూడాలి. సొంతంగా ఏదైనా చేయాలని ఉండేది. ఉన్నత చదువులు నాకా అవకాశాన్నిచ్చాయి. వ్యాపారాలకు సంబంధించి అడిగా తను చెప్పిన విషయాలు నాకు ఆసక్తిగా తోచాయి. దీంతో హైదరాబాద్, ఢిల్లీ సహా భిన్న నగరాల్లో చిన్నా పెద్దా టైలర్లందరి దగ్గరికి వెళ్లా, కస్టమర్ల ఇబ్బందులు, టైలర్ల సమన్వయ లోపమే కాదు... కొందరు నైపుణ్యమున్నా ఎదగలేక పోవడం గమనించాక ఈ రంగంలో అడుగుపెట్టాలనుకున్నా, 2022లో 'రన్ టైలర్' మొదలు పెట్టా, మొదట్లో నేనూ అందరిలాగే టైలరింగ్ సేవలే అందించా. 2023లో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాక స్టిచింగ్ సంస్థనే ఉండకూడదు. డిజిటల్ అగ్రిగేటర్‌గా మారాలి అనుకున్నా. ఇదే నా టర్నింగ్ పాయింట్. ముందు ఒక క్యారవ్యాన్ తీసుకుని కమ్యూనిటీలకు వెళ్లేవాళ్లం. ఇళ్ల నుంచి దుస్తులు తీసుకొచ్చి కుట్టి, తిరిగిచ్చేవాళ్లం. తరువాత సైట్ ఏర్పాటుకు సౌకర్యాలు వెబ్‌సైట్. ఆల్టరేషన్, సాదా

# రన్‌టైలర్.. కోట్లలో వ్యాపారం..

ఎక్కడ మీటింగ్‌లున్నా వెళ్లిపోయేదాన్ని, ట్యూషన్లు చెప్పా, ఎంబీఏ చదువుతున్నప్పుడు మార్కెటింగ్ కూడా చేశా, చివరికి మనసు వ్యాపారం వైపే మళ్లింది. పెళ్లయ్యాక హైదరాబాద్‌లో స్థిరపడ్డా. ఇక్కడే డేకర్, హోమ్ రెస్టారంట్, వెల్నెస్ సంస్థ,.. ఇలా ఒక్కొక్కటి ప్రయత్నింస్తూ వచ్చా. కానీ విజయం సాధించలేక పోయా, టెక్నాలజీతో ఫుడ్, ట్రావెలింగ్ వంటి పరిశ్రమలెన్నో అప్‌డేట్ అయ్యాయి. అలా నేనూ ఈసారి ఏదైనా కొత్తగా ప్రయత్నించాల నుకుంటున్నా.

**ఆమె దారి మార్చింది:** ఏం చేయాలా అని ఆలోచిస్తున్నప్పుడు... మా పనిమనిషి ఓరోజు పెద్ద కవర్తో రావడం గమనించా. ఆమెని అడిగితే 'నేను ఇంటిపనితోపాటు జాకెట్లూ కుడతాను. సీజన్‌లో రూ.40 వేల వరకూ సంపాదిస్తా'నంటే ఆశ్చర్యమేసింది. కూర్చోబెట్టి సీజన్, అన్‌సీజన్ ఏంటని బ్లవుజులు చిన్న టేబుల్ ఇస్తే ఇంట్లోనే కుట్టిస్తాం. స్టోన్ వర్క్, పెద్ద అలంకరణ దుస్తులు. అవుట్లెట్కి తీసుకెళ్తాం కుట్టాక ఆల్టరేషన్ అక్కడికక్కడే చేస్తాం. ఇంటికే వచ్చి కుట్టివ్వ ఆలోచనకి సోషల్‌మీడియాలో ఆదరణ వచ్చింది. దాంతో వేలమందికి చేరువయ్యాం. కొని బొటిక్‌లను అన్‌బోర్డ్ చేసుకున్నాం. ఫ్రాంచైజీలనూ ఇస్తున్నాం. వాళ్లకి సాంకేతిక అంశాల్లో, వనరులపరంగా సాయమందిస్తాం. రూ.2.5 కోట్లు పెట్టుబడి పెట్టా. నెలల్లో రూ.100కోట్ల వ్యాపారంగా మారబోతున్నాం. త్వరలో యాప్‌ని అందుబాటులోకి తేబోతున్నాం.

**పట్టించుకోవద్దు....** మొదట్లో వైఫల్యాలు వచ్చినప్పుడు నాపై నాకే సందేహంమొచ్చింది. కానీ ఈసారి గట్టిగా ప్రయత్నించాలని చాలా కష్టపడ్డా. మనమేదైనా గట్టిగా ప్రయత్నించే ప్రకృతీ సాయపడు. అయితే మధ్యలో ఆపకూడదు. ఒకప్పుడు నేనూ సాధారణ మహిళనే విజయవంతమైన వాళ్లు బ్యాలెన్స్ చేసుకుంటారు. అవరోధాలు ఎదురైనప్పుడు ఎలా అధిగమిస్తారో గమనిస్తూ నన్ను నేను మార్చుకున్నా. వినయ్ మహేశ్వరి అని ఇండియా టీవీ సీఈఓ నాకు మెంటా మీటింగ్లు, పనితో నిల్వ ఉంటా. బాబు ఇబ్బంది పడకూడదనీ, ముఖ్యంగా వాడు ఎవడా ఆధారపడకూడదనీ వంట, సొంతంగా హోమ్ వర్క్ చేయడం నేర్పించా. ఇది అమ్మ కల సాదించడానికి కష్టపడుతోంది. అర్థం చేసుకోమని మాత్రం చెప్పా. అమ్మాయిలకి చెప్పేదొకటే మీరు చేసేది సరైనదైతే చేసుకుంటూ వెళ్లండి. ఎప్పుడైనా కలని బయట పెట్టినప్పుడు అర్థం కొందరు వద్దంటారు. విఫలమవు తామేమోనని కొందరు నెగెటివ్‌గా చెబుతున్నారు. అలాంటప్పు చెప్పకపోవడమే మేలంటాను. ఇక, ఇబ్బంది లంటారా... ఇంట్లో ఉన్నా వస్తాయి. □

# పెంపకాలు పలు రకాలు !

అమ్మాయి గుమ్మం దాటడానికి భయపడతాడు. పొరుగింటి పిల్లాడేమో స్వేచ్ఛగా మనసుకు నచ్చింది చేస్తుంటాడు. ఇక ఎదురింటి పిల్లాడు రాము ఎప్పుడూ ఏదో కోల్పోయినట్లు దిగులుగా ఉంటాడు. ఇదంతా తల్లిదండ్రులు పెంపక ప్రభావమే అంటున్నారు. నిపుణులు. పెంపకాలు పలురకాలనీ, ఏ రకమైనదైతే పిల్లలు మంచి వ్యక్తిత్వం ఉన్నవారిగా ఎదుగుతారో చెబుతున్నారు.



మీకేం తెలియదు. చెప్పినట్లు వినండి. బాగుపడతారు అంటూ పిల్లలను దారిలో పెడుతున్నామనుకుంటారు కొందరు తల్లిదండ్రులు, ఈ 'అధికారపూర్వకమైన పెంపకంలో పిల్లలకంటూ సొంత నిర్ణయం, అభిప్రాయం ఉండదు. అమ్మానాన్న చెప్పినదాన్ని శిరసావహిస్తూ, ఆ మార్గంలోనే నడవాలి. ఈ రకమైన పెంపకంలో కొన్నిసార్లు పిల్లలపట్ల తల్లిదండ్రులు నిరంకుశత్వంతో ప్రవర్తిస్తారు. ఆంక్షలతో పెరగడంవల్ల పిల్లలు తమలోని భావోద్వేగాలను వ్యక్తీకరించలేకపోతారు. ఇది క్రమేపీ వాళ్లను కుంగుబాటుకు గురిచేస్తుంది. అలాగే తమకంటూ అభిరుచి లేదా మనసుకు నచ్చిన కెరియర్ను ఎంచుకునే స్వేచ్ఛ లేకపోవడంతో స్వీయ నిర్ణయాలు తీసుకునే సామర్థం కొరవడుతుంది. నచ్చిన పని చేయలేకపోయామనే నిరాశ, నిస్పృహలకు భవిష్యత్తులో ఏదో ఒక సమయంలో గురవుతారు.

**నిరక్ష్యధ్లోరణితో.....** ఈ రకమైన పెంపకంలో పెద్దవాళ్లు పిల్లలపట్ల శ్రద్ధవహించరు. వాళ్ల అవసరాలు తీర్చడంతో తమ బాధ్యత తీరిందనుకుంటారు. పిల్లల కోసం సమయాన్ని కేటాయించి వాళ్ల ఆలోచనలను పంచుకోవాలని తల్లిదండ్రులకు అనిపించదు. దీంతో పిల్లలు ఒత్తిడి, ఆందోళనలకు లోనవుతారు. ఒంటరితనానికి గురవుతారు. హైపర్యాక్టివ్గా ఉంటూ తీవ్ర కోపం, నిరక్ష్యధ్లోరణి, అవిదేయత ప్రదర్శిస్తారు. చదువులో వెనకబడతారు. జీవన నైపుణ్యాలు కొరవడతాయి. ముఖ్యంగా భావోద్వేగాల నియంత్రణ ఉండదు. మానవ సంబంధాలను మెరుగుపరచు కోలేరు. అడిగిన దానికల్లా ఒకే చెబుతూ, నీ ఇష్టమొచ్చినట్లు చేయి అంటూ పూర్తి స్వేచ్ఛనిచ్చే తల్లిదండ్రుల వల్ల కూడా పిల్లలు మంచి భవిష్యత్తును పొందలేరు. బాల్యం నుంచి సరైన మార్గదర్శకం చేస్తూ, వాళ్ల అభిరుచులను గుర్తించి ప్రోత్సహించాలి. పిల్లల కోసంప్రత్యేకంగా సమయాన్ని కేటాయించి భావోద్వేగాలను సమన్వయం చేయడంనేర్పాలి. స్ఫూర్తి కథనాలతో పిల్లల్లో లక్ష్యాలను నింపాలి. జాలి, దయ, ప్రేమ పిల్లలపై చూపిస్తేనే, తిరిగి అది ఇతరులకు వాళ్లు అందించగలుగుతారు. అప్పుడేవాళ్లలో ఆరోగ్యకరమైన ఎదుగుదల కనిపిస్తుంది. □

**ఆసుపత్రినుంచేసాధించింది. కూర్చొని తదేకంగా సన్నద్ధమవుతోందా అమ్మాయి. అమ్మ, నాన్న, అక్క... చదివింది చాల్లే... ఇక రెస్ట్ తీసుకోమంటున్నారు. మధురిమ వైద్య మాత్రం 'ఇంకొంచెం సేపే' అంటోంది కానీ పుస్తకం వదలడమే ఆమె లక్ష్యం డాక్టర్ అవ్వడం మరి. తనెక్కడ నీరసపడుతుందో అని మిగతా భయం.** అంతలా కష్టపడింది కాబట్టే నీట్లో ర్యాంకు పునాది. అది విన్న క్షణం ప్రతి ఒక్కరి కళ్లలో ఆనందభాష్పాలు. మధురిమ అంతలా చదివింది. తరగతి గదిలో ఇంట్లోనో కాదు.

# ఆసుపత్రి నుంచే సాధించింది



ఆసుపత్రి బెడ్డు మీద ఆమెకు అరుదైన రక్త క్యాన్సర్. అది కూడా స్టేజ్ 4-12 ఏళ్ల వయసులో బయటపడింది. ఈమెది త్రిపుర దగ్గర చిన్నపల్లె. క్యాన్సరని తెలిశాక ముంబయి ఆసుపత్రే ఇలా అయింది. కీమో థెరపీ, రేడియేషన్, బోన్మ్రో ట్రాన్స్ ప్లాంటేషన్.... ఇలా ఎన్నో చికిత్సలు, ఆసుపత్రిలో స్నేహితులను మాత్రమే మిస్ అయ్యేది మధురిమ. కానీ చదువులో వెనకబడలేదు. పదిలో 96, ఇంటర్లో 91 సీట్లలో 87 పర్సంటైల్ ఉంది. ఇన్ని చికిత్సల మధ్య శరీరం సహకరించేది కాదు. ఇమ్యూనిటీ తగ్గి పదే పదే అనారోగ్యాల పాలయ్యేది. అయినా పట్టు వదలలేదు మధురిమ ఆలైన్ తరగతులకు హాజరు అయ్యేది. స్టడీమెటీరియల్లను తెప్పించుకుని చదివేది. తన కష్టం ఫలించింది. 'చిన్నప్పుడు ఒక టీచర్' నీవంతు నువ్వు ప్రయత్నించు... ఫలితం అదే వస్తుంది' అన్న మాటలు నా మనసులో నాటుకు పోయాయి. అందుకే ప్రయత్నించు. అమ్మా నాన్నలు, అక్క తోడు నిలిచారు. నేనీరోజు బతికున్నా నంటే డాక్టర్లే కారణం. అందుకే ఆ రంగంలోకి అడుగు పెట్టి అందరికీ సాయ పడాలన్నది నా కోరిక అంటోంది మధురిమ. జీవితంలో ఒడుదొడుకులు సహజం. అలాంటప్పుడు కాస్త విరామం తీసుకోండి తిరిగి శక్తి పుంజుకుని ప్రయత్నిస్తే విజయం ఖాయమన్న సలహా ఇస్తోంది. □

# బ్రేక్ ఫాస్ట్ చేస్తున్నారా !

**కర్ణుడి చావుకి చాలా కారణాలున్నట్లే మహిళలు బ్రేక్ ఫాస్ట్** చేయకపోవ దానికి కారణాలు బోలెడు. సమయం సరిపోక, అనలిటిక బరువు పెరుగుతామని, ఏం తినాలో తెల్చుకోలేని అలవాటులేద ఇలా ఎన్నో కానీ శ్రీకృష్ణతో కలిగే లాలాల్ని తెలుసుకుంటే కచ్చితంగా మీ ఆలోచనల్లో మార్పు రావాల్సింగ్రాఫెర్లో తగు మొత్తంలో ప్రొటీన్లు, ఫైబర్, కొవ్వులు ఉంటే అది శరీరంలోని గ్లూకోజ్ స్థాయుల్ని స్థిరీకరిస్తుంది. శక్తిని ఇవ్వడమే కాదు. తిన్నామన్న భావనతో ఆరోజు ఆహారాన్ని మతంగా తీసుకునేలా చేస్తుంది.

.. రాత్రి నిద్రకముందు ఏదైనా తినుంటే కొందరిలో ఉపయానికి జీర్ణం కాదు దానివల్ల ప్రొఫాస్ట్ మావేస్తారు. తర్వాత అభ్వతే ఒకేసారి ఎక్కువ మోతాదులో తనే ప్రమాదం ఉంది. తద్వారా మీ జీర్ణవ్యవస్థ మీద ఒత్తిడి ఎక్కువవుతుంది. విశ్రాంతి తీసుకోవాల్సిన సమయంలో ఎక్కువ పనిచెబితే నిద్ర లేమి. బరువు పెరగడంలాంటి సమస్యలు తలెత్తుతాయి. జాగ్రత్తగా గమస్తే ఫాస్ట్ తీసు కోమంటూ కోటీరం చాలా సంకేతాలు ఇస్తుంది. శరీరానికి శక్తి కావాలి, రాత్రి భోజనం తర్వాత గ్యాప్‌కూడా ఎక్కువగా ఉంచటంవల్ల ఆకలి అనిపిస్తుంది. అలాగే కొన్ని నెల, సంవత్సరాలు తినకుండా ఉంటే శరీరం దానికి అలవాటు పడిపోతుంది. రోజులు అలవాటు చేసుకుంటే మళ్లీ శరీరు స్పందించే తీరు సాధారణమవు తుంది.! టీ, కాపీలు అకలిని తగ్గిస్తాయి. కాస్త శక్తినీ ఇస్తాయి. కానీ అది కొద్ది సేపే ఆ తర్వాత ఇకని మొదలవుతుంది. ఇప్పుడు



నచ్చినవన్నీ ఒక్కొక్కటిగా తినడం మొద లు పెట్టి ఎక్కడి వరకూ వెత్తామో తెలీదు. ఇక ఉన్నా లేక పోయినా పొద్దున్న ఏదో ఒకటి తినాల్సిందే కాస్త యోగర్ట్, అరటి పండు తీసుకున్నా మంచిచే . కొందరు ఏది మంచిదో తెల్చుకోలేక మానేస్తుంటారు. కచ్చితంగా ఇవే తినా లన్న నియమం లేదు. ప్రాంతానిననబట్టి, అందుబాటులో ఉన్న వాటినిబట్టి నచ్చింది తీసుకోవచ్చు. బ్రేక్‌ఫాస్ట్‌తో లాభాలు అనేకం.. బరువు తగ్గడం లేదా అదుపులో ఉండటం జరుగుతుంది. భిన్నమైన పోషకాలు అందడంవల్ల గుండె ఆరోగ్యం మెరుగవుతుంది. ఆందోళనను పరిష్కరిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే జీవితకాలాన్ని పెంచుతుంది. □

# మెడపై ముడతలు పడుతుంటే..

**వయసు పెరుగుగున్న కొద్దీ మెడ వద్ద చర్మం వదులుగా మారి ముడతలు పడడం, సన్నని గీతలు రావడం.. వంటి వృద్ధాప్య ఛాయలు కనిపిస్తుంటాయి. వీటికి చెక్ పెట్టి యవ్వనంగా కనిపించాలంటే కొన్ని చిట్కాలు పాటించాలంటున్నా సౌందర్యనిపుణులు.**



**మర్దన మృదువుగా..!** ముందుగా గోరువెచ్చని నీళ్లతో, ఆపై నూనె రహిత క్లెన్సర్తో ముఖం, మెడ భాగాలను శుభ్రం చేసుకోవాలి. ఆపై కొద్దిగా ఆలివ్ నూనె తీసుకొని చేతి మునివేళ్ల సహాయంతో ఈ నూనెను మెడ వద్ద అప్లై చేస్తూ గుండ్రంగా రుద్దుతూ రెండు నిమిషాల పాటు మృదువుగా మర్దన చేయాలి. ఇలా మెడ చుట్టూ ఆలివ్ నూనెతో మర్దన చేయడం వల్ల అక్కడి చర్మకణాలకు సహజ తేమ అందడమే కాకుండా వదులైన చర్మం తిరిగి బిగుతుగానూ మారుతుంది.

**వ్యాయామం..** మెడ భాగానికి సంబంధించిన వ్యాయామాలు తప్పకుండా చేయడం ద్వారా అక్కడ చర్మకణాలు పునరుత్తేజితమవుతాయి. ఫలితంగా కొలాజెన్ ఉత్పత్తే అక్కడ చర్మం బిగుతుగా మారుతుంది. అక్కడ మెడ భాగం వద్ద చర్మంపై ఉండే ముడతలు తగ్గుముఖం పట్టడమే కాదు.. వదులుగా మారిన చర్మం తిరిగి బిగుతుగా మారుతుంది.



**తెల్లసొన, తేనెతో..** కోడిగుడ్డులోని తెల్లసొనలో రెండు చెంచాల తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్ర మాన్ని ముఖం, మెడకు ప్యాక్ వేసుకోవాలి. 15 నిమిషాల పాటు ఆరనిచ్చి తర్వాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికోసారి క్రమం తప్పకుండా ఈ ప్యాక్ అప్లై చేసుకోవడం వల్ల త్వరితగతిన ఫలితం ఉంటుంది.

**పెరుగు, నిమ్మరసంతో...** రెండు చెంచాల పెరుగులో రెండు చుక్కల నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖం, మెడ వద్ద ప్యాక్ అప్లై చేసుకోవాలి. తర్వాత పది నిమిషాల పాటు మృదువుగా మర్దన చేసు కోవాలి. అనంత రం ఐదు నిమి షాల పాటు అలాగే



ఉంచుకొని ఆపై గోరువెచ్చని నీటితో కడిగేసు కోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే ఫలితం ఉంటుంది.

**కలబందతో..** కలబంద గుజ్జు, తేనె.. చెంచా చొప్పున ఒక బౌల్లోకి తీసుకొని బాగా మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖం, మెడ వద్ద ప్యాక్ వేసి 15 నిమిషాల పాటు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీళ్లతో ముఖం శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తే మెడపై ఉన్న ముడతలు తగ్గుతాయంటున్నారు నిపుణులు. □

# లోభత్వంతో మోక్షమా ?

ఒక వ్యాపారి ఓ సాధువును 'నేను ముక్తిని పొందాలంటే ఏం చేయాలో చెప్పండి స్వామీ!' అనడిగాడు. దానికాయన 'మహాత్ములు చెప్పిన మార్గాన్ని అనుసరించాలి. అభాగ్యులకు దాన ధర్మాలు చేయాలి! అన్నాడు. పిసినారి అయిన ఆ వ్యాపారి ఎక్కువ ఖర్చుపెట్టేందుకు మనసొప్పక, రోజూ పిడికెడు బియ్యం దానం చేయడం ప్రారంభించాడు. కొన్నాళ్లకు మళ్లీ సాధువు వద్దకు వెళ్లాడు. 'నేను చెప్పినట్లు దాన ధర్మాలు చేస్తున్నావా? అంటూ ప్రశ్నించా డాయన. "అవును స్వామీ! రోజూ పిడికెడు బియ్యం ఇస్తున్నాను' బదులిచ్చాడు వ్యాపారి. లోభి అంతరంగం స్వామీజీకి అర్థమైంది. ఏమీ బదులివ్వకుండా.. పక్కనున్న చెట్టు మొదల్ని గోటితో గిల్లసాగాడు. అది లోభి స్వామి మీరే ఏమి మాట్లాడకుండా చెట్టును గిల్లుతున్నారు. మధ్యలో ఆకాశం వంక చూస్తున్నారు. నాకేమీ అర్థం కాలేదు అన్నాడు. 'ఏం లేదయ్యా' నేనీ గోటితో చెట్టును నరుకుతున్నాను. నువ్వలా చూస్తుండు' అన్నాడు సాధువు. ఆ మాటలకు వ్యాపారి నవ్వి అదేంటి స్వామీ! గోటితో చెట్టును నరుకుతున్నారా? గొడ్డలితో చేయాల్సిన పనిని గోటితో చేస్తే అయ్యే పనేనా? అంటూ వ్యంగ్యాస్త్రం విసిరాడు. అప్పుడా సాధు పుంగవుడు పెడికెడు బియ్యంతో మోక్షం ఆశిస్తున్నావు. అదే సాధ్యమైతే, గోటితో చెట్టును నరకటం సాధ్యం కాదా?! అంటూ ఎదురు ప్రశ్నించాడు. ఆ మాటలతో, వ్యాపారి కళ్లు తెరుచుకున్నాయి. తన లోభత్వం, దురాశ తెలిసొచ్చాయి. సాధువుకు నమస్కరించి వచ్చాడు. అప్పటి నుంచి విరివిగా దానాలు చేయటం ప్రారంభించాడు. □

ఆధ్యాత్మికం

# పులిహోర పౌడర్ ఇంట్లోనే..

**పూజ, వ్రతం, పెళ్లి, పేరంటం.. ఇలా ఎన్నో సందర్భాల్లో పులిహోర తప్పని సరిగా ఉంటుంది.** దీన్ని ఇష్టపడనివాళ్లు దాదాపుగా ఉండరు. చింతపండు పులుసు ఉడికించటానికి ఎక్కువ టైం పడుతుంది. పులిహోర మిక్స్ గనుక ఉందంటే క్షణాల్లో పనైపోతుంది. అది కొనకుండా మనమే చేసుకోవచ్చు. అందు కోసం.. యాపిల్ పండంత చింతపండు, అందులో ఎండు సగం బెల్లం, అర కప్పు కొబ్బరి తురుము, 6 చెంచాల ఉప్పు (మీకు తగ్గట్టు కాస్త ఎక్కువలేదా తక్కువ వేసుకోవచ్చు), 5 చెంచాల నువ్వులు, 15ఎండుమిరప కాయలు, 4 చెంచాల చొప్పున శనగ, మినప్పప్పులు, జీలకర్ర, ధనియాలు, అరంచా, మిరియాలు, ఆవలు



**..తాలింపు..** 5 చెంచాల పల్లీలు, నువ్వులు, 2 చెంచాల చొప్పున శనగ, మినప్పప్పులు, చెంచ ఆవాలు, చారెడు జీడిపప్పు, పావు కప్పు నూనె, ఆరేడు కరివేపాకు రెబ్బలు తీసుకోవాలి. **ఎలా చేయాలంటే..** నువ్వులు, ఎండుమిర్చి, శనగ మినప్పప్పులను విడివిడిగా వేయించాలి. వాటిని.. ఆవాలు, మెంతులు, మిరియాలు, ధనియాలు, జీలకర్రలను మంచి వాసన వచ్చేదాకా వేయించాలి. అన్నీ చల్లారాక కొబ్బరి తురుము, పసుపు, ఇంగువ, జత చేసి గ్రైండ్ చేయాలి. చింతపండు పొడిపొడిలాడేలా దాన్ని కూడా కొంచెం వేయించి.. బెల్లం పొడి, ఉప్పు కలిపి నూరి.. పప్పుల మిశ్రమంలో కలపాలి. ప్యాన్‌లో నూనె వేడయ్యాక.. పల్లీలు, ఆవాలు, శనగ పప్పు, మినప్పప్పు, జీడిపప్పు, నువ్వులు, కరివేపాకు ఒక్కొక్కటిగా వేయాలి. ఈ తాలింపు చల్లారనిచ్చి.. పొడర్లో కలపాలి. దీన్ని తడిలేని గాలి చొరబడని సీసాలో భద్రం చేసుకుంటే సరి. □

वित्त मंत्रालय
भारत सरकार
सत्यमेव जयते

# ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం



केन्द्रीय बजट 2025-2026

## దేశానికి ప్రయోజనం చేకూర్చే ఎంఎస్ఎంఈలకు ప్రయోజనాలు

అన్ని రంగాలకు చెందిన ఎంఎస్ఎంఈల్లో పెట్టుబడులు, టర్నోవర్ పరిమితులు వరుసగా 2.5 రెట్లు, 2 రెట్లు పెంపు

పెంచిన రుణ హామీలు :

- సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు : రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు
- అంకుర సంస్థలకు : రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్లకు
- అద్భుత పనితీరుతో ఎగుమతులు నిర్వహించే ఎంఎస్ఎంఈలకు: రూ.20 కోట్ల వరకు

ఉద్యమ్ పోర్టల్లో నమోదు చేసుకున్న సూక్ష్మ తరహా పరిశ్రమలకు రూ.5 లక్షల పరిమితితో క్రెడిట్ కార్డులు

22 లక్షల ఉద్యోగాల కల్పన, 4 లక్షల కోట్ల టర్నోవర్ లక్ష్యంగా తోలు, పాదరక్షల పరిశ్రమాభివృద్ధికి ప్రత్యేక పథకం. వెట్ బ్లూ లెదర్ దిగుమతులకు ప్రాథమిక కస్టమ్ సుంకం నుంచి పూర్తిగా మినహాయింపు. క్రస్ట్ లెదర్ ఎగుమతులపై విధిస్తున్న 20% సుంకం తొలగింపు

తొలిసారి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగే ఎస్సీ, ఎస్టీ మహిళలతో సహా 5 లక్షల మంది మహిళలకు వచ్చే ఐదేళ్లలో రూ.2 కోట్ల వరకూ రుణాలు

LI-ION

లిథియం-అయాన్ బ్యాటరీ (మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రిక్ వాహనాలు)ల దేశీయ తయారీని పెంచే దిశగా 63 కొత్త ముడి సరుకులకు పన్ను మినహాయింపు

DUTY FREE

కోబాల్ట్ పౌడర్-వ్యర్థాలు, లిథియం అయాన్ బ్యాటరీల తుక్కు, సీసం, జింకు మరో 12 కీలక ఖనిజాలపై ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీ నుంచి పూర్తి మినహాయింపు

వ్యాపార నిర్వహణకు అవసరమైన డాక్యుమెంట్ల పరిశీలన, మరింత సులభంగా రుణ సదుపాయాలు, సుంకేతర అడ్డంకుల తగ్గింపు, అంతర్జాతీయ లావాదేవీల్లో మరింత సౌలభ్యం కల్పించేందుకు వీలుగా 'BharatTradeNet' (BTN) ఏర్పాటు.

2030 ఏప్రిల్ 1కి ముందు ఏర్పాటు చేసిన అంకుర సంస్థలకు ప్రయోజనాలు అందుబాటులోకి

CBC 15201/13/0010/2425


Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot Nos, 56,27,28, Block GXX, Auto Nagar, VIJAYAWADA-520007. Cellphone : 9848041146, RNI No.64861/96, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.